మిరప రైతుకు నష్టాల ఘాటు

- తెగుళ్లతో తగ్గిన దిగుబడి
- పడిపోయిన ధర

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 189 | విజయవాడ, సోమవారం 10 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 10 February 2025 | Rs

రోహిత్ ధనాధన్..

రెండో వన్డేలో భారత్ ఘన విజయం

- 2-0తో వన్డే సిరీస్ టీమ్ ఇండియా వశం
- రాణించిన శుభ్‌మన్, శ్రేయస్, అక్షర్ పటేల్

8

దండకారణ్యంలో ఆగని నెత్తుటేర్లు

బీజాపూర్ అడవుల్లో పోలీసు కాల్పులు...31 మంది మావోయిస్టులు మృతి

- ఎదురుకాల్పుల్లో ఇద్దరు జవాన్లు మరణించారని అధికారుల ప్రకటన
- చత్తీస్‌ఘడ్‌లో రెండవ భారీ ఎన్‌కౌంటర్

దండకారణ్యంలో తుపాకులు మోగుతూనే ఉన్నాయి. నెత్తుటి ఏరులు పారుతూనే ఉన్నాయి. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆదివారం నాడు 31 మంది మావోయిస్టులు మరణించారు. ఎదురు కాల్పుల సంఘటనలో ఇద్దరు జవాన్లు కూడా మృతి చెందారని బస్తర్ ఐజి ప్రకటించారు. 2026 నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామన్న కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన అనంతరం భద్రత దళాలు మరింత ఉధృతంగా కార్యకలాపాలు చేపట్టినట్లు చెబుతున్నారు.



ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలు

ప్రజాశక్తి-చర్ల

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, నారాయణపూర్‌లను ఆనుకుని ఉన్న మహారాష్ట్ర సరిహద్దులోని ఇంద్రావతి జాతీయ ఉద్యానవన ప్రాంతంలో పోలీసులు ఆదివారం ఉదయం జరిపిన కాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మరణించారు. ఛత్తీస్‌గఢ్ చరిత్రలోనే ఇది రెండో భారీ ఎన్‌కౌంటర్. గతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 41మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. తాజా ఘటనలో మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి చెందారని,మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాని బస్తర్ ఐజి సుందర్‌లాల్ ప్రకటించారు.

300 మంది పోలీసులు

ఈ సంఘటనలో దాదాపుగా 300 మంది పోలీసులు పాల్గొన్నట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దు నేషనల్ పార్క్ కీకారణ్యంలో ఈ సంఘటనలో జరిగింది. ఆ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో డిఆర్జీ, ఎస్‌టిఎఫ్ బస్తర్ ఫైటర్స్ దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు అధికారులు తెలిపారు. తెల్లవారు జామునుండే ఈ గాలింపుచర్యలు మొదలయ్యాయని, ఆ సమయంలోనే మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారని, దీనికి భద్రతాదళాలు ప్రతిస్పందించాయని వారు చెబుతున్నారు. అనంతరం జరిపిన గాలింపులో 31 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు తేలిందని, మృత దేహాలను కూడా స్వాధీనం చేసుకున్నామని బస్తర్ ఐజి సుందర్‌లాల్ చెప్పారు.

మావోయిస్టుల కాల్పుల్లో డిఆర్‌డి హెచ్‌సి నరేష్ ధ్రువ్, ఎస్‌టిఎఫ్ కానిస్టేబుల్ వాసిత్ రౌటే మృతి చెందారని, డిఆర్‌జీ కానిస్టేబుల్ జగ్గు కల్ము, ఎస్‌టీఎఫ్ కానిస్టేబుల్ గులాబ్ మాండవి గాయపడ్డారని ఆయన తెలిపారు. ఘటనాస్థలంలో పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కాల్పుల్లో నేషనల్ పార్క్ ఇంద్రావతి కమిటీ తోపాటు తెలంగాణ మావోయిస్టు పార్టీ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి నుండిఇప్పటివరకు 76 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి జరిగిన పలు సంఘటనల్లో 219 మంది మావోయస్టులు మరణించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

నత్తనడకన జల్‌జీవన్

- రాష్ట్రం అడిగింది రూ.70వేల కోట్లు
- కేంద్రం ఇచ్చింది 2,407 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జల్‌జీవన్ మిషన్ లక్ష్యాలను సాధించడం అసాధ్యంగా మారుతోంది. ప్రజలందరికి నిరంతరాయంగా రక్షిత తాగునీటిని అందించేందుకు ఈ పథకాన్నిఉద్దేశించిన సంగతి తెలిసిందే. ఈ పథకం గురించి సాగుతున్న అట్టహాసపు ప్రచారం ఎలా ఉన్నప్పటికీ, ఆచరణలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి కారణంగా పనులు నత్తనడకన సాగనున్నాయన్న అభిప్రాయం అధికారవర్గాల్లో వినిపిస్తోంది. ఈ పథకం కింద రాష్ట్రం 70 వేల కోట్ల రూపాయలుకావాలని కేంద్రాన్ని కోరితే, కేవలం 2,407 కోట్ల రూపాయలే తాజా బడ్జెట్‌లో కేటాయించడం దీనికి కారణం. ఈ విధంగా నిధులు కేటాయింపులు చేస్తే పథకం లక్ష్యాలను చేరుకోవడానికి కనీసం 30 సంవత్సరాలు పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు!

స్వయంగా విజ్ఞప్తి చేసిన పవన్

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నవంబర్ నెలలో జరిపిన ఢిల్లీ పర్యటనలో ఈ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీకి స్వయంగా వినతిపత్రం అందచేశారు. ఈ పథకం కింద అవసరమైన నిధులు విడుదలచేయడానికి ప్రధాని సానుకూలంగా ఉన్నారని కూడా ఈ భేటీ అనంతరం ఆయన ప్రకటించారు. ప్రధానితో తాను జరిపిన చర్చలకు అనుకూలంగా ఆయనే ప్రతిపాదనలను తయారు చేయించి కేంద్రానికి అందచేశారు. స్వయంగా పవన్ విజ్ఞప్తి చేయడం, ప్రధాని సానుకూలత వ్యక్తం చేయడంతో నిధుల రాకపై అధికారయంత్రాంగం భారీ ఆశలు పెట్టుకుంది. అయితే, కేంద్ర బడ్జెట్‌లో (2025-26)లో కేటాయించిన జల్‌జీవన్ మిషన్ (జెజెఎం)/నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ మిషన్ (ఎన్ఆర్‌డిడబ్ల్యూఎం)కు రూ.67 వేలకోట్లు కేటాయించింది. ఈ మొత్తంలో కేవలం రూ.2,407.32 కోట్లు వచ్చే అవకాశం ఉందన్న అంచనాలు కేంద్రం నుండి రాష్ట్రానికి అందాయి. భారీ ఎత్తున పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధంచేసుకుంటున్న అధికారులు ఈ పరిణామంతో అయోమయంలో పడ్డారు.

2028తో ముగియనున్న జెజెఎం

కేంద్ర ప్రభుత్వం 2019లో ఈ పథకం ప్రారంభించింది. తొలుత ప్రకటించిన వివరాల ప్రకారం 2026 నాటికి ఈ పథకం పూర్తవ్వాల్సి ఉంది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో ప్రతి ఇంటికి కుళాయి నీటి సౌకర్యం కల్పించకపోవడంతో 2028 వరకూ ఈ పథకాన్ని పొడిగించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనల ప్రకారం రూ.70 వేలకోట్లు నిధులు కేటాయించాలంటే ఏడాదికి సుమారు రూ.23 వేల కోట్లు నిధులు కేటాయించాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ బడ్జెట్‌లో దేశ వ్యాప్తంగా ఈ పథకానికి రూ.70,163 కోట్లను కేటాయిస్తూ భారీగా నిధులు చూపించినా చివరికి సవరించి రూ.22,694 కోట్లకే పరిమితం చేశారు.

జెజెఎంలో రాష్ట్రానికి కేటాయింపుల వివరాలు

సంవత్సరంనిధులు	(రూ.కోట్లలో)
2019-20	రూ.372.64
2020-21	రూ.790.48
2021-22	రూ.3.182.28
2022-23	రూ.3,458.20
2023-24	రూ.6,530.49
2024-25	రూ.2,520.97
2025-26	రూ.2,407.32 (అంచనా)

మణిపూర్ సిఎం బీరెన్ సింగ్ రాజీనామా

- హింసను ప్రేరేపించిన ఆడియో టేపులు సిఎంవేనని నిర్ధారించిన ట్రూత్ ల్యాబ్
- ప్రతిపక్షాలు, సొంత పార్టీ ఒత్తిడితో ఎట్టకేలకు నిర్ణయం
- భద్రతా సంస్థలు అప్రమత్తంగా ఉండాలి
- కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాలు

ఇంఫాల్ : మణిపూర్ జాతి హింసలో ఒక పక్షానికి కొమ్ముకాస్తున్న ఆడియో టేపులు బయటపడటంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి ఆదివారం రాజీనామా చేశారు. హింసాత్మక ఘటనలు జరగకుండా చూడాల్సిన సిఎంనే... జాతి హింసకు ఆదేశాలిచ్చారంటూ ఆడియో టేపులు బయటపడ టంతో... వాటి వాస్తవికతపై నివేదిక ఇవ్వాలని సిఎఫ్ఎస్ఎల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. అదే సమయంలో లాభాపేక్షలేని ప్రైవేటు సంస్థ ట్రూత్ ల్యాబ్స్ ఫోరెన్సిక్ సర్వీసెస్ ఆ టేపులను విశ్లేషించింది. సిఎం బీరేన్‌సింగ్ బహిరంగ సభల్లో ప్రసంగాల నమూనాలతో లీక్ అయిన టేపులోని స్వరాన్ని పోల్చినప్పుడు 93 శాతం నిర్ధారణ అయిందని ఆ సంస్థ పేర్కొంది. దీంతో, బీరేన్‌సింగ్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలతోపాటు రాష్ట్రంలోని పలువురు బిజెపి ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ నేతలు సైతం డిమాండ్ చేశారు. ఈ ఒత్తిడి నేపథ్యంలోనే సిఎం బీరేన్‌సింగ్ బిజెపి ఎంపీ సంబిత్ పాత్రా, మణిపూర్ ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి రాజ్‌భవన్‌కు ఆదివారం వెళ్లి గవర్నర్‌కు రాజీనామా పత్రాలు సమర్పించారు. ఈ నిర్ణయానికి ముందు.. బీరెన్ సింగ్ ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కూడా కలిశారు. ఇంతలో, హోం మంత్రిత్వ శాఖ అన్ని భద్రతా సంస్థలను హై అలర్ట్‌లో ఉండాలని ఆదేశాలు జారీచేసింది.చాలాకాలంగా,

మిగతా 7లో

తమిళనాడుపై కేంద్రం 'ఓపెన్ బ్లాక్‌మెయిల్'

- స్టాలిన్ విమర్శ

చెన్నై : జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఇపి)ని వ్యతిరేకించినందుకు మోడీ ప్రభుత్వం తమ రాష్ట్రంపై 'ఓపెన్ బ్లాక్‌మెయిల్', నిర్బంధం, రాజకీయ ప్రతీకారానికి దిగిందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.2,152 కోట్లను లాక్కొని, ఇతర రాష్ట్రాలకు పంచిపెట్టిందని ఆదివారం సోషల్‌మీడియా 'ఎక్స్'లో పేర్కొన్నారు. జాతీయ విద్యావిధానం-2020, మూడు భాషల పాలసీని తమిళనాడు వ్యతిరేకించడంతో కేంద్రం బహిరంగ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోందని, బిజెపి అన్యాయానికి హద్దులు లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు కేటాయించిన రూ.2,152 కోట్లు ఇతర రాష్ట్రాలకు పంచిపెట్టడం నిర్బంధం కాక మరొకటి కాదని, విద్యార్థుల హక్కులకు మద్దతుగా పోరాడినందుకు వారిని శిక్షించడం తగదని వివరించారు. ఒక రాష్ట్రంపై రాజకీయ ప్రతీకారం తీర్చుకునేందుకు భారతదేశ చరిత్రలో ఏ ప్రభుత్వమూ ఇంత నిర్దాక్షిణ్యంగా విద్యార్థుల గొంతు నొక్కలేదని సిఎం పేర్కొన్నారు.

విద్యార్థినిపై అత్యాచారం

- నగ్న ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్
- పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు
- పరారీలో ఇద్దరు

ప్రజాశక్తి- కంచికచర్ల (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినిపై యువకుడు అత్యాచారం చేయడమే కాకుండా ఆమె నగ్న ఫొటోలు తీశారు. ఈ విషయం ఎవరికైనా చెప్తే వీటినిబహిర్గతం చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. గత నెలలో జరిగిన ఈ ఘటన బాధితురాలి ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం... తిరువూరుకు చెందిన విద్యార్థిని పరిటాలలోని ఒక వసతి గృహంలో ఉంటూ బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వసతి గృహం నుండి పరిటాల కళాశాలకు వెళ్తున్న ఆ విద్యార్థిని వెంట అదే గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ పడేవాడు. తనతో స్నేహం చేయాలంటూ చనువుగా ప్రవర్తిస్తూ ప్రేమలోకి దింపాడు. విద్యార్థినికి మాయమాటలు చెప్పి రోజూ తన వెంట తీసుకెళ్లేవాడు. గత నెలలో హుస్సేన్ తన స్నేహితుడైన గాలి సైదా అలియాస్ సిద్ధూ గదికి ఆ విద్యార్థినిని తీసుకెళ్లాడు. అనంతరం ఆమెను గదిలో ఉంచి తాను బయటకు వెళ్లాడు. ఒంటరిగా ఉన్న ఆమెపై అదే అదునుగా సైదా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె ఒంటిపై దుస్తులు లేకుండా ఫొటోలు తీసి ఎవరికైనా చెప్తే ఈ ఫొటోలు బహిర్గతం చేస్తానంటూ బెదిరించాడు. తనకు జరిగిన అన్యాయంపై ఆ విద్యార్థిని తల్లిదండ్రుల సహాయంతో కంచికచర్ల పోలీసులను ఆశ్రయించింది. తనపై అత్యాచారం చేసిన సైదా, తనను ప్రేమ పేరుతో మోసగించిన హుస్సేన్, వారిద్దరికీ సహాయం చేసిన చింతల ప్రభుదాస్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం కంచికచర్ల పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎసిపి తిలక్ మాట్లాడుతూ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన సైదాను అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన ఇద్దరూ పరారీలో ఉన్నారని తెలిపారు. కేసు ప్రాథమిక దశలో ఉందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో మహిళ ఎసిపి లతాకుమారి, నందిగామ గ్రామీణ సిఐ చవాన్, ఎస్ఐ బి.రాజు పాల్గొన్నారు.

అధిక విద్యుత్ బిల్లులతో గిరిజనులు బెంబేలు

- ఒకరికి రూ.1.60 లక్షలు, మరొకరికి రూ.29 వేలు

3

ఉద్యమాలతోనే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి

- రాయలసీమలో అసంపూర్తిగా 55 ప్రాజెక్టులు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

2

పల్నాడులో తీవ్ర విషాదం

- ట్రాక్టర్ బోల్తా
- నలుగురు మహిళా కూలీలు దుర్మరణం
- ప్రమాదంపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

బోల్తా పడిన ట్రాక్టర్

మధిర సామ్రాజ్యం

మధిర గంగమ్మ

తేనేపల్లి పద్మ

చక్కెర మాధవి

ప్రజాశక్తి- ముప్పాళ్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలో తీవ్ర విషాదం చేసుకుంది. ట్రాక్టర్ బోల్తా పడి నలుగురు మహిళ కూలీలు దుర్మరణం పాలయ్యారు. ముప్పాళ్ల మండలం మాదల మండలం బొల్లవరం వద్ద ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసుల కథనం ప్రకారం... చాగంటివారిపాలేనికి చెందిన ముమ్వా శ్రీకాంత్ బొల్లవరం శివారులో పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశారు. పంట కోత, తరలింపు కోసం చాగంటివారిపాలేనికి చెందిన 21 మందిని కూలికి మాట్లాడుకుని గ్రామానికే చెందిన పోపూరి చిన్నాకు చెందిన ట్రాక్టర్‌పై తీసుకెళ్లారు. ఉదయం వెళ్లిన కూలీలు పని ముగించుకుని సాయంత్రం ఐదు గంటల తర్వాత ఇళ్లకు తిరుగు పయనమయ్యారు. కొంతమంది కూలీలను కుటుంబీకులు సొంత వాహనాలపై తీసుకెళ్లగా 15 మంది మిర్చి టిక్కీలను ట్రాక్టర్‌లో వేసుకుని వాటిపై కూర్చుని ఇళ్లకు వస్తున్నారు. బయలుదేరిన 15 నిమిషాల తర్వాత మరో 20 నిమిషాల్లో ఇంటికి చేరుతారనగా మాదల మేజర్ కాలువ వద్ద డొంక మార్గమంతా గుంతలమయంగా ఉండడంతో వాటిల్లో పడి ట్రాక్టర్ బోల్తా కొట్టింది. కూలీలంతా కిందపడిపోవడంతోపాటు వారిపై మిర్చి టిక్కీలు పడ్డాయి. ఆ సయయంలో కొంతమంది పక్కకు దూకి ప్రాణాలు కాపాడుకోగా, వాటి కింద పడ్డ మధిర సామ్రాజ్యం (65), మధిర గంగమ్మ (54), తేనేపల్లి పద్మ (48) ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందారు. చక్కెర మాధవి (28) కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా ఆటోలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాల తరలించారు. అయితే. కొద్దిసేపటికే ఆమె కూడా మరణించారు. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుల్లో తేనేపల్లి పద్మకు భర్త శ్రీనివాసచారి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా కుమారుడు చదువుతున్నాడు. చక్కెర మాధవికి భర్త సుధాకర్‌రెడ్డి, ఇద్దరు చిన్న కుమారులు ఉన్నారు. సామ్రాజ్యం, గంగమ్మ భర్తలు గతంలోనే చనిపోగా వారి పిల్లలకు పెళ్లిళ్లయ్యాయి. మృతులంతా సెంటు

మిగతా 7లో

చిలుకూరు ప్రధాన అర్చకునిపై సంఘ్ పరివార్ దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మతతత్వ విషనాగు సొంత పిల్లలను కూడా చిదిమేస్తుందన్న సంగతి తెలిసిందే. దేశంలో మతోన్మాదంతో రెచ్చిపోతున్న సంఘ్ పరివార్ మూకలు తమపర అనే తేడా లేకుండా దాడులకు పాల్పడుతున్నారు. తాజాగా తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సిఎస్ రంగరాజన్‌పై సంఘ్ పరివార్ గూండాలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిఎస్ రంగరాజన్ చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకునిగా పనిచేస్తున్నారు. తాను ఇంట్లో ఉన్న సమయంలో 'రామరాజ్యం' పేరుతో 20 మంది అక్కడకు వచ్చారు. ఇటీవల ఆలయంలో జరిగిన ఓ ఘటనపై వారు రంగరాజన్‌తో గొడవకు దిగారు. దేవాలయానికి చెందిన గోవును ఇతర మతస్తులకు ఇవ్వడం పట్ల

మిగతా 7లో

మోస్ట్ వాంటెండ్ థార్ గ్యాంగ్ అరెస్టు

- మధ్యప్రదేశ్ వెళ్లి జల్లెడపట్టిన 'అనంత' పోలీసులు
- రూ.90 లక్షల బంగారు, వజ్రాభరణాలు, రూ.19.35 లక్షల నగదు స్వాధీనం
- గ్యాంగ్ లీడర్‌పై దక్షిణ భారత దేశంలో 32కు పైగా కేసులు

నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి జగదీష్

ప్రజాశక్తి- అనంతపురం క్రైం

అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్‌లోని మూడు విల్లాల్లో జరిగిన చోరీ కేసును అనంతపురం పోలీసులు ఛేదించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న మధ్యప్రదేశ్‌కు చెందిన థార్ గ్యాంగ్ ఈ చోరీలకు పాల్పడినట్లు తేల్చారు. ఈ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.90 లక్షల విలువైన బంగారు, వజ్రాభరణాలు, రూ.19.35 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురిలో గ్యాంగ్ లీడర్‌పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో 32 కేసులు నమోదయ్యాయి. ఆదివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి పి.జగదీష్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురంలోని శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్‌లోని శివారెడ్డి, రంజిత్ రెడ్డి, శివశంకర్ నాయుడు ఇళ్లల్లో గత నెల 22న చోరీలు జరిగాయి. ఇళ్లకు తాళం వేసి ఉండడంతో ఎవరూ లేనిసమయంలో దొంగలు చొరబడి సుమారు రూ.2.13 కోట్లు విలువైన బంగారు, వజ్రాభరణాలు, నగదు దొంగిలించారు. ఈ కేసుల్లో బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక నాల్గో పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న

మిగతా 7లో

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి పోరాటమే మార్గం

- క్షేత్రస్థాయిలో ప్రజా చైతన్యం
- రాయలసీమలో అసంపూర్తిగా 55 ప్రాజెక్టులు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎంఎ గఫూర్, రామకృష్ణ తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధి ప్రజా ఉద్యమాలతోనే సాధ్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆ దిశగా క్షేత్రస్థాయి నుంచి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అడుగులు వేయాలని నిర్ణయించారు. ఎపి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన 'సాగునీటి ప్రాజెక్టులు-విభజన హామీలు' అనే అంశంపై అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఎ అంటే అమరావతి, పి అంటే పోలవరం కలిపి ఎపి అన్నట్లుగా ప్రస్తుత ప్రభుత్వ భావన ఉందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ గఫూర్ పేర్కొన్నారు. అమరావతి సెల్ఫ్ సస్టెయినబుల్ ప్రాజెక్టు అని చెప్పే సిఎం చంద్రబాబు రూ.69 వేలకోట్ల అప్పులతో పనులు ఎందుకు ప్రారంభిస్తున్నారని ప్రశ్నించారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఒకేచోట ఖర్చు చేయడం ఎంతవరకు న్యాయమో చెప్పాలన్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులను వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రాజెక్టులపై ఖర్చు చేస్తే అన్ని ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయి, ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. రాయలసీమ ప్రాంతంలో ఉండే ప్రజలు అక్కడ బతకలేక వలస వెళుతుంటే ముఖ్యమంత్రికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ విద్య, వైద్యం, రవాణా, సాగునీరు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో లేవని, దీంతో ఇక్కడి ప్రజలకు పనులు లేవన్నారు. తక్షణ లక్ష్యాలు, దీర్ఘకాలిక లక్ష్యాలుగా పోరాట అంశాలను విభజించుకుని వాటి సాధనకు ముందుకు సాగాలన్నారు. వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి, డిమాండ్ల సాధనకు సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ స్థాయి నుంచి సదస్సులు, సమావేశాలు నిర్వహించాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని కోరారు. ఈ ప్రాంతాలకు పాలకులు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. 30 ఏళ్ల నుంచి ఏ ప్రాజెక్టూ పూర్తి కాలేదన్నారు. రాయలసీమలో 80 టిఎంసిలు నీటిని నిల్వ చేయడానికి రిజర్వాయర్లు ఉన్నా నీరు పొలాలకు చేరేందుకు కాల్వలు పూర్తి కాలేదన్నారు. వెనుకబడిన ప్రాంతాల విషయంలో ప్రభుత్వ ఆలోచనలు మారాలన్నారు. ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు చేసే ఖర్చులో సాగునీటి ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సాగునీటి అంశం రాష్ట్రాల పరిధిలోనిదని కేంద్రం నిధులు కేటాయించకుండా తప్పించుకుంటుందన్నారు. దీంతో ప్రాజెక్టులు దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైవే ప్రాజెక్టులకు ఇచ్చిన ప్రాధాన్యత సాగునీటి ప్రాజెక్టులకు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రానికిఇప్పుడు మెట్రో రైలు ప్రాజెక్టు అవసరం ఏముందన్నారు. రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలని, కడపలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. సాగునీటి రంగానికి బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 50 శాతం కూడా ఖర్చు చేయడం లేదన్నారు. వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు, కాస్ట్ ఎఫెక్టివ్ పాలసీలను తప్పుబట్టారు. సాగునీటి రంగంలో బిఓటి విధానం సాధ్యం కాదన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన బి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలో 55 ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వీటిని పూర్తి చేస్తే 24 లక్షల ఎకరాలకు సాగునీరు, 2 కోట్ల మందికి తాగునీరు అందించే అవకాశం ఉందని చెప్పారు.

వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతా మోహన్ రాయలసీమ ప్రాంతం వెనుకబడటానికి కారణాలు విశ్లేషించారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బి దశరథరామిరెడ్డి, వెలిగొండ సాధన సమితి నాయకులు శ్యామ్‌ప్రసాద్, మాలకొండారెడ్డి, అభివృద్ధి వికేంద్రీకరణ వేదిక నాయకులు కెవి రమణ, బిఎస్‌పి నాయకులు గుర్రప్ప, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు, జల సాధన సమితి నాయకులు గంగిరెడ్డి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షులు వైఎన్ రెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు బాలకృష్ణారెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డి, తోట సురేష్ బాబు, చిరంజీవి, శంకర్, నాగేంద్రబాబు, సుబ్బరాయుడు, కృష్ణా రెడ్డి, జి శ్రీనివాసరెడ్డి, రామ్‌కుమార్, పివి రమణయ్య, కెవి రమణ, రామాంజనేయులు తదితరులు సమావేశంలో వారి సూచనలు, సలహాలు అందజేశారు.

'తల్లికి వందనం'లో కోత

- 2024-25 విద్యాసంవత్సరానికే అమలు?
- 2023-24కు లేనట్లే
- 69.16లక్షల మంది అర్హులుగా గుర్తింపు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లికి వందనం పథకంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఒక ఏడాది పాటు కోత విధించనున్నట్లు సమాచారం. సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం కింద 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని టిడిపి కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో ఆ కూటమే గెలవడంతో గత తొమ్మిది నెలలుగా లబ్ధిదారులు పథకం అమలు కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో రానున్న విద్యాసంవత్సరం ప్రారంభం నుండి ఈ పథకాన్ని అమలు చేస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు జులై లేదా ఆగస్టు నెలల్లో ఈ పథకానికి సంబంధించిన మొత్తాన్నివిడుదల చేయడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. అయితే, 2024-25 సంవత్సరానికి సంబంధించిన మొత్తాన్నే లబ్ధిదారులకు ఇవ్వాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు అందినట్లు సమాచారం. దీంతో క2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన నిధులు విడుదల చేసే అవకాశం లేదని చెబుతున్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం కూడా ఒక ఏడాదికి మినహాయించి మిగిలిన సంవత్సరాలకే పథకాన్ని వర్తింపచేసింది. అప్పట్లో టిడిపి నేతలు ఒక ఏడాదికి వైసిపి ప్రభుత్వం కోత పెట్టిందని విమర్శలు చేశారు. ఇప్పుడు అదే పని టిడిపి కూటమి ప్రభుత్వం కూడా చేస్తుండటం గమనార్హం.

అర్హులు 63.19లక్షలు

2024-25 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో దాదాపు 81 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఇందులో ప్రాథమికంగా 69.16లక్షల మంది అర్హులుగా విద్యాశాఖ తేల్చినట్లు సమాచారం. ఈ పథకం అమలుకు 10,300 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని ఆర్థికశాఖ అంచనా వేసినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో 75 శాతం హాజరు నిబంధనను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నిబంధన తీసుకొస్తే లబ్ధిదారులు 69.16 లక్షలే ఉంటారా? తగ్గుతారా? అనేది చూడాల్సి ఉంటుంది. వైసిపి హయాంలో ప్రతి ఏటా ఎంతమందికి అందించారనే సమాచారాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

నిబంధనలు ఏమిటి?

తల్లికి వందనం విధివిధానాలు, నిబంధనలు ఏమిటనే అంశాలు తెలియాల్సి ఉంది. గత ప్రభుత్వం ఆరెంచల విధానం పెట్టింది. ఇందులో ఆదాయ పన్ను చెల్లించే వారిని, తెల్లరేషన్ కార్డు లేనివారిని, 300 యూనిట్ల విద్యుత్ వినియోగించేవారిని, కారు ఉన్న వారిని, అర్బన్ ప్రాంతంలో 1000 చదరపు అడుగులు కలిగి ఉన్నవారిని అనర్హులను చేసింది. వీటితో పాటు 75శాతం హాజరు నిబంధనను విధించారు. ప్రభుత్వ పథకాలకు విద్యుత్ వినియోగం ఆధారంగా తీసుకోవడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండగా వ్యతిరేకించారు. కారు కలిగి ఉన్నవారిని కూడా పథకాలకు అర్హులుగా చేరుస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటించారు.ఇప్పుడు ఈ రెండు నిబంధనలను తొలగిస్తారా? కొనసాగిస్తారా? అనేది తేలాల్సి ఉంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఏలూరులో 'తండేల్' సందడి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు అంబికా థియేటర్‌లో తండేల్ చిత్ర యూనిట్ ఆదివారం సందడి చేసింది. ఆ సినిమా విజయోత్సవంలో భాగంగా అంబికా థియేటర్‌కు విచ్చేసిన మాజీ ఎంఎల్‌ఎ అంబికా కృష్ణ సినీ హీరో అక్కినేని నాగచైతన్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అభిమానులను ద్దేశించి నాగచైతన్య మాట్లాడుతూ తండేల్ సినిమా కోసం నటించిన అందరూ కష్టాన్ని ఇష్టపడుతూ ముందుకు సాగారన్నారు. దానికి ప్రతిఫలంగా అభిమానుల ఆదరాభిమానాలు దక్కాయన్నారు. తండేల్ సినిమాను ప్రేక్షకులంతా థియేటర్లోనే చూసి ఆనందించాలని కోరారు. అనంతరం అంబికా కృష్ణ మాట్లాడుతూ చిత్రం చాలా బాగుందని, నాగచైతన్య ఒక పెద్ద హీరో కొడుకు అనే గర్వం లేకుండా చాలా బాగా మాట్లాడారన్నారు. ఆయన తాత అక్కినేని నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునలా మంచి గుర్తింపు పొందాలన్నారు. అనంతరం అభిమానులు భారీ గజమాల వేశారు. ఈ కార్యక్రమంలో మూవీ డైరెక్టర్ చందు మొండేటి, ప్రొడ్యూసర్ బన్నీ వాసు, కమెడియన్ మహేష్ ఆచంట తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ఊరుకోం

- స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్

దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే ఊరుకునేది లేదని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1459వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కుట్రలతో ప్లాంట్‌లోని కాంట్రాక్టు కార్మికుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయన్నారు. 30 ఏళ్ల నుంచి కర్మాగారంలో పర్మినెంట్ కార్మికులతో కలిసి కాంట్రాక్టు కార్మికులు ఉత్పత్తి చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఉక్కు కర్మాగారం ప్రగతిలో వీరి పాత్ర కీలకమైందన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను ప్లాంట్‌లో తొలగించేందుకు నిర్ణయం జరగ్గా పెద్ద ఎత్తున పోరాటం చేసి అడ్డుకున్నామని తెలిపారు. ఇప్పుడు దొడ్డిదారిన మళ్లీ తొలగింపు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పోరాటాలతో కేంద్ర ప్రభుత్వ, ఉక్కు యాజమాన్య కుట్రలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. దీక్షల్లో సంఘం నాయకులు ఎస్.కృష్ణ, శశిభూషణం, సింహాచలం, అప్పలరాజు, జి.సతీష్, రాము, ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతిలోని ఇస్కాన్ సమీపంలో ఉన్న టిటిడి గ్రౌండ్‌లో భారతీయ విద్యా భవన్ ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనపై దాడి చేసిన కిరణ్‌కుమార్, తుమ్మా ఓంకార్‌తోపాటు పలువురు దౌర్జన్యానికి పూనుకోవడం దుర్మార్గమైన దురహంకార చర్య అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పేర్కొంది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ఒక ప్రకటన విడుదల చేశారు. దౌర్జన్యాన్ని ఆపాలని కోరిన ప్రజా సంఘాల నాయకులు వందవాసి నాగరాజుపై దురుసుగా ప్రవర్తిస్తూ అసభ్య పదజాలంతో ధూషించిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విశాలాంధ్ర పుస్తక విక్రయశాల వద్దకు వచ్చిన గూండాలు పెరియార్ జీవిత చరిత్ర పుస్తకాలను తొలగించాలని హుకుం జారీ చేయడమంటే చరిత్రను ప్రజలకు తెలియకుండా చేసే కుట్ర తప్ప మరొకటి కాదన్నారు. స్థానికులు, కవులు, రచయితలు, మేధావులు మీద కూడా దురుసుగా ప్రవర్తించి దాడికి పూనుకున్నారని అన్నారు. ఇదే ఒరవడి కొనసాగితే పౌర సమాజం వీరికి తగిన విధంగా బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారుల జాబితాపై పునర్విచారణ

- రెవెన్యూ ఉద్యోగులతో విచారణ కమిటీ
- ఈ నెల 15 కల్లా ప్రభుత్వానికి నివేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి హయాంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు, హౌసింగ్ నిర్మాణాలకు అనుమతులు పొందిన లబ్ధిదారుల్లో అర్హులు, అనర్హులు విషయంలో లెక్కలు తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. పునర్విచారణ కోసం ఈ నెల 10 నుంచి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారుల జాబితాలో అనర్హులుంటే వారిని గుర్తించాల్సి ఉంటుంది. సమాచారాన్ని నమోదు చేసేందుకు రెవెన్యూశాఖ ప్రత్యేక మొబైల్ యాప్‌ను సిద్ధం చేసింది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పునర్విచారణ ప్రక్రియను ఆయా మండలాల్లో స్థానిక తహశీల్దార్ నేతృత్వంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయరు, విఆర్ఓ సభ్యులుగా నిర్వహించనున్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఈ నెల 15వ తేదీలోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని 26 జిల్లాల కలెక్టర్లను సిసిఎల్‌ఎ జయలక్ష్మి ఆదేశించారు. అలాగే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ (పిఎంఎవై-జి), ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం-జన్‌మన్) పథకాలను ప్రస్తుత యూనిట్ విలువతో కొనసాగించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న గృహాలను పూర్తి చేయడానికి చేసిన ప్రతిపాదనలకు ఇటీవల జరిగిన మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పిఎంఎవై అర్బన్ 1.0 పథకం కొనసాగింపుతో 3 ఆప్షన్ల కింద నిర్మాణంలో ఉన్న ఇళ్లకు, మెటీరియల్ సరఫరా, కొత్త ఇసుక విధానాన్ని అనుసరించడం, డ్రోన్‌ల ద్వారా పెద్ద లే అవుట్లలో నాణ్యత పరీక్ష నిర్వహించడం, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖల సమన్వయంతో హౌసింగ్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆచరణలో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతున్నట్లు సమాచారం.

మౌలిక వసతులు లేకుండా నివాసాలు ఎలా..?

జగనన్న కాలనీల కింద తమకు మంజూరు చేసిన స్థలాలు పట్టణాలకు దూరంగా ఉండటంతోపాటు నివాస యోగ్యమైన ప్రాంతం కాదనే అభిప్రాయాన్ని పలువురు లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు ఆయా కాలనీలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడం, సురక్షితమైన తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ సౌకర్యంతో పాటు మౌలిక వసతుల కల్పన లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు భయపడుతున్నారు.

భూమి కోసం కసరత్తు

వైసిపి హయాంలో పేదలకు పంపిణీ చేసిన సెంటు ఇంటి స్థలం స్థానంలో నూతనంగా ఎంపిక చేసే లబ్ధిదారులకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇందుకు సంబంధించి భూసేకరణ కోసం భూములను గుర్తించాలని రెవెన్యూశాఖను ఆదేశించింది. ఇదే సందర్భంలో వైసిపి హయాంలో ఇంటి స్థలాలు పొంది నేటికీ పట్టాలు తీసుకోనివారు, పట్టాలు తీసుకుని ఇంటి నిర్మాణాలు మార్చిలోగా చేపట్టని వారి పట్టాలు రద్దు చేసి అర్హులకు అదే భూమిని పంపిణీ చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇందులో భాగంగానే వైసిపి హయాంలోని లబ్ధిదారుల జాబితా పునర్విచారణ అని చర్చకు తెరలేపింది.

విద్యార్థులకు కార్పొరేట్ వల

- అడ్మిషన్ల వేట షురూ
- తల్లిదండ్రులకు ఫోన్స్, ఎస్ఎంఎస్‌ల జోరు
- కళాశాలల్లో ఎన్నో ప్రత్యేకతలంటూ ప్రచారం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థులకు వల వేస్తున్నాయి. గత నెల నుంచే ఎల్‌కెజి, నర్సరీ తరగతులకు అడ్మిషన్ల కోసం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌లకు లక్ష్యాలను నిర్దేశించారు. దీంతో టీచర్లు ఇంటింటికీ తిరిగి అడ్మిషన్ల కోసం వెంట పడుతున్నారు. జూనియర్ కళాశాలల ప్రతినిధులు ఏకంగా గ్రామాల్లో మధ్యవర్తులను పెట్టుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కాలేజీల ప్రత్యేకతలను వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల నెంబర్లు సేకరించి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు, ఫోన్లు చేస్తూ ఊదరగొడుతున్నారు. ఎలాగోలా బుట్టలో వేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గతంలో పదో తరగతి ఫలితాల అనంతరం అడ్మిషన్ల కోసం కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు తమ సిబ్బందికి లక్ష్యాలు విధించి అడ్మిషన్లు సేకరించడం పరిపాటి. ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు రిజర్వ్ చేసుకుంటే రాయితీలిస్తామని చెబుతున్నాయి. వివిధ కోర్సులను ప్యాకేజీగా రూపొందించి 20 నుంచి 40 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి అడ్మిషన్లు సేకరిస్తున్నాయి.

వివరాలు మొత్తం సేకరించి..

తూర్పు గోదావరి జిల్లాలో 123 ఇంటర్ జూనియర్ కాలేజీలు, వీటిలో 78 ప్రయివేటు కార్పొరేట్, 45 ప్రభుత్వ, వెల్ఫేర్ కళాశాలలు ఉన్నాయి. రెండేళ్లుగా జూనియర్ ప్రభుత్వ కాలేజీలలో ఫలితాలు తలకిందులైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆర్థిక పరిపుష్టత లేకపోయినా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా మంచి కాలేజీలో చేర్పించాలని తల్లిదండ్రులు యోచిస్తున్నారు.. దీనిని క్యాష్ చేసుకునేందుకు కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల నిర్వహకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. విద్యార్థులను ఎలాగైనా తమ కళాశాలలో చేర్చుకునేందుకు ఇంటింటా ఫోన్, ఎస్ఎంఎస్‌ల ద్వారా అప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. బుట్టలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కళాశాలలో ఉత్తమ బోధనతో పాటు ఫలానా ప్రత్యేకతలు ఉన్నాయని, చేరితే రాయితీలు ఇస్తామంటూ ఊదరగొట్టేస్తున్నారు. విద్యార్థుల చిరునామా, ఫోన్ నెంబర్లు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు.. ఆయా పాఠశాలల నుంచి ఇప్పటికే సేకరించారు. ఆ విద్యార్థి మార్కులు, కుటుంబ ఆర్థిక స్థోమతను తెలుసు కున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు సంస్థల ప్రతినిధులు, స్థానికంగా నియమించుకున్న మధ్యవర్తుల ద్వారా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళుతున్నారు. తమ కళాశాలలో చేర్పిస్తే ఫీజు రాయితీ ఇస్తామని, సౌకర్యాలు కల్పిస్తామని, పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని, ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని ఊదరగొడుతున్నారు. మరో వైపు ఉపాధ్యాయుల ద్వారా గాలం వేస్తున్నారు.

ఎవరి డప్పు వారిది..

రాజమహేంద్రవరం, కాకినాడలతో పాటు విజయవాడ, విశాఖపట్నం విద్యాసంస్థలు ప్రత్యేకంగా మధ్యవర్తులను నియమించుకుని, వారి ద్వారా ప్రచారం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తమ సంస్థలు ఉన్నాయని, జిల్లాలోనే కళాశాల శాఖ ఉందని, చేరాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. కార్పొరేట్ సంస్థలకు తామేమీ తక్కువ కాదని జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలలు కూడా విద్యార్థులపై వల వేస్తున్నాయి. ఈ ప్రచారంలో తమ కళాశాలలో ప్రత్యేకంగా ఎంసెట్, ఎఐఇఇఇ, జెఇఇ మెయిన్స్, ఎన్ఐటి శిక్షణ ఇస్తామని, పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆశ చూపుతున్నారు.

సమాజ రుగ్మతలపై రచయితలు కలం ఎక్కుపెట్టాలి

- శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య నిత్యానందరావు

ప్రజాశక్తి- కడప అర్బన్

సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తూ అభివద్ధి దిశగా ప్రజలను సమాయత్తం చేయాల్సిన బాధ్యత రచయితలపై ఉందని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య నిత్యానందరావు అన్నారు. కడప నగరంలోని ఐఎంఎ హాల్లో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ' వెయ్యేళ్లతెలుగు సాహిత్యం - రాయలసీమ భాగస్వామ్యం' అనే శీర్షికతో 2వ సాహిత్య సాంస్కతిక మహసభలను ఆదివారం సభను కేతు విశ్వనాథరెడ్డి సాహిత్యవేదికపై నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విసి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ప్రసంగిస్తూ సాహిత్య సంఘాలు ప్రజల్లో సాహితీ పిపాసను పెంచాలని, ప్రాంతీయ అభివద్ధి నిమిత్తం చైతన్య స్పహ రేకెత్తించాల్సిన అవసరం ఉందన్నారు. పాలకులకు సరైన మార్గనిర్దేశం చేయడానికి మరింత ఉత్సాహంతో సానుకూల దక్పథంతో సాహిత్య సంఘాలు కషి చేయాలని పేర్కొన్నారు. సభాధ్యక్షులు, వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ అస్తిత్వాన్ని చాటిచెప్పేలా ఈ రెండు రోజుల మహా సభలు విజయవంతంగా నిర్వహించామని అన్నారు. రాయలసీమకు చెందిన భాష, చరిత్ర, సాహిత్యం, సంస్కతి అంశాలపై అనేక పరిశోధన పత్రాలు, సదస్సుల ద్వారా వెలుగు చూశాయన్నారు. విశిష్ట అతిథి, సంఘం గౌరవ సలహాదారులు అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పేరుకు రాయలసీమ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి కూడా కవులు, కళా కారులు పాల్గొనడం, రాయలసీమ ఘనతను చాటడం హర్షణీయమన్నారు. సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖరెడ్డి స్వాగతం పలుకగా సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు. శతాధిక కవి సమ్మేళనంలో కవులు కవితాగానం చేశారు. సంఘం కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకష్ణ శాస్త్రి సభా సమన్వయం చేశారు. రాయలసీమ పత్రికా రంగంపై డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, రాయలసీమ సినిమాపై భూమిరెడ్డి స్వరూపరాణి, రాయలసీమ సంస్కతి, సంప్రదాయాలు అనే అంశంపై పుట్టా ఓబులేసు పత్రాలను సమర్పించారు. వేమన, సుమతి, భాస్కర శతకాలలో పద్యపఠన పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

సోలార్ ప్రాజెక్టులకు భూసంతర్పణ

- కేటాయించిన మూడు సంస్థలు ఒక్కరివే
- లీజు పద్ధతిలో భూసేకరణకు అనుమతి



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్దఎత్తున సోలార్ ,విండ్ ప్రాజెక్టులకు భూములు కేటాయించారు. తాజాగా మరిన్ని ప్రాజెక్టులకు అనుమతులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏకంగా 1478 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వీటికి అవసరమైన భూసేకరణను లీజు పద్ధతుల్లో చేసుకునే వెసలుబాటును కల్పించింది. ఇప్పటికే ఆయా సంస్థలు భూములపై కన్నేయడమే కాకుండా చాలా వరకు లావాదేవీలు కొనసాగించుకున్నట్టు సమాచారం.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనుమతినిచ్చిన సంస్థలు, ప్రాంతాలు

అనంతపురం, కడప జిల్లాల పరిధిలోని తాడిపత్రి, కొండాపురం మండలాళ పరిధిలోని బొడాయపల్లి గ్రామం పరిధిలో సెయిల్ సోలార్ సంస్థకు 300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి అనుమతినిచ్చింది. సత్యసాయి జిల్లా పరిధిలో ఎకరన్ ఎనర్జీ సంస్థకు రాళ్ల అనంతపురం గ్రామం పరిధిలో 201 మెగావాట్ల విండ్ ఎనర్జీ విద్యుత్ ఉత్పత్తికి అనుమతినిచ్చింది. ఇదే సంస్థకు కనగానపల్లి మండలం మద్దెలచెరువు వద్ద 50 మెగావాట్ల విండ్, సోలార్ హైబ్రీడ్ ప్రాజెక్టుకు అనుమతినిచ్చారు. బెళుగుప్ప మండలం గంగవరం గ్రామం పరిధిలో 400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పదానకు టాటా సంస్థకు అనుమతులిచ్చారు. కనగానపల్లి, రామగిరి మండలాల పరిధిలో ముత్తవకుంట, ఎలకుంట్ల, రామగిరి, నసనకోట గ్రామాల పరిధిలో కడప రెనీవబుల్స్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు 231 మెగావాట్ల అనుమతులిచ్చారు. కళ్యాణదుర్గం ప్రాంతంలోని అడవిగొల్లపల్లి, బచ్చుపల్లి, యాటకల్లు, నరసాపురం గ్రామాల పరిధిలో 178 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అనంతపురం రెన్యూవబుల్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు అప్పగించారు మక్కినవారలిపల్లి, మోటరుచింతలపల్లి, కురాకులపల్లి, పేరూరు, కొండాపురం గ్రామాల పరిధిలో ఆస్పిరి రెన్యూబుల్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు 118 మెగావాట్లకు అనుమతినిచ్చారు. ఆ మూడు సంస్థలు ఒక్కరివే : అనంతపురం రెన్యూబుల్ ప్రయివేటు లిమిటెడ్, ఆస్పిరి ప్రయివేటు లిమిటెడ్, కడప రెన్యూవబుల్ ప్రయివేటు లిమిటెడ్ మూడు సంస్థలు వేరువేరుగానున్నా అందులో డైరెక్టర్లు మాత్రం ఒక్కటే కావడం గమనార్హం. ఇంత పెద్దఎత్తున ఈ సంస్థలకు అనుమతులివ్వడంపై పలు సందేహాలు వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

తోటపల్లిలో సంచరిస్తున్న ఏనుగులు

తోటపల్లిలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి- గరుగుబిల్లి (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా గురుగుబిల్లి మండలంలో కొద్ది రోజులుగా సంచరించిన ఏనుగులు తోటపల్లికి తిరిగొచ్చాయి. తోటపల్లిలోని తామరచెరువు వద్ద ఆదివారం ఏనుగులు దర్శనమిచ్చాయి. ఏనుగుల సంచారంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఇదే ప్రాంతంలో సంచరించిన ఏనుగులు మళ్లీ తిరిగి రావడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. సంచరించిన మార్గాల్లోనే తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఏళ్ల తరబడి ఏనుగులు అడవిని విడిచి గ్రామీణ ప్రాంతాల్లో తిరగడం వల్ల ఇప్పటికే చాలా వరకు ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని స్థానికులు తెలిపారు. సంబంధిత అటవీశాఖ అధికారులు దృష్టి సారించి.. గజరాజులు గ్రామాల్లోకి రాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. వాటి కారణంగా నష్టం వాటిల్లిన పంటలకు నేటికీ ఎటువంటి పరిహారం అందించలేదని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

- ఆరోగ్యశాఖ కమిషనర్ జి వీరపాండ్యన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం అల్బెండజాల్ మాత్రలు పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జి వీరపాండ్యన్ తెలిపారు. ఒకటి నుంచి 19 ఏళ్ల మధ్య వయసు గల చిన్నారులు, విద్యార్థులకు అందించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అన్ని జిల్లాలకూ మాత్రలను ఇప్పటికే పంపిణీ చేసి అవగాహన, ప్రచార కార్యక్రమ ఏర్పాట్లు కూడా నిర్వహించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో చిన్నారులు, విద్యార్థుల్లో 34 శాతం మేర నులిపురుగుల వ్యాప్తి ఉందని తెలిపారు. ఈ వ్యాధి నిర్మూలన కోసం 400 మిల్లీ గ్రాముల చప్పరించే అల్బెండజాల్ మాత్రల్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల ద్వారా రెండేళ్లకోసారి అందజేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని 1.12 కోట్ల మంది చిన్నారులకు మాత్రల పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సోమవారం మాత్రలు అందుకుని వారికి ఈ నెల 17వ తేదీన అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు పిల్లలకు అందిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు వైద్యాధికారులు, స్వతంత్ర పరిశీలకులు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తాని పేర్కొన్నారు. మాత్రలు తీసుకున్న తరువాత ఎవరైనా ప్రతికూల ప్రభావానికి గురైతే ఆరోగ్య కేంద్రాలు అప్రమత్తమై 108, 104 వంటి అత్యవసర సేవల విభాగాలతో సిద్ధంగా ఉంటాయని వివరించారు. చిన్నారుల సంక్షేమం, రాష్ట్ర ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి పాఠశాలల యాజమాన్యాలతో పాటు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

భర్త, కుమారుడితో ఝాన్సీ (ఫైల్ ఫొటో)

కుమారుడితో కలిసి మహిళా హోంగార్డు ఆత్మహత్య

ప్రజాశక్తి - అనకాపల్లి

భర్త వేధింపులు తాళలేక కుమారుడితో కలిసి ఓ మహిళా హోంగార్డు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ సిఐ విజయ్ కుమార్ కథనం మేరకు.. కశింకోట మండలంలోని అట్టా వీధికి చెందిన అట్టా ఝాన్సీ (28) డిఎస్‌పి కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా ఆమెను భర్త వేధిస్తున్నాడు.

ఈ క్రమంలోనే తన ఆరేళ్ల కుమారునితో కలిసి ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వచ్చేసి ఏలేరు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. చివరిసారిగా అమెను ఏలేరు కాలువ వద్ద చూశామని స్థానికులు చెప్పడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఆదివారం తుమ్మపాల వద్ద వారికి మృతదేహాలు లభ్యమయ్యాయి. ట్రైనీ డిఎస్‌పి కృష్ణ చైతన్య, టౌన్ సిఐ టివి.విజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎన్‌టిఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఝాన్సీ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. 2012లో విజయ అచ్యుతరావుతో ఝాన్సీకి వివాహమైందని, అప్పటి నుంచి తరుచూ గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఆమెపై అనుమానంతో నిత్యం వేధించేవాడని కన్నీరుమున్నీరయ్యారు. కుమారుడిని కూడా సరిగ్గా చూసేవాడు కాదని తెలిపారు. పోలీసులు కూడా స్టేషన్‌కు పిలిపించి మందలించారని, అయినా ఆయన బుద్ధి మారలేదని అన్నారు.

తిరుపతి అడ్డాగా.. మతోన్మాదుల కుయుక్తులు

- భావప్రకటనా స్వేచ్ఛను హరించే కుట్ర
- అడ్డుకోకుంటే ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదం
- రాజ్యాంగేతర శక్తులను ఐక్యంగా అడ్డుకుందాం..
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న రచయితలు, మేధావులు, ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతి, తిరుమలను అడ్డాగా చేసుకొని మనువాద మతోన్మాదులు కుయుక్తులకు పాల్పడుతున్నారని రచయితలు, మేధావులు, ప్రజాసంఘాల నేతలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో శనివారం సాయంత్రం తెలుగులో ఖురాన్‌ను విశ్లేషించిన పుస్తకాన్ని చించి, తగలపెట్టడానికి విఫలయత్నం చేసిన ఘటనను తీవ్రంగా తప్పుబట్టారు. 'సాహిత్యం, భావప్రకటనా స్వేచ్ఛపై మతోన్మాదుల దాడులను అరికట్టాలి' అని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో అభ్యుదయ వేదిక ఆధ్వర్యాన ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. భజరంగ్ దళ్, ఆర్‌ఎస్‌ఎస్ రౌడీ మూకలు పాల్పడ్డ ఈ దుశ్చర్యను ఈ సమావేశంలో పాల్గొన్న మేధావులు, రచయితలు, ప్రజాసంఘాల నేతలు ముక్తకంఠంతో ఖండించారు. వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ గురవయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని తెలిపారు. ఇలాంటి దాడులకు వ్యతిరేకంగా ఐక్య వేదికను ఏర్పాటు చేసి పోరాడాలని పిలుపునిచ్చారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం నిషేధించని పుస్తకాన్ని ఎక్కడైనా అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ దేశంలో అన్ని మతాల వారు జీవించడానికి, వారి భావజాలాన్ని ప్రచారం చేసుకునేందుకు హక్కు ఉందని గుర్తు చేశారు. సీనియర్ జర్నలిస్ట్ రాఘవ మాట్లాడుతూ.. పుస్తకాలను నిషేధించడమే తప్పని భావిస్తున్నప్పుడు.. నిషేధించని పుస్తకాలను వీళ్లేలా అడ్డుకుంటారని ప్రశ్నించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ.. పుస్తక ప్రదర్శనలో మతోన్మాదులు దాడి చేశారని, పెరియార్ హిందూ వ్యతిరేకి అంటూ నీచంగా మాట్లాడారని తెలిపారు. పెరియార్ పుస్తకాలను పట్టుకుని పూలే విగ్రహం నుంచి గాంధీ రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ.. అన్ని భావాలను అర్థం చేసుకుంటేగానీ సత్యాన్ని అన్వేషించలేమని చెప్పారు. మతోన్మాదుల దాడులకు వ్యతిరేకంగా గళమెత్తి నిరసన తెలపాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ.. బిజెపి, భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ దాడులతో తిరుపతి డేంజర్ జోన్‌లోకి వెళ్లిందన్నారు. సాహితీవేత్త సాకం నాగరాజు మాట్లాడుతూ.. హిందుత్వ లక్ష్యం మత సామరస్యమని, పుస్తక ప్రదర్శనలో జరిగిన దాడికి ఒక హిందువుగా తాను తలదించుకుంటున్నాని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనశాలలో విశాలాంధ్ర పుస్తకాలం వద్ద మతోన్మాదులు అల్లరి చేయడంపై జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేయాలని, ఈ నెల 11న అంబేద్కర్ భవన్ నుంచి గాంధీ రోడ్డు వరకు పెరియార్ పుస్తకాలతో ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో రచయితల సంఘం రాష్ట్ర నాయకులు శరత్ చంద్ర, పౌర చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి వాకా ప్రసాద్, పరమేశ్వరరావు, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కరవది సుబ్బారావు, అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెవి రమణ, వేదిక జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రసాద్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ టి.జనార్ధన్, బిసి సంఘర్షణ సమితి నాయకులు బుసకాని లక్ష్మయ్య, కేశవులు, ఐద్వా కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- నేడు నామినేషన్‌కు తరలిరావాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణా-గుంటూరు శాసన మండలి పట్టభద్ర నియోజకవర్గానికి ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు పట్టభద్ర ఓటర్లు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్, నిరుద్యోగ వంటి 50 సంఘాలు తనను బలపరిచాయని చెప్పారు. ఈ నెల 10న గుంటూరులో నామినేషన్ వేయబోతున్నానని, ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రం 2007లో శాసనమండలి పునరుద్ధరించిన తరువాత ఏడుగురు సభ్యులం స్వతంత్రంగా గెలిచి పిడిఎఫ్‌గా ఏర్పాడ్డామని వివరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పిడిఎఫ్ తరపున 14 మంది గెలిచారని తెలిపారు. రాజ్యాంగ విలువలు, లక్ష్యాల కోసం కట్టుబడి పనిచేశామన్నారు. ప్రజల పట్ల నిబద్ధతతో నిజాయతీగా పనిచేశామని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశాలు, నిరుద్యోగులు, రైతులు, కౌలు రైతుల సమస్యలపై శాసనమండలి వేదికగా గళమెత్తామని చెప్పారు. మండలి బయట వారి ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు. ఒక ప్రత్యేకమైన ప్రయోజనం కోసం శాసనమండలిలో రాజ్యాంగ నిర్మాతలు పట్టభద్ర సీట్లు సృష్టించారని చెప్పారు. కొంతమంది మేధావులు, యూనియన్ నాయకులు, కార్మిక వర్గాల హక్కులు కాపాడే వ్యక్తులు ఎన్నిక కావాలనే ఉద్దేశంతో వీటిని సృష్టించారన్నారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు కూడా వీటిల్లోకి చొచ్చుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీలో ఉన్న వారికి అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. ధన, కులం వారికి అండగా ఉంటాయని వెల్లడించారు. తాము ప్రజాబలంతో ప్రజలు, అసంఘటిత రంగ కార్మికులు, బాధిత ప్రజల వాణిగా మండలిలో పనిచేస్తున్నామని చెప్పారు. ఈ ఎన్నికల్లో రెండు జిల్లాల్లో ఉన్న పట్టభద్ర ఓటర్లు పిడిఎఫ్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి మనోహర్, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాస్, ఎస్ సుందరయ్య పాల్గొన్నారు.

విద్యుత్ బస్సులు ఆర్‌టిసికే అప్పగించాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్‌టిసికే అప్పగించాలని, ప్రయివేటు వారికి అప్పగించొద్దని ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె.జిలానీ బాషా కోరారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి జిలానీ భాషా అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. పిఎంఇ పథకం కింద కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.సుందరయ్య, అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ.. పెండింగులో ఉన్న రెండు డిఎలను వెంటనే ప్రకటించాలని, డిఎ ఎరియర్స్ ఇవ్వాలని, మూడేళ్లుగా ఇవ్వాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వెంటనే ఇప్పించాలని కోరారు. 12వ పిఆర్‌సి వెంటనే నియమించాలని, ఈలోపు ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, గతంలో నిలిపివేసిన ఎస్‌ఆర్‌బిఎస్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, 30 సంవత్సరాలు పూర్తయిన వారికి రూ.3,200 ఎస్‌ఆర్‌బిఎస్ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రధాన కార్యదర్శి ముసాయిదా కర్తవ్యాలను ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, ఇ.శివకుమార్, రాజశేఖర్, రామయ్య, సత్యనారాయణ, ఎం.అరుణ కుమారి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి

దేశంలో రాజ్యహింస అవధులు దాటింది

- ప్రొఫెసర్ హరగోపాల్

సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

ఫాసిజం దేశంలో నలుమూలల విస్తరిం చిందని, తద్వారా రాజ్యహింస అవధులు దాటిందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. విరసం 24వ సాహిత్య పాఠశాల బహిరంగ సభ ఆదివారం కర్నూలులో జరిగింది. ఈ సభలో ప్రధాన వక్తగా హరగోపాల్ హాజరై మాట్లాడారు. రచయితల దృక్పథంలో మార్పురావడం కాదని, ప్రవర్తనలో మార్పు రావాలని అన్నారు. భారతీయ సమాజంలో అంబేద్కర్ తర్వాత గొప్ప మేధస్సు కలిగిన వ్యక్తిగా వరవరరావ్ కనపడతాడని, సాహిత్యంలో ప్రధాన భూమిక పోషించి ఉంటే ఆయనకు జ్ఞానపీఠ పురస్కారం వచ్చేదని తెలిపారు. విప్లవోద్యమం నిర్మించేవారు ఎవరంటే విలువలకు నిలబడే వారు, నిజాయితీ గలవారు, త్యాగాలు చేసేవారు, ఆచరణలో చూపేవారని అన్నారు. దీనికి ఉదాహరణగా సాయిబాబాని పేర్కొనవచ్చని తెలిపారు. గ్రాంసీ తర్వాత అంత గొప్ప మేధస్సు కలిగిన వ్యక్తి భారతీయ సమాజంలో ఎవరైనా ఉన్నారంటే ఆయన సాయిబాబా మాత్రమే అని అన్నారు. గ్రాంసీ జీవితానికి సాయిబాబా జీవితానికి సారూప్యత ఉందని తెలిపారు. అందుకే సాయిబాబా పట్ల డాక్టర్లకు, న్యాయమూర్తులకు, గవర్నర్లకు సానుభూతి ఉండేదని వివరించారు. గుజరాత్ నమూనా ఎంత దుర్మార్గమైనదో మనందరికీ తెలుసని, అటువంటి నమూనాన్ని దేశమంతా రుద్దుతామనడం దుర్మార్గానికి సంకేతమని అన్నారు. కుంభమేళాలో వేల మంది చనిపోతే దేనికి నిదర్శనమని తెలిపారు. కుంభమేళాలో 40 కోట్ల మంది మునిగితే దేశం ఎందుకు విముక్తి అవ్వలేదని ప్రశ్నించారు. మూఢత్వాలు అభివృద్ధి చెందుతుంటే మనం ఎదుర్కోవడంలో విఫలమయ్యామని తెలిపారు. మేధావులు జ్ఞానాన్ని భాషగా మార్చాలన్నారు. పాటను పాడటం వేరు, సృష్టించడం వేరని తెలిపారు. ఇటీవల కాలంలో రచయితలు ప్రజలకు దగ్గరయ్యే సాహిత్యాన్ని సృష్టిస్తున్నారని, ఇది ఆశాజనకంగా భావిస్తున్నానని తెలిపారు. బహిరంగ సభకు నాగేశ్వరాచారి అధ్యక్షత వహించారు. ఈ సభలో దాదాపు 27 పుస్తకాలను ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యంలో వెలుగునీడలు అన్న అంశంపై వరలక్ష్మి అధ్యక్షత వహించగా విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ మాట్లాడారు. మధ్యాహ్నం విప్లవోద్యమంపై ఫాసిస్ట్ యుద్ధం- బుద్ధి జీవుల పాత్ర అంశంపై సాగర్ అధ్యక్షత వహించగా పాణి మాట్లాడుతూ ప్రజల గుండెలపై కార్పొరేట్ మొక్కలను నాటుతున్నారని, రాజ్యాంగం పరువు తీస్తున్నారని తెలిపారు.

పోలవరం ఎడమ కాలువ కనెక్టివిటీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు బృందం ఆదివారం పర్యటించింది. బోర్డు చైర్మన్ ఎకె.ప్రధాన్, కార్యదర్శి అజాగేశన్.. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ కనెక్టివిటీలో ప్రధానమైన ప్రాంతాలను పరిశీలించారు. ఎడమ కాలువ జంట గుహలు, ఎగ్జిట్ ఛానల్ హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్, నేవిగేషన్ టన్నెల్, నేవిగేషన్ ఛానల్, పవర్ హౌస్ ప్రాంతాలను పరిశీలించారు. వారికి ఇఇ ప్రేమచంద్, డిఇలు శంకరరావు, నారాయణరావు, డిఇఇ శ్రీనివాస్ సంబంధిత వివరాలను తెలిపారు. అనంతరం బృందం సభ్యులు పోలవరం ప్రాజెక్టుకు చేరుకుని అక్కడి నుండి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు బయల్దేరి వెళ్లారు.

పనులను పరిశీలిస్తున్న రివర్ మేనేజ్‌మెంట్ బృందం

అధికంగా వచ్చిన బిల్లులు చూపుతున్న బాధిత మహిళలు

అధిక విద్యుత్ బిల్లులతో గిరిజనులు బెంబేలు

- ఒకరికి రూ.1.60 లక్షలు, మరొకరికి రూ.29 వేలు

ప్రజాశక్తి- కొత్తకోట (అనకాపల్లి జిల్లా)

రూ.వేలు, లక్షల్లో కరెంట్ బిల్లులు రావడంతో అనకాపల్లి జిల్లా రావికమతం మండలం టి.అర్జాపురం శివారు డోలవానిపాలెం గ్రామానికి చెందిన పేద గిరిజనులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామానికి చెందిన డోల సత్తిబాబు ఇంటికి ఈ నెల రూ.1.60 లక్షలు బిల్లు వచ్చింది. ఈ విషయమై అతని తల్లి లక్ష్మి మాట్లాడుతూ తమ ఇల్లు శిథిలం కావడంతో నాలుగేళ్లుగా వేరొకరి ఇంట్లో అద్దెకు ఉంటున్నామన్నారు. అప్పటి నుంచి పాత విద్యుత్ మీటర్‌ను వాడటం లేదని తెలిపారు. ఇటీవలే సొంత ఇల్లు కట్టుకుని మీటర్ బిగించుకున్నామన్నారు. దానికి ఇంత పెద్ద మొత్తంలో బిల్లు వచ్చిందని చెప్పారు. పాత ఇంటిలో బల్బు, టివి మాత్రమే వాడేవారిమని తెలిపారు. తాము గిరిజనులమని, ప్రతి నెలా 200 యూనిట్లులోపు వాడుతున్నందున ఉచిత విద్యుత్ పథకం అమల్లో ఉన్నందున అప్పట్లో బిల్లు వచ్చేదికాదని చెప్పారు. ఈ నెల రూ.1.60 లక్షల బిల్లు వచ్చిందని ఆమె వాపోయారు. కూలి పనులతో పొట్టపోసుకునే తాము ఇంత బిల్లు ఎలా కట్టగలమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే గ్రామానికి చెందిన మరో గిరిజనురాలు గాది కొండమ్మ మాట్లాడుతూ తన భర్త నాగరాజు పేరున విద్యుత్ కనెక్షన్ ఉందని, ప్రభుత్వ ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా పదేళ్లుగా తమకు బిల్లు రావడం లేదని తెలిపారు. ఈ నెల రూ.29,913 బిల్లు రావడంతో ఏం చేయాలో తోచడం లేదన్నారు. ఇంటిలో బాలింత ఉందని, బిల్లు చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని అంటున్నారని ఆమె వాపోయారు.

సాంకేతిక లోపం కారణంగానే : ఎఇ నందన్

అధిక బిల్లుల విషయమై మండల విద్యుత్ శాఖ ఎఇ నందన్‌ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా సాంకేతిక లోపంతోనే బిల్లులు అధికంగా వచ్చాయని, తొందరలోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

సమిష్టి సహకారంతో ఆత్మకూరు అభివృద్ధికి కృషి

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రులు

ప్రజాశక్తి -ఆత్మకూరు (నెల్లూరు జిల్లా)

ఆత్మకూరు నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి నారాయణ, ఎండి ఫరూక్, సవిత, బిసి జనార్దన్ రెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత టిడ్కో హౌసింగ్ కాలనీలో ప్రజల కోసం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీసీతారాముల స్వామి వారి ఆలయ నిర్మాణానికి మంత్రులు భూమి పూజ చేశారు. దీంతోపాటు పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నూతన అతిథి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆత్మకూరులో ఆధునీకరించిన ఆర్‌అండ్‌బి అతిథి గృహాన్ని, బిసి గురుకుల పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి ఆనం మాట్లాడుతూ.. ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధిలో మంత్రులు పాలుపంచుకున్నారని తెలిపారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి సోమశిల ప్రాజెక్ట్ పరిస్థితి అయోమయంగా మారినా వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమశిలను పరిశీలించి సోమశిల హైలెవల్ కాలువ పనులను, ఆప్రాన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. 2014కు ముందు తన హయాంలో మొదలుపెట్టి పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని చెప్పారు. అందరి సహకారంతోనే ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ బడ్జెట్‌లో సిఎం చంద్రబాబునాయుడు బిసిలకు పెద్దపీట వేశారన్నారు. రహదారులు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. రహదారుల మరమ్మతులకు, అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. పురపాలక శాఖ మంత్రి పి నారాయణ మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్ల సముదాయాల్లో రామాలయాలను నిర్మించాలని ఆనం సంకల్పించడం గొప్ప విషయమన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆత్మకూరు నియోజకవర్గం తరహాలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను అభివద్ధి చేసుకునేందుకు ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని కోరారు.

మిరప రైతుకు నష్టాల ఘాటు

- తెగుళ్లతో తగ్గిన దిగుబడి
- పడిపోయిన ధర

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

మిరప రైతుకు తెగుళ్ల ఘాటు తగులుతోంది. తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గడం, ధర పతనం కావడంతో రైతులు నష్టాలను మూటగట్టుకుంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1.33 లక్షల ఎకరాల్లో మిరప సాగులో ఉంది. విత్తనాలు, నారు, సాగు, ఎరువులు, కలుపులు, ఇతర ఖర్చులు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల ఖర్చవుతోంది. ఈ ఏడాది తెగుళ్ల బెడద పెరగడంతో ఖర్చు కూడా పెరిగింది. ప్రస్తుతం పంట కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సాధారణంగా ఎకరానికి 25 నుండి 30 క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ, ఈ ఏడాది అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల 10 నుండి 12 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తోంది. పంటకు దోమ, నల్లి, బింగి తెగుళ్లు ఆశించడంతో దిగుబడి తగ్గింది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు మిరప ధర రూ.10 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే ఉంది. రెండేళ్ల కిందట రూ.23 వేల నుంచి రూ.26 వేల వరకు పలికింది. గత సంవత్సరం రూ.14 వేల నుండి రూ.17 వేల వరకు ధర లభించింది. ప్రస్తుత సంవత్సరం ధర మరింత తగ్గిపోవడంతో పెట్టుబడులు కూడా దక్కడం లేదు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఎకరానికి రూ.50 వేలు కౌలు చెల్లించి మిరప సాగు చేశారు. వారికి ఈ ఏడాది నిరాశే ఎదురైంది. ధర, దిగుబడి తగ్గిపోవడంతో పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కుతోచని స్థితిలో రైతులు, కౌలు రైతులు ఉన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఎకరాకు పది క్వింటాళ్లే దిగుబడి

రెండు ఎకరాల్లో మిరప సాగు చేశాను. అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల ఎకరాకు పది క్వింటాళ్ల చొప్పున మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రస్తుత ధర ప్రకారం క్వింటాలు రూ.13 వేలకు అమ్మినా రూ.1.30 లక్షలు మాత్రమే వస్తుంది. నష్టమే మిగులుతుంది.

- రామకృష్ణ, రైతు, జోలాపురం, బనగానపల్లె మండలం.

పరిహారం అందించి ఆదుకోవాలి

వ్యవసాయ శాఖాధికారులు, శాస్త్రవేత్తలు మిరప పంటను పరిశీలించి తెగుళ్ల నివారణకు మందులను సూచించాలి. పంటను కాపాడుకునేందుకు పురుగు మందుల కోసం రైతులు ఎకరాకు వేలాది రూపాయలు ఖర్చు చేశారు. దీంతో, సాగు ఖర్చు పెరిగింద. అయినా, దిగుబడి తగ్గిపోయి నష్టపోతున్నారు. ప్రభుత్వం పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి. మిరప పంటకు మద్దతు ధర ప్రకటించాలి.

- టి.రమేష్ కుమార్, రైతు సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 10 ఫిబ్రవరి 2025

"ఈవాళ భారతీయ రచయితల
కర్తవ్యం ఏమిటంటే- సమాజంలో చోటు
చేసుకుంటున్న మార్పులను తమ రచనల్లో
చిత్రించటం; ప్రగతిశీల శక్తులకు తోడ్పాటునందిస్తూ;
సమాజంలో శాస్త్రీయ, తార్కిక దృష్టిని పెంచటం.

– అభ్యుదయ రచయితల మేనిఫేస్టో, 1934

ఊరవతల ఒంటరి గోడ

ఊరవతల ఒంటరి గోడ
నవ్వు ముఖాలతోనే కనిపిస్తుందెప్పుడూను
గోడవెనక చీకటిలా నవ్వు వెనక కల్మషం ఎవరికీ
కనబడదు
.ఆ ముఖం ఎప్పుడూ ఒకటే అయ్యుండదు
ఎప్పుడేముఖంతో నవ్వుతుందో దానికీ తెలీదు,
నవ్వే ముఖాల్ని ఆకలిడొక్కల పశువులు
పీక్కుతింటున్నప్పుడల్లా ఎంత సంతోషిస్తుందో..

మరో నవ్వు ముఖం వచ్చి వాలుతుంది
దాని సంతోషాన్ని చెరిపేస్తూ
ఏ ముఖాన్ని ఎందుకు అతికించుకోవాలో
దానికి తెలీదు
ఏ ముఖం ఎప్పుడు జారిపోతుందో అదీ తెలీదు
నవ్వే ముఖాల వెనక ఎన్ని చీకటి కోరలున్నాయో
తెలిసినా
ఏమీ చేయలేని అశక్తత దానిది!

ఇప్పటికెన్ని ముఖాల్ని తగిలించుకుందో
ఆ ముఖాల్ని తగిలించుకున్నందుకు ఎంత
కృంగిపోయిందో
గోడ జన్మ ఎత్తినందుకు
లోలోన కుమిలిపోతుందే గానీ బయటపడదు

ఆ నవ్వుల్లో ఎన్నెన్ని బుసలుకొట్టే నాగులో
ఆ చూపుల్లో ఎన్నెన్ని విషపు బాణాలో
ఎన్ని నవ్వు ముఖాల్ని తగిలించుకున్నా
నవ్వు రాదు బండ బారిపోయిన మొండిగోడకి
దాని పెదాల మీంచి నవ్వెప్పుడో రాలిపోయింది
రేకుతో గీకేసిన సున్నం పొడిలా ...
చీకటికి వెల్లవేసి వెన్నెలని భ్రమింపజేసే
ఐంద్ర జాలికులకు గోడ ఒక ప్రచార సాధనం!
ఇంద్ర ధనుస్సుల్ని గోడ మీద అతికించి
దానినొక వెలియాలిలా నిలబెడతారు నవ్వుల
సొంతదారులు
పాపం గోడ !
తెల్లగా వెన్నెల్లా నవ్వాలనే దాని కోరిక ఎప్పటికీ
నెరవేరదు
ఏదోవొక ముఖం ఎప్పుడూ వెంటాడుతూనే
ఉంటుంది
మరకమరకల విషహాసాలతో ...

తనను కూల్చివేసే ఒక పెను తుపాను కోసం
నిలువెత్తు మౌన విషాదంలా
ఎదురుచూస్తుందిప్పుడు
విషపు నవ్వుల ముఖాల్ని మోస్తూ ....

– లాంగుల్యా

చరమాంకం

అనుకున్న దేది జరగలేదు
అన్నం ముద్ద ఇంకా దూరంగానే ఉంది
పాల ప్యాకెట్ ఆకాశం నుంచి కిందికి రానంది
'పింఛను' పదం చుట్టూ
కమలం ఎన్ని కలల్ని చుడుతుందో!

బడ్జెట్ ప్రవేశించింది
ఆదాయపు పన్ను తగ్గింది
ఆదాయం లేని అర్భకుల సంగతి ఏమిటో?
గాయాల్ని మోసే కాయానికి అరవై వచ్చి
అన్ని భ్రమల నుంచి దూరమై,
వెయ్యి నుంచి ఏటో వెళ్ళిపోతుందనుకున్న బతుకు
ఎక్కడ వేసిన గొంగళి చందాన ఉన్నది!

ప్రతిసారీ అదే నాటకం
నేపథ్యం మారుతోంది
అంకెల రంకెలయ్యాక అచ్చేదిన్ వచ్చేసాక
వాళ్ళు వెళ్ళిపోయారు
మళ్లీ మళ్లీ మోసపోయాక
చిరుగుల తెరతో చరమాంకం ప్రారంభమైంది!

– వీరేశ్వరరావు మూల

చరిత్రలో సాన పెట్టి ఉంచండి

చరిత్రలో పేజీలంటూ మిగులుంటే
మావంటూ రెండు అక్షరాలు రాసి ఉంచండి
భూమి పుట్టుక గురించి కాకపోయినా
భూమిని కాపాడుకునే పోరాటాల గురించి
మళ్ళీ మళ్ళీ వెదికే అవకాశం రాక మానదు!

స్వేచ్ఛా వాయువుల కోసం పోరాడి, నేలకొరిగిన
నాలుగు రక్తపు గుర్తులు చరిత్రలో అతికించండి
ఉక్కు సంకెళ్ల ఉక్కిరి బిక్కిరిలో
ఊపిరి కోసం రానున్న కాలం చూడకపోదు!
బతుకు పోరాట ఆనవాళ్లు
చరిత్ర పుస్తకంలో నిక్షిప్తం చేసి ఉంచండి
అన్నీ పోగొట్టుకున్నాక.. కూడు, గూడు కోసం
ఉత్తి చేతులలో మళ్ళీ మార్గాలు అన్వేషించకపోరు!

అడవిని అట్టి పెట్టుకుని ఉన్న
అస్తిత్వ పోరాటాన్ని అక్షర రూపంలో దాచండి
దోపిడీ పన్నాగానికి అడవి అడుగంటుకుపోయాక
చరిత్ర సాక్ష్యంగా విల్లంబులు ఎక్కుపెట్టరావొచ్చు!

బతుకు పోరాటానికి దారులు
చరిత్రలో సాన పెట్టి ఉంచండి
ఆయుధాలైతే తుప్పు పట్టుకు పోతాయేమో
ఆచరణ మార్గాలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి!

దోపిడీ దారులు విసిరిన నూకలకు మోసపోయి
వర్తమానం అంతా బాగుందనిపించినపుడల్లా
ప్రజా చైతన్యం స్తబ్దతకు మాత్రమే లోనవుతుంది
అదే కబంధ హస్తాల్లో పెనుగులాడినపుడు
పరిస్థితి మళ్ళీ మొదటకు రాక తప్పదు!

– వినోద్ కుత్తుం
96343 14502

కమనీయ కవనగాన ప్రవాహం

కవిత్వంలోని అనేక ప్రక్రియల్లో దీర్ఘకవిత ప్రత్యేకమైంది. దీర్ఘ కావ్య నిర్వహణ క్లిష్టతరమైంది కూడా. కవి ఎదకనుమలో చిన్న పాయగా పుట్టి ఉపకథల వాగుల్ని కలుపుకుని నదిగా మారి ఉరుకులతో పరుగులతో తరగలెత్తి ప్రవహించి చివరికి పాఠకహృదయసంద్రంలో సంగమించాలి.

గుమ్మ, (శ్రీకాకుళం, (ఛాయరాజ్) నాగలి, నాగేటిచాలుకు నమస్కారం (గంటేడ) మగ్గం బతుకు (రాధేయ), నాగేటిగోడు (కొండ్రెడ్డి వెంకటరెడ్డి), పునర్యానం (వాడ్రేవు చిన వీరభద్రుడు), పొలి (రాచపాళెం), మహాశూన్యం (దీర్ఘాశి విజయ భాస్కర్) ... ఇలా చాలా దీర్ఘ కావ్యాలు వచ్చేయి. ఈ కోవలో వొచ్చిన మరో దీర్ఘకావ్యం శ్రీ శూద్రగంగ. ప్రముఖ సినీ గీతరచయిత సుద్దాల అశోక్ తేజ హృదయగిరి శిఖరాన ఉద్భవించి సహృదయ కేదారాలలో హరితరాగాలాలపిస్తూ హృద్యంగా సాగి సాహితీ సాగరంలో సంగమించే ఈ 'శ్రీశూద్రగంగ' వస్తువు విలక్షణమైనది. ఆలోచనాత్మకమైనది. నిర్వహణలో విశిష్టమైనది.

దేశమంటే మట్టి కాదు, దేశమంటే మనుషులు అని, మరీ ముఖ్యంగా పాడిపంటలు పొంగిపొర్లే దారిలో పాటుపడే కష్టజీవులే అని మహాకవి గురజాడ వారు చెవినిల్లుగట్టుకొని చెప్పేరు గదా.. అదుగో ఆ కష్ట జీవుల కోసమే, ఆ మట్టి మనుషుల కోసమే ఆవిర్భవించిందీ శూద్రగంగ. 'హరిపాదాల నుంచి పుట్టింది గంగమ్మ' అని, పాదాల నుంచి పుట్టిన వారు శూద్రులైతే గంగమ్మ పుట్టుక కూడా శూద్రపు పుటకే అని బల్లగుద్ది మరీ చెప్తున్నాడు కవి సుద్దాల అశోకతేజ. కవి చూపంటే ఇదీ. పావనగంగ, సురగంగ, భాగీరథి, జాహ్నవి మొదలైన పేర్లతో పిలిచి గంగమ్మ ఎవరిదో.. తాను ఇలకు అవతరించింది దేనికోసమో, ఎవరి కోసమో ఆ అసలు విషయాన్ని దాచి పెట్టినవారి గుట్టు బయట పెట్టి, మర్మాన్ని విప్పి చెప్పి 'సహస్ర వృత్తుల సమస్త శ్రామికులదీ శూద్రగంగ" అని ఎలుగెత్తి చాటుతున్నాడు కవి అశోక్ తేజ.

'పాదాలు నేలకు తాకని వారింట, చెమట పట్టని దేహాల వెంట, రెప్పపడని వారికంట నేనుండ నొల్లనని, మట్టి మనుషులతో మమేకమై నేలమ్మకు ఆకుపచ్చ కోకలు నేయడానికొచ్చిన సాలెల ఆడపడుచట ఈ శ్రీశూద్ర గంగ.. సమస్త వృత్తుల, సకల కులాల వారికీ సమన్యాయం చెయ్యడానికి ఇలకవతరించిందీ శ్రీ శూద్రగంగ' అంటాడు కవి. ఎంత గొప్ప ఊహ!

నిజానికి కవి వచన కవిత అన్నాడే గానీ చదువుతుంటే ఒక లయతో, ఒక తూగుతో ఒక గొప్ప సంగీతంలా మనకు తెలియకుండానే ప్రవాహంలా సాగిపోతుందీ కావ్యం. సహజంగా ఈ కవి గాయకుడు కూడా కావడం వల్ల కావ్యాన్ని చదువుతుంటే అదొక మధురగీతంగానే సాగిపోతుంది. అలల ఉయ్యాలలో ఊగుతూ, మెలికలు తిరుగుతూ శూద్రగంగ చెప్పే సంగతులు వినడమొక అనుభవం. ఆరంభించడమే మనకు తెలుస్తుంది.. చివరి వాక్యం చదివి 'మరి చదవడానికి లేదా? పాడుకోడానికి మరేమీ లేదా? అప్పుడే అయిపోయిందా? అని అనిపించి ఆ కావ్యగాన లహరుల్లోంచి బయటకు రాడానికి మనసుకు కొంత సమయం పడుతుంది.

వాక్యాల్ని వొడుపుగా మలిచి, ఎక్కడ తుంచి ఎక్కడ కలపాలో తెలిసిన గానభాష రహస్యం తెలిసిన కవి కలం వెంట ప్రవాహవేగంతో పదం వెంట పదంగా పరుగులు తీసి, అలలు అలలుగా అలరిస్తాయి వాక్యాలు. ఆ ఉరవడిలో, ఆ సంగీతఝరిలో మనల్ని మనం మరిచిపోతామని ఈ 'శ్రీ శూద్రగంగ' మరో మారు గుర్తుచేసింది.

అద్భుతమైన పదచిత్రాలు, మన ఊహలకందని కల్పనలు, మన పూర్వవుల మార్గం నుంచి కసింత పక్కకి వొసిలించి కొత్త దారుల్లోకి పాఠకుల్ని లాక్కు పోతాయి.

'భారతీయ ప్రాంతానికి,
పేదప్రజల గ్రామానికి,
చమట స్వర్గధామానికి వచ్చే బడుగు గంగ
ఎందుకు మరి భగీరథి అయినది?
ఎవరు ఇలా తన పేరును మార్చినది?
....
వక్రించిన పౌరాణిక శిక్షకు గురి అయినదా?
పక్షపాత కవుల కట్టుకథలకు ఎర అయినదా?' అని కవి



ప్రశ్నిస్తాడు.
'ద్రావిడులను దావులుగా
నిర్ధారించినది
ఇటు గంగను భగీరథిగా
పిలిచినది
జాహ్నవిగా మలచినది
ఈ కపట నాటక సంగ
పరివారమే' అని
నిక్కచ్చిగా ప్రకటిస్తాడు
'అసలు నీవు వస్తున్నది
కాయకష్ట కృషీవలుల
తిప్పలు పోగొడదామని,
ఇంటింటికి నవధాన్యపు
కుప్పలు రాబడుదామని'
శ్రమజీవుల కోసమే గంగ
భువికి దిగినందునే అది
శూద్రగంగ అనడమే
సరైనదని గంగ తరుపున
వకాల్తా పుచ్చుకుంటాడు.
'చమట జలాలతో మెరిసే చేతులంటే ఇష్టం
వాళ్ళ ఛాతులంటే ఇష్టం
మడి అంటే ఇష్టం, మట్టితో ముడియంటే ఇష్టం
వరి మడులను తడిపే నీటి తడులంటే ఇష్టం'
....
'మట్టి అంటని పాదములు గల వీళ్ళా సుందరులు?
బురద గంధమలదుకునే భుజానులే సౌందర్యులు' అంటూ తానెవరి తరుపున నిలబడి మాట్లాడుతున్నాడో స్పష్టం చేస్తాడు. శ్రమని, చమటని ఎంత గౌరవించకపోతే ఈ మాటలనగలుగుతాడు కవి. శివుని గురించి వెబుతూ సబ్బండ జాతికి బండ గుర్తుగా సాంబడే అని.. శూద్రజాతి పౌరుషుడు ఈశ్వరుడు అని నిర్ధారిస్తాడు. దివిజ గంగ భువికి దూకిన వైనాన్ని వర్ణిస్తూ,
'ఒక్కసారిగ దూకె గంగ ఆబోతై,
ముక్కుతాడును వేసె శివుడు ఒక రైతై' అని ఒక్క రైతుతో ఆగకుండా సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలలోనూ గంగను ఊహిస్తాడు.
'శ్రీశ్రీశ్రీ శూద్రగంగ శూద్రావనికొస్తున్నది
......
పరమాత్ముని కాళ్ళు శూద్ర గర్భసంచులైతే
పరమాత్ముని చరణాలలో పురుడు పోసుకున్న
శుద్ధమైన అసలు సిసలు శూద్రగంగనంటున్నది' అంటూ సన్నని వాగులా మొదలైన కావ్యం మెలికల మెలికలుగా ఉరుకులు పరుగులతో అలలు అలలుగా వరదై ఉప్పొంగి,
'ఏదేశంలో శూద్రులు నివసిస్తారో ఆ దేశంలో
గంగ ప్రవహిస్తుంది' అంటూ ముగిసి పాఠకుని ఎదదకదలిలో కలిసి ఒక గొప్ప అనుభవాన్నిస్తుంది. ఎన్నో సొగసులు, ఇంకెన్నో చమత్కారాలు, మరెన్నో చమక్కులు నింపి శూద్రగంగను మన దోసిళ్లలో నింపుతాడు. అవన్నీ ఎవరికి వారు స్వయంగా ఆస్వాదిస్తేనే అందమూ ఆనందమూనూ. ఈ కావ్యానికి ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, అట్టాడ అప్పలనాయుడు, ప్రొఫెసర్ మాదాసు వినోదిని గార్ల మూడు ముందుమాటలున్నాయి. (అవింకా నేను చదవలేదు) అత్యంత హృద్యమైన ఈ కావ్యం ముద్రణ మరింత అందంగా ఆకర్షణీయంగా చూడగానే చదవాలనిపిస్తుంది. అశోక్ తేజ గతంలో 'శ్రమ కావ్యం,' 'నేను అడవిని మాట్లాడుతున్నాను' అనే దీర్ఘ కావ్యాలు వెలువరించేరు.. ఇప్పుడీ శ్రీశూద్రగంగ.

ఇది విశ్లేషణా కాదు, సమీక్ష కాదు, విమర్శ అంతకంటే కాదు, కేవలం కావ్యం చదివిన తక్షణ స్పందన మాత్రమే! ఇంత మంచి పుస్తకాన్ని ప్రేమతో ఇచ్చిన నా సోదరుడు అట్టాడ అప్పల్నాయుడుకి కృతజ్ఞతలు. ఇంత అందమైన కావ్యాన్ని పాఠకులకు (కేవలం వంద రూపాయల వెలకే) కానుక చేసిన డా:సుద్దాల అశోక్ తేజ గారికి హృదయ పూర్వక అభినందనలు.

– గంటేడ గౌరునాయుడు

సాహిత్య అకాడమీ, 'వేదిక' (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం) సంయుక్త నిర్వహణలో జనవరి 26వ తేదీ ఆదివారం ఉదయం 'తెలుగు నాటకం- స్త్రీవాదం'పై సదస్సు పల్నాడు జిల్లా యడ్లపాడులో జరిగింది. ప్రారంభ సభ సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం సభ్యుడు వల్లూరు శివప్రసాద్ స్వాగతం ఉపన్యాసంతో మొదలైంది. సభ వేదిక అధ్యక్షులు ముత్తవరపు సురేష్ బాబు అధ్యక్షతన జరిగింది.

తెలుగు నాటకంలో మహిళా దృక్పథం

స్త్రీవాద రచయిత్రి వోల్గా కీలకోపన్యాసం చేస్తూ ... స్త్రీ చైతన్యాన్ని ఆశిస్తూ వారి సమస్యలపై వారి జీవితాలనే కేంద్రంగా చేసుకొని రచనలు జరిగాయని, గురజాడ తన కన్యాశుల్కం నాటకంలో స్త్రీల మనోభావాలకు రూపం ఇస్తూ, ప్రశ్నిస్తూ స్త్రీల గురించి అప్పటికీ సంఘంలో ఉన్న తేలిక మాటలకు భిన్నంగా పాత్రలను తీర్చిదిద్దారని వివరించారు. మధురవాణి పాత్ర ద్వారా స్త్రీ సాధికారతకు రూపం ఇచ్చారనీ, ఆ పాత్రతో పోల్చదగిన పాత్ర సృష్టి మళ్ళీ ఇంతవరకు జరగలేదని అన్నారు. ఆనాటి నాటకాల్లో స్త్రీల మధ్య సహకార భావన ఎంత అవసరమో చెప్పారని అన్నారు. సౌజన్య రావు పంతులు మధురవాణికి భగవద్గీతను ఇవ్వడం ద్వారా 'స్వపక్షం వారైనా- అధర్మపరులైతే వారికి వ్యతిరేకంగా యుద్ధం చేయమన్న సందేశాన్ని గురజాడ ఇచ్చారన్నారు. హిందూ కోడ్ బిల్ తయారవుతున్న నేపథ్యంలో చలం 'విడాకులు' నాటకం రాశారని; ఆధిపత్య భావజాలం, నాది అనే పొసెసివ్‌నెస్ నుంచి దూరంగా ఉండాలని 'ఊర్వశి' నాటకం ద్వారా చెప్పారని తెలిపారు. ఆత్రేయ నుంచి ఆకెళ్ల వరకు స్త్రీలలో వస్తున్న చైతన్య క్రమాన్ని రాస్తూ వచ్చారని అన్నారు. సాంకేతికతను, నూతన భావాలను కలిపి రాసి ప్రదర్శించగలిగేవాటికి మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు. సామాజిక మార్పుకు కీలకమైన పాత్రలను రూపొందించి రాయాలంటే బాగా అధ్యయనం చేసి రాయాలని అన్నారు. ముత్తవరపు సురేష్ కుమార్ ప్రారంభ సదస్సును ముగిస్తూ మాట్లాడారు.

మొదటి సదస్సుకు అంబటి మురళీకృష్ణ అధ్యక్షత వహిస్తూ .. పురుష జనవాలకు స్త్రీలే కారకులన్న ప్రాథమిక సత్యాన్ని గుర్తించి స్త్రీలను గౌరవించాలి అన్నారు. ఆహారయోగ్యమైన వాటిని గుర్తించడంలో నాగరికతారంభంలో, వేలాదిమంది స్త్రీలు మరణించారన్న సత్యాన్ని మరిచిపోరాదని అన్నారు. స్త్రీలను గౌరవించడం, సమానత్వం పాటించటం పురుషుల కనీస కర్తవ్యం అన్నారు. 'నాటకం- స్త్రీవాదం' అన్న అంశంపై పత్ర సమర్పణ చేస్తూ డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు... 'ప్రపంచ నాటక చరిత్రలో ఎక్కడ స్త్రీ చైతన్యం కన్నువిప్పిందో చెబుతూ, నార్వేలో హెన్రిక్ ఇబ్సన్ చేసిన 'ఏ డాల్స్ హౌస్' నాటకం గురించి ప్రస్తావించారు. షేక్సిపియర్ తర్వాత అత్యంత ప్రజాదరణ పొందినవి ఇబ్సన్ నాటకాలే అన్నారు. కె.వి. గోపాలస్వామి, బళ్ళారి రాఘవ, పివి రాజమన్నార్ ... ఈ ముగ్గురు ఇబ్సన్‌ని బాగా చదివిన వారే అని అన్నారు. తప్పెవరిది?, ఏమి మగవాళ్ళు?, నిష్ఫలం నాటికల గురించి విశ్లేషించారు. స్త్రీ పాత్రను స్త్రీలే ధరించాలన్న నియమం పెట్టి బళ్ళారి రాఘవ కెవి పద్మావతితో నటింపచేశారని అన్నారు. హేతువాదం, స్త్రీవాద దృక్పథంతో నార్ల వారు 'సీత జోస్యం', చలం 'సీత అగ్ని ప్రవేశం' నాటకాలను రాశారని చెప్పారు. 1970 నుంచి ఇప్పటివరకు వచ్చిన నాటకాల్లో ... మాతృస్వామ్యం, లింగ వివక్ష, ఆర్థిక అసమానతల గురించి రాసిన నాటకాల గురించి ప్రస్తావించారు. ఎస్.తారక రామారావు క్షమయా ధరిత్రి, ఎం.వి.ఎఎస్ హరనాధరావు లేడి పంజా, మార్గశీర్ష శ్వేతపత్రం, మాంగల్యానికి మరో ముడి, విజయ భాస్కర్ రాసిన మబ్బుల్లో బొమ్మ మొదలైన నాటకాల్లో స్త్రీల చైతన్యం వెల్లివిరిసిన పాత్రలు ఉన్నాయన్నారు. మహా శ్వేతాదేవి రాసిన ద్రౌపది నాటక దర్శకుడు కన్హయలాల్ ద్రౌపది పాత్రను తన భార్య చేత వేయించి పతాక సన్నివేశంలో ఆ పాత్ర నగ్నంగా నిలబడి పురుషాధిక్యతను ప్రశ్నించడంలో చరిత్ర సృష్టించింది అన్నారు. మణిపూర్‌లో అత్యాచారానికి వ్యతిరేకంగా 12 మంది స్త్రీలు నగ్న ప్రదర్శన చేసిన ఘటనను ప్రస్తావిస్తూ మహిళా చైతన్యం స్త్రీని గతంలో లాగా మౌనంగా హింసను సహిస్తూ భరిస్తూ రోదిస్తూ ఉండే పాత్రలుగా కాక తీవ్ర స్వరంలో ప్రతిఘటించే క్రియాశీలక పాత్రలను రచయితలు రాశారని చెప్పారు.

తర్వాత 'పద్య నాటకం- స్త్రీ అభ్యుదయం' అన్న అంశంపై పత్ర సమర్పణ చేశారు డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు. స్త్రీ పాత్రలు లేని సాంఘిక నాటకాలు ఉన్నాయి కానీ, స్త్రీ పాత్రలేని పద్య నాటకాలు లేవన్నారు. వందేళ్ళ క్రితం వచ్చిన చింతామణి నాటకం నిషేధించబడటం గురించి ప్రస్తావిస్తూ, పద్య నాటకాల్లో స్త్రీ అభ్యుదయం ఇంకా చీకట్లోనే ఉందని అన్నారు. 'సంస్కరణోద్యమ నాటకాలు- స్త్రీ పాత్రలు' అన్న అంశంపై డాక్టర్ సిహెచ్.సుశీలమ్మ చాట్లాడుతూ, కన్యాశుల్కం, వరవిక్రయం, చింతామణి నాటకాల్లోని స్త్రీ పాత్రలను విశ్లేషించారు. బాల్య వివాహం, వితంతు సమస్యలు, సతీసహగమనం వంటి ఆనాటి సమస్యలను ఎత్తిచూపిన నాటకాల గురించి చెబుతూ ఆ నాటకాలను, రచన, శిల్పం, పాత్రల స్వభావాలను అర్థం చేసుకోవడానికి తప్పక చదవాలని అన్నారు.

రెండవ సదస్సుకు పిన్నమనేని మృత్యుంజయ రావు అధ్యక్షత వహిస్తూ... స్త్రీల సమస్యలన్నిటికీ మూలం సమానత్వం లేకపోవడం అని అన్నారు. 'ఆధునిక వీధి నాటకం- స్త్రీ వికాసం' అన్న అంశంపై దేవి పత్ర సమర్పణ చేస్తూ.. వీధి నాటకం అంటేనే సామాజిక నాటకమని పేర్కొన్నారు. ఇంతవరకు సమాజం గుర్తించని విషయాలను గుర్తింపచేయడంలో వీధి నాటకం ముందుంది అన్నారు. 'నాటకం పురుషాధిక్యత- స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం' అన్న అంశంపై నల్లూరి రుక్మిణి; 'నాటకం- స్త్రీ వైవాహిక సమస్యల చిత్రణ' అన్న అంశంపై జె. కనకదుర్గ పత్ర సమర్పణలు చేశారు.

సాహిత్య అకాడమీ నగరాలు పట్టణాల్లో సదస్సులు నిర్వహించే ఆనవాయితీకి భిన్నంగా పూర్తిగా గ్రామీణ వాతావరణం కలిగి ఉద్యమాలకు, నాటకాలకు పేరుపడ్డ యడ్లపాడులో నిర్వహించటం అభినందనీయం. సదస్సుకు పలనాడు ప్రాంతాల్లోని మహిళా ఉపాధ్యాయులు, కార్యకర్తలు, వ్యవసాయ రంగ మహిళలు ఎక్కువగా హాజరు కావడం; పత్ర సమర్పకులు విశేష అధ్యయనం, ఆలోచనాత్మక ధోరణిలో ప్రసంగించడం స్ఫూర్తిదాయకంగా ఉంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల, పాత ఒంగోలు జిల్లాలకు చెందిన తొమ్మిది నాటక పరిషత్తుల వారు ఒకే గొడుగు కింద 'వేదిక' పేరుతో ఐక్యంగా నిలబడి ఈ సదస్సును నిర్వహించడం అభినందనీయం.

– మల్లేశ్వరరావు ఆకుల
94400 07374

రంగురంగుల మాతృత్వం యోధ

'మాతృత్వం ఒక అందమైన వరం', 'అమ్మంటే దేవుడితో సమానం' ... ఇలా తల్లి గురించి, మాతృత్వం గురించి జీవితంలో ఒకసారైనా రాయని రచయితలు, కవులు లేరు, మాట్లాడని వారూ లేరు. అమ్మతనం అనే మధురమైన భావన వెనుక ఎన్నో కోణాలుంటాయి. ఎంత తల్లైనా ఆమెకూ కొన్ని పరిమితులు, ఆలోచనలు ఉంటాయి. అలాగే ఆమె పిల్లల పట్ల కోపంగానో, మరో విధంగానో ప్రవర్తిస్తే 'ఆమె అసలు తల్లేనా?' అంటూ రకరకాలుగా మాట్లాడేవాళ్ళూ ఉంటారు. అమ్మ కావడం ఆడదాని జీవితంలో ఒక భాగమై పోతుంది. పెళ్ళైన స్త్రీ అమ్మ కాలేకపోతే సమాజం బతకనివ్వదు, గొడ్రాలంటూ దుయ్యపడుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చర్చించవచ్చు. తల్లులకూ భావోద్వేగాలుంటాయి. తమదైన కొన్ని ఆశలు, కోరికలు ఉంటాయి. అమ్మలకూ జీవితముంటుంది కానీ అమ్మతనం కొన్ని చట్రాల్లో బంధింపబడుతుంది. అమ్మంటే ఒక నిర్వచనం ఉంటుంది. అమ్మ ఇలాగే ఉండాలి కానీ మరోలా ఉండకూడదనే పరిమితులను సమాజం బలవంతంగా రుద్దుతుంది.

భండారు విజయ మాతృత్వం అనే సబ్జెక్ట్‌పై ఎంతో మందితో చర్చించి, 'మాతృత్వం : భిన్న వ్యక్తీకరణలు' అనే విషయంపై 53 కథలతో ఒక సంకలనం తీసుకొచ్చారు. ఆ పుస్తకానికి 'యోధ' అని నామకరణం చేసి హైదరాబాద్‌లో ఆవిష్కరణ సభ చేశారు. ఈ సంకలనంలోని ప్రతి కథా అమ్మ చుట్టూ, అమ్మతనం చుట్టూ తిరుగుతుంటాయి. రత్నసుమతి గారి 'తిరిగి రాని వసంతం' కథలో ... భర్త పెట్టే బాధలు భరించలేక అతడి నుంచి విడిపోయిన కవిత, ఇద్దరు పిల్లలను పెంచడంలో అలసిపోతుంటుంది. ఆ ఒత్తిడి వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలతో బాధపడుతుంటుంది. స్నేహితురాలి సలహాతో మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని ఉన్నా అమ్మతనం వల్ల, పిల్లల పట్ల ఉన్న ప్రేమ బాధ్యతల వల్ల ముందుకు అడుగు వేయలేకపోతుంది. చిన్న కథలో చెప్పాల్సిన విషయాన్ని చక్కగా చెప్పారు రచయిత్రి. కె.వరలక్ష్మి 'శత్రువు' కథలో ఒక తల్లి కోడలు తనను ఎంత ఇబ్బంది పెడుతున్నా, ఒక రకంగా మానసికంగా హింసిస్తున్నా కొడుకుపై ప్రేమను చంపుకోలేక అక్కడే ఉండడానికి ప్రయత్నం చేస్తుంది. కథ చివరలో 'నాకేం భయం? నేను



ఆడపిల్లల తల్లిని' అని కోడలు అనుకోవడం చదవగానే ఒళ్ళు ఝల్లుమంటుంది. ఎండపల్లి భారతి 'తలపండిన గొడ్రాలు'లో పిల్లలు పుట్టని ఒక స్త్రీని అందరూ గొడ్రాలు అంటూ ఎలా నోటికి వచ్చినట్టు మాట్లాడతారో తనదైన శైలిలో కథగా చెబుతారు. ఎవరైనా బయటకు వెడుతుంటే 'గొడ్డుది ఎదురైంది' అంటూ చులకన చేస్తారు అని కథలోని పాత్ర వాపోతుంది. గిరిజ పైడిమర్రి ... బిడ్డల పెంపకంలో తల్లి మాత్రమే కాదు; తండ్రి కూడా బాధ్యత వహించాలని 'ఫాదర్ హుడ్' కథలో చెబుతారు. పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్న స్త్రీలు సంసారం, పిల్లల బాధ్యత అనే చట్రంలో ఇరుక్కుని దానికే పరిమతమై, బయటపడాలన్నా పడలేక, తమ వంతు బాధ్యతగా ఏదైనా చెయ్యాలన్నా చెయ్యలేక కనబడని ఉక్కుకౌగిలిలో ఎలా నలిగిపోతారో చెప్పే కథ పద్మకుమారి 'పొద్దు వాలని మనుషులు'. సులోచన, ప్రమీల చిన్నప్పటి నుంచీ స్నేహితులు. ప్రమీల పోరాటబాట పట్టి ముందుకు వెడితే, సులోచన పెళ్ళి చేసుకుని ప్రమీలను అనుసరించాలన్నా అనుసరించలేని పరిస్థితిలోకి వెళ్ళిపోతుంది. చివరకు స్నేహితురాలికి ఆరోగ్యం బాగాలేదని తెలిసి తన దగ్గరకు బయలుదేరుతుంది. కథ మొత్తం చక్కగా నడిపించారు రచయిత్రి. కల్పన రెంటాల 'నో రిగ్రెట్స్' కథ ఇప్పటి సమాజంలోని యువత మనస్తత్వాలను అద్దం పడుతుంది. పిల్లలు వద్దనుకున్న శ్రీజను తల్లిదండ్రులు, అత్తమామలు వత్తిడి చేస్తారు. దానికి ఆమె చెప్పిన సమాధానం 'వీశోష్ట్రవతీష్ట్రశీశీ అం అశీ ఎఎ ఎబజూ శీట్ ఖు. భర్త కూడా ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తాడు. పెళ్ళై కొన్నాళ్ళు కాగానే వారిపై పిల్లలను కనడం గురించి ప్రశ్నల వర్షం కురవడం మొదలవుతుంది. ముందు ఇంట్లో వాళ్ళే అడగడం మొదలుపెడతారు. ఇది నిత్యం మన చుట్టూ జరిగే తంతు. ఇక నల్లూరి రుక్మిణి 'అజమాయిషీ' కథలోకి వెడితే ఆశ్చర్యమనిపిస్తుంది. అమ్మలు ఇలా కూడా ఉంటారా? అని ఆలోచించి మనకు మింగుడుపడదు. తల్లి అంటే ఇలాగే ఉండాలని మన బుర్రలలో ఎన్నో ఏళ్ళుగా ఒక విషయం నాటుకుపోయి ఉంటుంది. ఈ కథలో తల్లి పుట్టింటి సంబంధం కోసం చదువు మానిపించి మరీ పెళ్ళి చేస్తుంది. పెళ్ళైన కొన్నేళ్ళకే కూతురి భర్త చనిపోతే ఇంకా ముప్పైల వయసులో ఉన్న కూతురిపై ఆజమాయిషీ చేస్తుంది కానీ ఆమెకు మళ్ళీ పెళ్ళి చేద్దామని ఆలోచించదు సరి కదా, కనీసం కూతురి మనసులో ఏముందో తెలుసుకోవడానికి సైతం ప్రయత్నించదు.

ఇలా ఈ 53 కథల్లో మనకు తల్లులు రకరకాల రంగులలో కనబడతారు. శారీరక శ్రమ చేసే తల్లులు, మనసును జోకొట్టుకుంటూ ముందుకు సాగే తల్లులు ... ఇలా పలు రకాల అమ్మలను మనం చూస్తాం అయితే తల్లులను, మదర్ హుడ్‌ను గ్లోరిఫై చెయ్యకుండా వారి జీవితాల్లోని సమస్త వెలుగు చీకట్లను ఈ కథల ద్వారా ప్రపంచానికి తెలియజేయడానికి విజయ ఎత్తుకున్న బాధ్యతే ఈ 'యోధ'. 'యోధ'ను చదవాలనుకుంటే 88019 10908 నంబరులో సంప్రదించండి

– పద్మావతి రాంభక్త
99663 07777

కథా సంపుటాలకు ఆహ్వానం

'వెన్నెల సాహితీ పురస్కారం-2024' కోసం 2023 - 24లో ప్రచురించిన కథా సంపుటాలు నాలుగు (4) ప్రతులను ఈ కింది చిరునామాకు 31 మార్చి 2025లోపు పంపాల్సిందిగా రచయితలను కోరుతున్నాం. సిద్దిపేటలో జరిగే సాహిత్య కార్యక్రమంలో విజేతకు నగదు పురస్కారం అందజేస్తాం. చిరునామా : పి.యాదగిరి, ఇం.నెం.17-3-86/35, జ్యోతి నిలయం, వినాయక్ నగర్ రోడ్డు -2, రంగధాంపల్లి చౌరస్తా దగ్గర సిద్దిపేట - 502103. మొబైల్ : 92999 09516, 98482 61284.

– పర్కపెల్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శి, వెన్నెల సాహితీ సంగమం

రంగనాయకమ్మ స్మారక సాహిత్య పురస్కారం కోసం ...

శ్రీలేఖ సాహితి, వరంగల్లు వారు 2024 సంవత్సరానికి విశిష్టాద్వైత సాహిత్యమునకు చెన్నమనేని రంగనాయకమ్మ గారి స్మారక సాహిత్య పురస్కారం ఇవ్వడానికి నిర్ణయించింది. ఈ పురస్కారం విశిష్టాద్వైత సాహిత్య గ్రంథాలకు మాత్రమే! అనువాదాలు పరిశీలించబడవు. పద్యకావ్యాలు, వ్యాస సంపుటాలు పంపవచ్చు. పుస్తకం 2020 - 2024 సంవత్సరాల్లో ప్రచురించబడి ఉండాలి. పరిశీలన నిమిత్తం నాలుగు ప్రతులు 31 మార్చి 2025 లోగా పంపాలి. ఏప్రిల్ లో (ఉగాదికి) పురస్కారం కింద రూ.5000 నగదు, శాలువా, మెమొంటోతో సత్కరించబడుతుంది. పుస్తకాలు పంపవలసిన చిరునామా : డాక్టర్ టి. శ్రీరంగస్వామి అధ్యక్షులు, శ్రీలేఖసాహితి ఇం.నం. 27-14-53, లిటిల్ సోల్జర్స్ స్కూల్ లేన్, హసన్ పర్తి - 506371, హన్మకొండ. ఫోన్ నెం. 99498 57955.

– డా. టి.శ్రీరంగస్వామి అధ్యక్షులు, శ్రీలేఖ సాహితి

16న ముగ్గురు కవుల సప్తతి

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో 16 - 2- 2025 ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి సమావేశ మందిరంలో కందుకూరి శ్రీరాములు, డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, డాక్టర్ నాళేశ్వరం శంకరం ముగ్గురు కవుల సప్తతి సభ జరుగుతుంది. దేశపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కొండపల్లి నీహారిణి, బైస దేవదాస్, డాక్టర్ మామిడి హరికృష్ణ, దేవి ప్రసాద్ నరేష్ చారి, డాక్టర్ బెల్లంకొండ సంపత్ కుమార్, డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, కందాళై రాఘవాచార్య, డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, గుండెల్లి ఇస్తారి, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, డాక్టర్ వి శంకర్, గడ్డం సులోచన తదితరులు పాల్గొంటారు.

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా.. prajasavvadi@gmail.com

రూ.8 కోట్లతో ఏటిగట్టు పటిష్ట పనులు

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి (పశ్చిమగోదావరి జిల్లా)

జగన్ ఐదేళ్ల పాలనలో గోదావరి ఏటిగట్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, చంద్రబాబు పాలనలో అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండల పరిధిలో రూ.ఎనిమిది కోట్ల వ్యయంతో చేపట్టిన గోదావరి ఏటిగట్టు పటిష్ట పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దొడ్డిపట్లలో మంత్రి రామానాయుడు విలేకరులతో మాట్లాడారు. వరదొస్తే బూరుగుపల్లి వద్ద గోదావరి ఏటిగట్టుకు గండ్లు పడి పది, పన్నెండు మండలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని గుర్తించి 2014–19 టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.6 కోట్లు నిధులు మంజూరు చేసి గ్రోయిన్స్ నిర్మాణంతో అడ్డుకట్ట వేశామని గుర్తు చేశారు. 2019–24 వైసిపి ప్రభుత్వంలో రూపాయి పని, తట్ట మట్టి పనులకూ నోచుకోకపోవడంతో వరద వచ్చిన సమయంలో బలహీనంగా ఉన్న గట్లు వద్ద గండ్లు పడకుండా వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు, యువకులు కలిసి రాత్రింబవళ్లు కాపలా కాసి ట్రాక్టర్లపై ఇసుక, సంచులు, బాదులు వంటివి సైతం సమకూర్చుకుని కాపాడుకున్నారని గుర్తు చేశారు. నిధుల సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ చంద్రబాబు గోదావరి ఏటిగట్టు పటిష్ట పనులకు రూ.8 కోట్లు మంజూరు చేశారని మంత్రి రామానాయుడు వివరించారు. గత వైసిపి ప్రభుత్వంలో రోడ్డెక్కి పోరాటం చేస్తేగాని వరద సాయం అందేది కాదని, నేటి కూటమి ప్రభుత్వంలో వరద నీరు గడప వద్దకు వస్తుందని తెలిసిన వెంటనే సాయం అందించామని మంత్రి తెలిపారు.

మామిడికి మంచు దెబ్బ

- దట్టంగా కురుస్తున్న పొగ మంచు
- రాలిపోతున్న పూత, పిందెలు
- ఆందోళనలో రైతులు

మాడిపోతున్న మామిడి పూత

ప్రజాశక్తి - చీపురుపల్లి (విజయనగరం జిల్లా)

మామిడి, జీడికి మంచు దెబ్బ తగులుతోంది. కొద్దిరోజులుగా దట్టంగా కురుస్తున్న మంచుతో పూత మాడిపోతోంది. సాధారణంగా మామిడి పంటకు డిసెంబరు, జనవరి నెలల్లో పూత వస్తుంది. ఈ ఏడాది ఆరంభం నుంచీ తీవ్రమైన పొగ మంచు కురియడంతో పూత మసిబారి నాశనం అవుతోంది. దీంతో, ఈ ఏడాది పూర్తిగా పంట నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా మామిడి తోటలు ఉన్నాయి. వేల సంఖ్యలో రైతులు వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నియోజకవర్గంలో 22,467 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. మెరకముడిదాం మండలంలో 10,357 ఎకరాలు, చీపురుపల్లి మండలంలో 3,014 ఎకరాలు, గరివిడి మండలంలో 4,965 ఎకరాలు, గుర్ల మండలంలో 4,311 ఎకరాల మామిడి తోటలు ఉన్నట్లు రికార్డులు తెలియజేస్తున్నాయి. సాధారణంగా నవంబరు నుంచి జనవరి వరకూ మామిడి పూత వస్తుంది. ప్రస్తుతం రసాలు, పనుకులు, సువర్ణరేఖ రకాలకు సంబంధించి పూత పూసింది. మరికొన్ని రకాలు పూతకు వచ్చే దశలో ఉన్నాయి. గతేడాది డిసెంబర్‌లో వర్షాల కారణంగా కొంత పూత రాలిపోయింది. పూత రాని చెట్లు సైతం మరింత ఆలస్యం అవుతుండడంతో రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. ఇటీవల కాలంలో కురుస్తున్న మంచు ప్రభావంతో పూత మాడిపోయి నేలరాలి పోతోంది. దట్టమైన మంచు ప్రభావంతో కొన్నిచోట్ల చిన్నచిన్న మామిడి పిందెలు సైతం నేల రాలిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజాము నుంచి అధికంగా కురుస్తున్న మంచుతోపాటు పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో మామిడి పూత, పిందెల పైన తామర పురుగు ఆశిస్తోంది. దీంతోపాటు తెగులు సోకి మామిడి పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యాన శాఖాధికారుల సూచనలు

మంచు ప్రభావంతో మామిడి తోటలను తెగుళ్ల బెడద వెంటాడుతోంది. వీటి నివారణకు దయామేదాక్షమ్ 0.5 గ్రాములు, హెక్సాకోనోజోల్ 2 మిల్లీమీటర్లు కలిపి తెగులు సోకిన మామిడి పూత పై పిచికారీ చేయాలని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. మామిడి పిందెలను నాశనం చేసే చల్లని పచ్చని పురుగు మామిడి తోటలపై అధికంగా సోకే ప్రమాదం ఉంది. వాటి నివారణకు దయా మేదాక్షమ్, హెక్సాకోనోజోల్‌తోపాటు ఇమామాక్సిన్, బెంజోయేట్ 0.5 మిల్లీమీటర్లు.. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మామిడి పిందెలు పూర్తిస్థాయిలో నిలబడటానికి ఫినోఫిక్స్ 44 గ్రాములు, బోరోన్ 88 గ్రాములు పొడరు 200 లీటర్ల నీటిలో కలిపి మామిడి తోటలపై పిచికారీ చేయాలని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. మంచు ప్రభావం నుంచి మామిడి తోటలను రక్షించుకునేందుకు రైతులు సమీప ఉద్యాన శాఖ అధికారులు సంప్రదించాలని సూచిస్తున్నారు.

'ప్రజ్ఞా వికాసం' విజయవంతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్ష విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం మోడల్ టెస్ట్ నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ప్రశ్నపత్రాలను వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్, జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న పబ్లిక్ పరీక్ష కోసం విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. రామ్మోహన్ మాట్లాడుతూ మొదటిసారి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇది ఒక మోడల్ ఎగ్జామ్‌గా ఉంటుందని, విద్యార్థుల్లో ఉండే భయాన్ని పోగొడుతుందని తెలిపారు. సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రజ్ఞా వికాస పరీక్షలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి రూ.5 వేలు, 3 వేలు, 2 వేలు చొప్పున నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాము, సహాయ కార్యదర్శి రవి, జిల్లా నాయకులు రాజు, సూరిబాబు, సమీరా, జయ, ఎర్రమ్మ పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజ్ఞా వికాసం ప్రశ్నాపత్రాలను పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు, జిల్లా సహాయ కార్యదర్శి కె.మణికుమార్, బొబ్బిలి మండల కార్యదర్శి కేశవ, మండల సహాయ కార్యదర్శి జానీ, మండల నాయకులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్ష పేపర్‌ను యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి. వెంకటరావు ఆవిష్కరించారు. ఈ ప్రజ్ఞ వికాస పరీక్షలలో అన్ని పాఠశాలలకు చెందిన 290 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఏ.అను, మండల గర్ల్స్ కో కన్వీనర్ రత్న, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె రమేష్, మండల కమిటీ సభ్యులు వి.చరణ్, రవి, శీల, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పేరుతో మోడల్ టెస్ట్ నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ప్రశ్నాపత్రాలను జిల్లా ఉపాధ్యక్షులు పి.రమేష్, జిల్లా కమిటీ కోగర్ల్ కన్వీనర్ బి.రూప చేతుల మీదుగా ఆవిష్కరించారు.

సంరక్షకుడే..భక్షకుడు...

- రూ.3 లక్షల సొమ్ము స్వాహా
- న్యాయం చేయాలంటున్న అనాథ పిల్లల వేడుకోలు

ప్రజాశక్తి - కరప (కాకినాడ జిల్లా)

అనాథ పిల్లలకు సంరక్షుడిగా ఉన్న వ్యక్తే నేడు భక్షకుడిగా మారాడు. బ్యాంకు ఖాతాల్లో వారి పేరుపై ఉన్న సొమ్మును స్వాహా చేసి వారికి తీరని అన్యాయం చేశాడు. విషయం తెలిసిన అనాథ పిల్లలు తమకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

కాకినాడ జిల్లా కరవ మండలంలోని గొడ్డటిపాలెం గ్రామానికి చెందిన తోట నాగేశ్వరరావు, తల్లి లోవలక్ష్మి దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు. వీరిలో ఒకరు చక్రమ్మ కాగా, మరో అమ్మాయి లక్ష్మి ఉన్నారు. అయితే 2015లో తోట నాగేశ్వరరావు అనారోగ్యం తో మృతి చెందాడు. ఇంటి యజమాని మృతి చెందడంతో అప్పటికే రక్తహీనతతో బాధపడుతున్న లోవలక్ష్మి ఆ ఇద్దరు పిల్లలతో పాటు, వయోభారంతో ఉన్న లోవలక్ష్మి మేనమామ నర్సింహ మూర్తితో కలిసి అదే గ్రామంలోని అనాథ ఆశ్రమంలో జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 2017లో లోవలక్ష్మి అనారో గ్యంతో మృతి చెందారు. దీంతో ఇద్దరు పిల్లలు మేనమామతో కలిసి ఆశ్రమంలోనే ఉండేవారు. చిన్నతనంలోనే తల్లి చనిపోవడంతో చంద్రన్న బీమా పథకంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.95 లక్షలను వారికి విడుదల చేసింది. ఈ సొమ్ము విడుదల కావాలంటే బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి అయింది. ఈ సమాచారం తెలుసుకున్న గొడ్డటిపాలెంకు చెందిన రాజకీయ పార్టీ నాయకుడు వీరంరెడ్డి ముత్యాలరావు వయోభారంతో ఉన్న నర్సింహమూర్తిని సంప్రదించాడు. పిల్లల పేరు మీద బ్యాంకులో వేయాలని ఆ వృద్ధుడిని నమ్మించాడు. అదేతో మీరే చేయండి ఆ వృద్ధుడు చెప్పడంతో అతను చక్రమ్మ పేరు మీద కరప మండలం అరట్లకట్ల గ్రామంలోని కార్పొరేషన్ బ్యాంకులో పిల్లల సంరక్షకుడిగా ఖాతాను తెరిపించారు. చంద్రన్న బీమా సొమ్మును చక్రమ్మ ఖాతాలో జమ చేశారు. బాలికల సంరక్షకుడుగా బ్యాంకు ఖాతాలో తన పేరు నమోదు చేయించుకున్న ముత్యాలరావు బ్యాంకు అకౌంట్ పుస్తకాన్ని, చెక్ బుక్ తన వద్దే పెట్టుకున్నాడు. కోవిడ్ సమయంలో బాలికల మేనమామ నర్సింహమూర్తి మృతి చెందాడు. దీంతో ఆ బాలికలు ఇద్దరు పూర్తిగా అనాథలు య్యారు. ఆ ఇద్దరు అనాథల బాగోగులను తానే చూసుకుంటున్నట్లు గ్రామంలో చెప్పు కుంటూ తిరిగాడు. పిల్లల భవిష్యత్తు కోసం మేనమామ నర్సింహమూర్తి ఒక వ్యక్తి వద్ద దాచిన రూ.50 వేలను సైతం ముత్యాలరావు చేజిక్కించుకున్నాడు. అనంతరం దఫదఫాలుగా చక్రమ్మ స్కూల్లో ఉన్న సమయంలో చెక్కుల మీద సంతకాలు పెట్టించుకుని ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న సొమ్మును దోచు కున్నాడు. గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకంలో వచ్చి న సొమ్మును ముత్యాలరావు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖా తాలో జమ చేయించుకున్నాడని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. తన చెల్లెలు పుట్టినరోజుకు కేక్ కొనడానికని ముత్యాల రావు ఇంటికి వెళ్ళి రూ.500 అడిగితే డబ్బు ఇవ్వకపోగా అతను అతని కుటుంబ సభ్యులు దుర్భాషలాడి పంపించారని మీడియా ముందు చక్రమ్మ కన్నీళ్లు పెట్టుకుంది. బ్యాంకుకు వెళ్లి డబ్బులు తీసకుందామనుకుంటే బ్యాంకు ఖాతాలో డబ్బులు లేవని అధికారులు చెప్పారని, ఆఖరికి గొడ్డటిపాలెంలో చిన్న ఇంటిని కూడా ముత్యాలరావు ఎవరికో అద్దెకు ఇచ్చి ఆ డబ్బులు కూడా తమకు ఇవ్వడం లేదని ఆ బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. సంరక్షుకుడిగా ఉంటూ అనాధ బాలికలకు తీరని అన్యాయం చేసిన ముత్యాలరావుపై స్థానిక ఎంఎల్ఎ పంతం నానాజీ, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

రోడ్డు లేక అవస్థలు

- కాలినడకన రోగులను డోలీలో తరలించేందుకు వెతలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపట్టు మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీకి చివరి గ్రామమైన దొరగూడ పివిటిసి గ్రామానికి రహదారి సౌకర్యం లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. లక్ష్మీపురం పంచాయతీ సిపిఎం సర్పంచి కొర్ర త్రినాథ్ ఆదివారం దొరగూడ గ్రామంలో సందర్శించి పలు విషయాలను ప్రజాశక్తి దృష్టికి తీసుకొచ్చారు. ఈ గ్రామంలో పీవీటిజి తెగకు చెందిన (డిడోయ్) సామాజిక వర్గం ఆదివాసులు 22 కుటుంబాలతో సుమారు 110 మంది నివాసం ఉంటున్నారు. వారికి అత్యవసర వైద్య సేవలు అందాలన్నా, అనారోగ్యాలకు గురై ఆసుపత్రికి తరలించాలన్నా, గర్భిణీలకు డోలీలు శరణ్యమవుతున్నాయి. ఈ గ్రామంలో రోడ్డు, విద్యుత్, అంగన్వాడీ కేంద్రం, పాఠశాల భవనాలు వంటి ఏ విధమైన సౌకర్యాలు లేవు. అనారోగ్య సమస్య వచ్చిన కాలినడకన డోలీ మోతతో సుమారు 8 కిలో మీటర్లు దూరం ప్రయాణించి, రెండు వాగులు దాటి ప్రయాణించాలి. 2023 సెప్టెంబర్‌లో గ్రామంలో ఆంత్రాక్స్ వ్యాధి కలకలం రేపింది. ఈ గ్రామంలోని నివాసంలో ఉంటున్న వారందరికీ చర్మ వ్యాధి సోకి ముగ్గురు మృతి చెందారు. ఈ సమస్యలపై గతంలో అనేక దఫాలుగా జిల్లా అధికారులు, గ్రీవెన్స్, స్పందన కార్యక్రమంలో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. మంగళగిరిలో ప్రభుత్వం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పిర్యాదు మేరకు అక్కడ నుండే మంత్రి కలెక్టర్ కు ఫోన్లో రోడ్డు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని సిపిఎం సర్పంచి కొర్ర త్రినాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దొరగూడ పివిటిసి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీచ్ రోడ్డులో ఆక్రమణలపై కొనసాగిన సర్వే

- 12లోగా కలెక్టర్‌కు నివేదిక

ప్రజాశక్తి - భీమునిపట్నం (విశాఖ)

సిఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా స్థానిక బీచ్ రోడ్డులో ఆక్రమణలు జరిగాయని, సంబంధిత వివరాలను న్యాయస్థానానికి తెలియజేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు జివిఎంసి, కాలుష్య నియంత్రణ మండలి, సిఆర్‌జెడ్ అధికారులు రెండో రోజైన ఆదివారమూ పలు ప్రాంతాల్లో సర్వే జరిపారు. పరిశీలన పూర్తయ్యాక సంబంధిత నివేదికను బుధవారం నాటికి హైకోర్టుకు వారు సమర్పించాల్సి ఉంది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు గతంలో వైసిపి మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి అక్రమించినట్టుగా చెప్పబడుతున్న స్థలంలో ఇప్పటికే ప్రహరీని జివిఎంసి అధికారులు పాక్షికంగా కూల్చివేశారు. అదే ప్రాంతంతో పాటు తీరం వెంబడి వెలసిన ఎస్ఒఎస్ కూడలి వద్ద శ్మశాన వాటికకు ఆనుకుని నిర్మించిన ఓ రెస్టారెంట్, కొబ్బరి తోట పార్కు, పక్కనే ఉన్న తీరం రిసార్ట్, పలు రెస్టోబార్ ప్రాంతాల్లో బృందం సర్వే చేపట్టింది. సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి జరిపిన ఆక్రమణలపై తుది నివేదికను ఈ నెల 12లోగా కలెక్టర్‌కు ఇవ్వనున్నట్టు అధికారులు చెబుతున్నారు. జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి కె.హరిదాసు, మండల తహశీల్దార్ పైలా రామారావు, జివిఎంసి ఒకటో జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణ తదితరులు తాజా సర్వేలో పాల్గొన్నారు.

సినిమాకు కొత్త సొబగు మాండలికం

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని తెలుగు సినిమా పరిశ్రమలో ఆయా ప్రాంతాల్లోని మాండలిక యాసల ప్రయోగంతో కొందరు హిట్‌లు కొట్టేస్తున్నారు. ఆంధ్రా,రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణ యాసలను ఉపయోగించి తీసిన పలు సినిమాలు బ్లాక్ బస్టర్లుగా నిలిచాయి. ఇదే కోవలో కొత్త సినిమాల్లో మాండలికాల ప్రయోగం బాగా జరుగుతోంది. తాజాగా విడుదలైన 'తండేల్' సినిమాను చూస్తే తెలుస్తుంది. 'రాజూ మన గురించి ఊళ్లోవాళ్లు ఏటేటో మాట్లాడుకుంతున్నారు రా. మన గురిండి మాట్లాతంద్రంతే...మనం ఫేమస్ అయిపోనట్టేనే'...'అందర్లెలాగూ మాట్లాకుంతుర్రుగా...అది నిజం చేసేస్తే ఎలాగుంతదాని'..'ఈ శివరాత్రి పండుగ నుంచి రాజుగాడే మన తండేల్' అంటూ హీరోహీరోయిన్ల మధ్య సాగే డైలాగులు ఆత్యందం ఆకట్టు కుంటాయి. స్థానికత.. మాండలికాల ప్రయోగంతో ఈ సినిమా అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా కోసం నాగచైతన్య ఆరేడు నెలలు బాగా కష్టపడ్డాడు కూడా. శ్రీకాకుళం జిల్లాలోని పలు మత్స్యకార గ్రామాల్లో పర్యటించి అక్కడి ప్రజల జీవన స్థితిగతులు, మాండలికాల యాసలను పరిశీలిం చారు. మరీ ప్రత్యేకంగా కె.మత్స్యలేశం గ్రామంపై బాగా కేంద్రీకరించారు. అక్కడి ప్రజల జీవనం, ఆహార, వ్యవహారాలను బాగా దగ్గర నుంచి చూసి అర్థం చేసుకున్నారు. ఈ సినిమా కోసం నాగచైతన్య తన శరీరాకృతిని కూడా మార్చు కున్నారు. ఇందులో బెస్తవాడి పాత్రలో పూర్తిగా లీనమైపోవటం సినిమాలో చూడొచ్చు. బాడీ లాంగ్వేజ్ కూడా బాగా సెట్ అయ్యింది. అలా మారటానికి కొన్ని నెలలపాటు శ్రమించాల్సి వచ్చిందని పలువేదికలపైన నాగచైతన్య తెలిపారు. శ్రీకాకుళం యాస నేర్చుకోవటానికి చిత్ర యూనిట్‌కు కొన్ని వర్కుషాపులు సైతం ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు దర్శకుడు చందు మొండేటి. బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డిక్షన్ పెక్యులర్ డిజైన్ కూడా బాగా వర్కవుట్ అయ్యింది. మొత్తంగా చూస్తే ఈ సినిమాలో నాగచైతన్య రూపం సరికొత్తగా అనిపించింది. బన్నీ వాసు, అరవింద్ ప్రతిష్టాత్మంగా ఈ ప్రాజెక్టు చేపట్టారు. 'లవ్‌స్టోరీ' సినిమా తర్వాత నాగచైతన్య, సాయిపల్లవి నటించిన చిత్రం కావటం మరో ప్రత్యేకత.

స్థానికత ఉంటే హిట్టే..

'చెప్పే కథ ఎంత స్థానికంగా ఉంటే.. దానికంత ప్రపంచ ఆదరణ' అంటూ 'కాంతారా' దర్శకుడు రిషబ్ చెప్పిన విషయం అక్షర సత్యంగానే అనిపిస్తోంది. ఇటీవల కాలంలో మట్టిపరిమళాలు పులుముకొని వెండితెరపై గుభాళించిన పలు చిత్రాలు విజయాన్ని సాధించాయి. అందుకోసమే నవతరం దర్శకులు, కథానాయకులు ఈ పంథాలో ముందుకు సాగుతున్నారు. ఆయా ప్రాంతాల తాలూకూ యాసలు, జానపదులు వినిపించడమూ పరిపాటిగా మారింది. దీనికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో ఇప్పుడీ తరహా ప్రయోగాలు చేసేందుకు అగ్ర కథానాయకులు ఆసక్తి చూపిస్తున్నారు.

ట్రెండ్ మారింది

తెలుగు ఒక్కో ప్రాంతంలో ఒక్కో యాసతో సొగసు వినిపించినా.. సినిమాలకు వచ్చే సరికి ప్రామాణిక భాషే తరచుగా వినిపించేది. గతంలో హాస్య పాత్రలకో లేదంటే ప్రతి నాయక పాత్రలకో పరిమితం చేసేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. యాసలు కథానాయకుల గళంలో సరికొత్తగా హీరోయిజం ఒలికిస్తున్నాయి. మట్టి కథలకు మరింత సహజత్వాన్ని అద్ది ప్రేక్షకులకు కొత్త అనుభూతులను పంచిస్తున్నాయి. 'తొంగి తొంగి.. నక్కి నక్కి గాదే... తొక్కుకుంటూ పోవాలే..ఎదురొచ్చినోడ్ని ఏసుకుంటూ పోవాలే' అంటూ ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో కొమరం భీమ్‌గా తెలంగాణా యాసతో ఎన్టీఆర్ హీరోయిజాన్ని పంచారు. 'వాల్తేరు వీరయ్య'లో కథానాయకుడు చిరంజీవి కూడా శ్రీకాకుళం యాసలో దుమ్ముదులిపేశారు. రవితేజ తెలంగాణా యాసలో సినీ ప్రియులను మురిపించారు. బాలకృష్ణ సినిమాల్లో రాయలసీమ, తెలంగాణా యాసలు బాగా కన్పిస్తున్నాయి. 'దసరా' సినిమాలోనూ నాని, కీర్తిసురేష్ తెలంగాణా యాసలో మాట్లాడారు.

'పుష్ప' అంటే ఫ్లవరనుకుంటివా..ఫైరు' అని చిత్తూరు యాసలో అలరించారు కథానాయకుడు అల్లు అర్జున్. 'రంగస్థలం'లోనూ గోదావరి యాసను కథానాయకుడు రామ్‌చరణ్ మాండలిక సంభాషణలు వినిపించారు. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరిలోనూ విశ్వక్‌సేన్ గోదావరి యాసలో అలరించారు. డీజే టిల్లు, టిల్లులో కూడా మల్కాజ్‌గిరీ కుర్రాడిగా తెలంగాణా యాసలో సిద్ధు జొన్నలగడ్డ అదరగొట్టారు.

'ఫిదా'లో 'సారంగ దరియా' నుంచి 'ధమాకా'లోని 'పల్సర్‌బైకు', 'దసరా'లో 'చమ్కీల అంగీలేసి' వరకూ, తండేల్‌లో 'హైలెస్సా..హైలెస్సా' వరకు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన జానపదాలు చాలా ఉన్నాయి. అల వైకుంఠపురం సినిమాలో 'సిత్తరా సిరపడు... సిత్తరాల సిరపడు...పట్టుబట్టినాడ ఒగ్గనే ఒగ్గడు' అంటూ జానపద కళాకారుడు బాడ సూరన్న పాట బాగానే ఆకట్టుకుంది. 'బలగం'లోని కథ కూడా నిజజీవితంలో జరిగే అంశాలనే ప్రస్తావించటంతో బాగా ఆకట్టుకుంది.

ఇవేకాకుండా జాతిరత్నాలు, విరాటపర్వం, రుద్రంగి, తుపాకులగూడెం, భరతనాట్యం, మీకు మాత్రమే చెప్పా, శరపంజరం, తురుమ్‌ఖాన్లు, షరతులు వర్తిస్తాయి, సర్కార్‌నౌకరి తదితర సినిమాలు కూడా మండలికానికి ప్రధాన్యమిస్తూ వచ్చాయి. సీనియళ్లలోనూ మాండలిక యాసలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. 'ఏం పిల్లడో ఎల్దమొస్తవా... సికాకుళంలో చీమలన్నయట.. ఏం పిల్లడో వెల్దమొస్తవా' అంటూ తన గీతాలతో ఉరకలెత్తించిన గాయకుడు వంగపండు ప్రసాద్. అభ్యుదయ కళాకారులైన టి.కృష్ణ, ఆర్.నారాయణమూర్తిలతోపాటు ఎంతోమంది తమ సినిమాలకు పాటలు రాయించుకున్నారు. స్థానిక యాసలో హీరో, హీరోయిన్లు మాట్లాడినప్పుడు ప్రేక్షకులు కథను చాలా దగ్గరగా తీసుకుంటున్నారని, తమకు తెలిసిన జీవితంగా భావిస్తున్నారని సినీ పండితుల విశ్లేషణ.

TATA

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదు కార్యాలయం చిరునామా : 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గనపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి-400013.
శాఖ చిరునామా : డో.నం: 54-15-4సి/1, 5వ అంతస్తు, అర్‌కె గల్లెరియా, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీసు రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ భవనం, విజయవాడ-520008

స్థిరాస్తి యొక్క విక్రయం కొరకు నోటీసు

(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువుతూ రూల్ 8(6) క్రింద)

సెక్యురిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) మరియు రూల్ 9(1) తో చదువుతూ సెక్యురిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యురిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు 15 రోజుల ఇ-వేలం నోటీసు

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్ఎల్)కి తనఖాగా ఉంచబడిన స్థిరాస్తిని క్రింద వివరించిన స్థిరాస్తిని గురించి సాధారణ ప్రజలుకు మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత లేదా వారి చట్టపరమైన వారుసులు/ప్రతినిధులు (రుణగ్రహీతలు)లకు దీని ద్వారా నోటీసు ఇవ్వడింది. టిసిహెచ్‌ఎఫ్ఎల్ యొక్క ఆధీకృత అధికారి తీసుకున్న స్వాధీనం **27-02-2025న** దిగువ పేర్కొన్న రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతలు బకాయిలను రికవరీ చేయడానికి **"ఎక్కడ ఉందో అలాగే ఉంది" మరియు "ఉన్నట్లే" మరియు "ఏదైనా ఉంది"** ఆధారంగా. రిజర్వ్ ధర మరియు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ దిగువన పేర్కొనబడ్డాయి. ఏదైనా వాయిదా/విక్రయాలు నిలిపివేయబడినప్పుడు, పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్/ఆస్తి దీని ద్వారా విక్రయించబడుతుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. **ఇ -వేలం 27-02-2025న మ. 2 గం.లకు. ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి యొక్క డిమాండ్ డ్రాఫ్ట్‌ను కలిగి ఉన్న సీల్డ్ ఎన్వలప్‌ను టిసిహెచ్‌ఎఫ్ఎల్ ఆధీకృత అధికారికి** బ్రాంచ్ అడ్రసు: **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్**, డోర్ నెం. 54.15.4సి/1, 5వ అంతస్తు, ఆర్.కె. గల్లెరియా శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్డు, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008 వద్ద **25-02-2025, సా. 5 గం.ల లోపు** సమర్పించాలి. క్రింద వివరించిన క్లుప్త వివరాల ప్రకారం సురక్షి ఆస్తి/ స్థిరాస్తి విక్రయం "పరిస్థితి ఉన్న చోటనే" ఉంటుంది.

క్ర సం.	లోన్ అకౌంట్ నెం.	రుణగ్రహీత(లు) / సహ-రుణగ్రహీత(లు) చట్టపరమైన వారసులు / న్యాయ ప్రతినిధి /తనఖాదారు(లు) పేరు	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం	రిజర్వ్ మొత్తం	బయానా మొత్తం	స్వాధీనతా విధానం	30-01-2025 నాటికి బకాయి
2.	TCHHL08030 00100201969 & TCHIN080300 0100204138 & TCHHF08030 00100218660 & TCHIN080300 0100219983	శ్రీ మహమ్మద్ అహ్‌కలాక్, శ్రీమతి మహమ్మద్ సకీనా బేగం	ఒప్పందం నం. TCHHF0803000100218660 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన బకాయి రూ. 13,14,622/- మరియు ఒప్పందం నం. TCHHL0803000100201969 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన బకాయి రూ. 25,21,740/- ఒప్పందం నం. TCHIN0803000100204138 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన బకాయి రూ. 1,24,816/- మరియు ఒప్పందం నం. TCHIN0803000100219983 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన బకాయి రూ. 89,334/- మొత్తం రూ. 40,50,512/- మరియు 16-03-2024	రూ. 47,40,000/- (నలభై ఏడు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)	రూ. 4,74,000/- (నాలుగు లక్షల డెభై నాలుగు వేల రూపాయలు మాత్రమే)	భౌతికం	ఒప్పందం నం. TCHHF0803000100218660 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన బకాయి రూ. 1492076/- ఒప్పందం నం. TCHHL0803000100201969 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన బకాయి రూ. 2852484/- మరియు ఒప్పందం నం. TCHIN0803000100204138 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన బకాయి రూ. 148328/- మరియు ఒప్పందం నం. TCHIN0803000100219983 క్రింద మీ ద్వారా చెల్లించవలసిన బకాయి రూ. 108009/- మొత్తం రూ. 4600897/-

స్థిరాస్తి వివరణ : కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ ఎస్ఆర్ఓ పరిధి మరియు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వించిపేటలో రెవెన్యూ వార్డు నం.8, బ్లాక్ నం.11, ఎన్.టి.ఎస్.నం.405, మున్సిపల్ వార్డు నం.13ఎ, మూల్యాంకనం నం.69649, కొత్త మూల్యాంకనం నం.1073028032, కొత్త వార్డు నం.40 వద్ద ఉన్న ఆర్‌సిసి రూఫ్డ్ భవనం మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.23-11/1 కలిగి ఉన్న గ్రౌండ్ మరియు ఒకటవ అంతస్తుల నిర్మాణ పరిధి 39.0 చ.గ.లు. లేదా 32.60 చ.మీ.లు. **హద్దులు : తూర్పు :** ఈ ఆస్తి మరియు పి/ఓ సుబ్రమణ్యం మధ్య ఉమ్మడి గోడ, **పడమర :** ష్రీక్ రేష్మా ఆస్తి, **ఉత్తరం :** మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** రహీనా ఖాన్ ఆస్తి.

వేలంలో, ప్రజలు తమ బిడ్(ల)ని వ్యక్తిగతంగా సమర్పించడానికి సాధారణంగా ఆహ్వానించబడతారు. ఏ అధికారి లేదా ఇతర వ్యక్తి, ఈ విక్రయానికి సంబంధించి ఏదైనా విధిని నిర్వర్తించకూడదు, అయితే, విక్రయించబడిన స్థిరాస్తిపై ఏదైనా ఆసక్తిని పొందేందుకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వేలం వేయకూడదు, సంపాదించకూడదు లేదా సంపాదించడానికి ప్రయత్నించకూడదు. సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో సూచించిన షరతులకు లోబడి ఉండవలెను మరియు తదుపరి షరతులు అనుసరించవలెను :

గమనిక : ఇ-వేలం 27-02-2025న మ. 2.00 గం.ల నుండి 3.00గం.ల మధ్యన ప్రతి 5 నిమిషాల పొడగింపుతో పోర్టల్ https://sarfaesi.auctiontiger.net ద్వారా జరుగుతుంది.

నియమాలు మరియు నిబంధనలు :

1) దిగువ షెడ్యూల్‌లో ప్రత్యేకంగా పేర్కొన్నట్లుగా క్రింది సంతకందారునికి ఉన్నంత సమాచారం మేరకు సరైనవి, కాని క్రింది సంతకందారుడు ఈ ప్రొక్లేమేషన్‌లో ఏదేని పొరపాటు, మిస్‌స్టేట్‌మెంట్ లేదా లోపానికి సమాధానం ఇవ్వరు. మొత్తం బిడ్ లేదా బిడ్డరుదారుకు ఏదేని వివాదాలు తలెత్తితే, ఆ లాట్ మళ్లీ ఒకసారి వేలం కొరకు ఉంచబడును. **2)** ఆస్తిని రిజర్వు ధర కంటే తక్కువ ధరకు విక్రయించబడదు. **3) బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/- (పది వేల రూపాయాలు). 4)** ఆస్తి కొనుగోలు కోసం సమర్పించిన అన్ని బిడ్‌లు పైన పేర్కొన్న విధంగా ఎర్నెస్ట్ మనీతో పాటు "టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్" కి అనుకూలంగా ఉండే డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా అందించబడతాయి. చెల్లించవలసిన శాఖ చిరునామా: ఎన్ఈఎఫ్‌టి/ ఆర్‌టిజిఎస్/ ఐఎమ్‌పిఎస్ ద్వారా ఇఎమ్‌డి కోసం, దయచేసి ఆధీకృత అధికారిని సంప్రదించండి. వేలం సఫలీకృతంకాని బిడ్డరుదారులకు డిమాండ్ డ్రాఫ్టులు తిరిగిఇవ్వబడును. **5)** అధికృతగల బిడ్డరుదారు బిడ్‌కు చట్టపరంగా అర్హతపొందినగా అన్నివిధాలా కల్పించిన ఏదేని లాట్ కొనుగోలుదారుగా ప్రకటించబడతారు మరియు తదుపరిగా అతని ద్వారా బిడ్ మొత్తం రిజర్వు ధర కంటే తక్కువగా ఉండరాదు. ఆఫర్‌చేసిన ధర సరిగాలేనట్లుగా స్పష్టంగా కనిపిస్తే అత్యధిక బిడ్ యొక్క క్షీణత అనుమతించుట ఆధీకృత అధికారి యొక్క విచక్షణ మేరకు ఉంటుంది. 6) రికార్డు అయిన కారణాల కొరకు అమ్మకమును వాయిదా వేయుట/నిలుపివేయుట అనునది 'ఆధీకృత అధికారి' యొక్క విచక్షణ మేరకు ఉంటుంది. **7)** ఆస్తి యొక్క తనిఖీ **18-02-2025న ఉ.11 గం.ల నుండి సా.5.00 గం.ల మధ్యలో** ముందస్తు నియామకంతో చేపట్టవచ్చును. **8)** కొనుగోలుదారుగా ప్రకటించబడు వ్యక్తి, సదరు డిక్లేరేషన్ తరువాత వెంటనే, కొనుగోలుచేసిన మొత్తం/బిడ్‌లో ఇరవై ఐదు శాతంను 24 గం.లలోపు **'ఆధీకృత అధికారి'**కి డిపాజిట్ చేయవలెను మరియు సదరు డిపాజిట్ విషయంలో విఫలమైన యెడల, ఆస్తి వెంటనే ప్రైవేట్ ట్రీటి ద్వారా తాజా వేలం/అమ్మకానికి ఉంచబడుతుంది. **9)** పై విధంగా చేసిన ప్రారంభ డిపాజిట్ విషయంలో, కొనుగోలు యొక్క మిగిలిన మొత్తంను ఆస్తి అమ్మకం నిర్ధారణ తేది నుండి 15వ రోజున లేదా ఆలోగా ఆధీకృత అధికారి కొనుగోలుదారు చెల్లించవలెను, లేదా ఒకవేళ 15వ రోజు ఆదివారం లేదా ఇతర సెలవు రోజువస్తే, 15వ రోజు తరువాత మొదటి రోజున చెల్లించవలెను. **10)** పైన పేర్కొన్న సమయంలో ఏదైన విఫలం చెందితే, ప్రైవేట్ ట్రీటి ద్వారా ఆస్థిని తాజాగా వేలం/విక్రయం జరుపబడును. డిపాజిట్ టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా ఇఎండి సహా వదులుకోవాల్సి ఉంటుంది మరియు విఫలమైన కొనుగోలుదారుడు ఆస్థి దావాలు కోల్పోవలసి ఉంటుంది. **11)** పై పట్టిక ప్రకారం ఆస్తికి సంబంధించిన **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి తెలిసినంత వరకు ఏదేని రుణాభారాలు వివరాలు లేవు. ఆస్తి పన్ను, విద్యుత్ మొదలైన చట్టబద్ధమైన బాధ్యతల ప్రాంతాలతో సహా ఆస్తిపై భారాలకు సంబంధించి వారి స్వంత స్వతంత్ర విచారణలు చేయాలని ఉద్దేశించిన బిడ్డర్ సూచించబడ్డారు. **12) ఏదైనా ఇతర వివరాల కోసం లేదా ఇ-వేలం పై ఆన్ లైన్ శిక్షణ కోసం కాబోయే బిడ్డర్లు సర్వీస్ ప్రొవైడర్ మెసెర్స్.ఇ-ప్రొక్యూర్మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్‌టైగర్), చిరునామా : బి-705, వాల్ స్ట్రీట్ 2, ఓరియంట్ క్లబ్ ఎదురు, గుజరాత్ కాలేజీ వద్ద, ఎల్లీస్ బ్రిడ్జ్, అహ్మదాబాద్-380 006, గుజరాత్ (ఇండియా). మొబైల్ : 8000023297 / 9173528727 మరియు 9265562818/ 9265562821/079-6813 6842/6869 ఇ మెయిల్ : support@auctiontiger.net & ramprasad@auctiontiger.net లేదా మనిష్ బన్సాల్, ఇ మెయిల్ ఐడి: Manish.bansal@tatacapital.com ని సంప్రదించవచ్చు.** ఆధీకృత అధికారి ఫోన్ నెం. 8588983696, దయచేసి మీ ప్రశ్నను వాట్సప్ నెం. 9999078669 లో పంపండి. **13)** 1% టిడిఎస్ వర్తింబడును మరియు గరిష్టంగా ప్రకటించిన బిడ్ మొత్తం మీద అత్యధిక బిడ్డర్ ద్వారా చెల్లించబడుతుంది. యజమాని/రుణగ్రహీత(లు) యొక్క పాన్‌లో అత్యధిక బిడ్డర్ ద్వారా పేమెంట్ చెల్లించాల్సిన అవసరం ఉంటుంది మరియు ఒక చలాన్ కాపీ మా కంపెనీకి దాఖలు చేయాల్సి ఉంటుంది. **14) పై వివరాలకు సెక్యూర్డ్ క్రెడిటార్'స్ వెబ్‌సైట్ https://surl.li/tkmzqv లో పొందుపరిచిన క్రింది లింక్‌ను చూడవచ్చు. 15)** దయచేసి **https://www.tatacapital.com/property-disposal.html** లింక్‌ని కూడా సందర్శించండి.

దయచేసి గమనించండి - టిసిహెచ్‌ఎఫ్ఎల్ ఈ ఆస్తి అమ్మకం/ వేలం కోసం పేర్కొన్న వేలం భాగస్వామితో పాటు ఏ బ్రోకర్/ఏజెంట్‌ను నిమగ్నం చేయలేదు. ఆసక్తి ఉన్న పార్టీలు ఈ విషయంలో అన్ని సందేహాలు మరియు విచారణల కోసం దిగువ సంతకం చేసిన ఆధీకృత అధికారిని మాత్రమే సంప్రదించాలి.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేది : 10.02.2025

సం/- ఆధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆప్ ఫిర్యాదులు బుట్టదాఖలు

- జాబితాల్లో అవకతవకలపై నోరెత్తని ఎన్నికల కమిషన్
- ఢిల్లీలో అనూహ్యంగా పెరిగిన ఓటర్లు
- నాలుగేళ్లలో నాలుగు లక్షలు
- ఏడు నెలల్లోనే మరో నాలుగు లక్షలు

న్యూఢిల్లీ : ఢిల్లీ శాసనసభ ఎన్నికలు ముగిశాయి. ఆప్ ఓటమి పాలైంది. ఓటర్ల జాబితాల రూపకల్పనలో అనేక అవకతవకలు జరిగాయని ఆప్ ఎప్పటి నుండో ఆరోపిస్తోంది. 2020 శాసనసభ ఎన్నికలు - గత సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికల మధ్య కాలంలో... అంటే నాలుగు సంవత్సరాల వ్యవధిలో ఢిల్లీలో 4,16,648 మంది కొత్తగా ఓటర్లుగా నమోదయ్యారు. లోక్‌సభ ఎన్నికలకు, శాసనసభ ఎన్నికలకు మధ్య.... అంటే కేవలం ఏడు నెలల వ్యవధిలో 3,99,362 మంది ఓటర్లుగా చేరారు. చేరారు అనడం కంటే చేర్చారు అనడమే సబబుగా ఉంటుంది. ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులపై ఎన్నికల కమిషన్ చేసిన కసరత్తుపై ఆప్ తన ప్రచారంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బిజెపి అభ్యర్థులకు అనుకూలంగా ఓటరు జాబితాలను తారుమారు చేశారని ఆరోపిస్తూ ఎన్నికల కమిషన్‌కు పలు లేఖలు రాసింది. దీనిపై కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

2020 శాసనసభ ఎన్నికల నాటికి ఢిల్లీ ఓటర్ల సంఖ్య 1,47,97,990. గత సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికల నాటికి అది 1,52,14,638కి చేరింది. తాజా శాసనసభ ఎన్నికలకు 1,56,14,000కు పెరిగింది.

కేజ్రీవాల్ నియోజకవర్గంలో 27.2 శాతం ఓటర్ల తగ్గుదల

ఆప్ అధినేత కేజ్రీవాల్ పోటీ చేసిన న్యూఢిల్లీ స్థానాన్నే తీసుకుందాం. 2020 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల నాటికి ఆ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 39,757 తగ్గింది. అదే లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే శాసనసభ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య 2,209 పెరిగింది. అంటే గత శాసనసభ ఎన్నికలతో పోలిస్తే న్యూఢిల్లీలో నికరంగా తగ్గిన ఓటర్లు 37,548. మరో మాటలో చెప్పాలంటే ఓటర్ల సంఖ్య 27.2 శాతం తగ్గింది. ఇంకోలా చెప్పుకోవాలంటే 2020లో ఓటు వేయడానికి అర్హులైన ప్రతి నలుగురిలో ఒకరిని ఈ ఏడాది ఓటర్ల జాబితా నుండి తొలగించారు. తాజా ఎన్నికల్లో కేజ్రీవాల్ కేవలం నాలుగు వేల ఓట్ల తేడాతో పరాజయం పాలైన విషయం తెలిసిందే.

ముండ్కాలో 31,779 ఓట్ల పెరుగుదల

ముండ్కా స్థానానిది వేరే కథ. 2020-2024 మధ్య చేరిన ఓటర్లతో పోలిస్తే గత ఏడు నెలల్లో చేరిన ఓటర్ల సంఖ్యే అక్కడ అధికంగా ఉంది. 2020-24 మధ్య ఓటర్ల సంఖ్య 14,230 పెరిగితే చివరి ఏడు నెలల్లో 17,549 ఓట్లు పెరిగాయి. అంటే నికరంగా 31,779 ఓట్లు పెరిగాయన్న మాట. ఇక్కడ గెలిచిన బిజెపి అభ్యర్థికి వచ్చిన మెజారిటీ 10,550 ఓట్లు. అదే విధంగా బడ్లీ స్థానంలో నాలుగు సంవత్సరాల్లో 5,684 ఓట్లు పెరగ్గా, చివరి ఏడు నెలల్లో 13,145 ఓట్లు పెరిగాయి. అంటే మొత్తంగా 18,829 ఓట్లు పెరిగాయి. అక్కడ బిజెపి అభ్యర్థికి వచ్చిన మెజారిటీ 15,163 ఓట్లు. షాదారా నియోజకవర్గంలో నాలుగేండ్లలో 4,564 ఓట్లు పెరగ్గా ఏడు నెలల్లోనే 7,387 ఓట్లు పెరిగాయి. ఈ స్థానం నుండి బిజెపి అభ్యర్థి 5,178 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. బిజెపి కార్యకర్తలు చేర్పులు, తొలగింపుల కోసం పుంఖానుపుంఖాలుగా దరఖాస్తులు అందజేశారని ఆప్ విమర్శించింది. నంగ్లోయ్ జాట్ స్థానంలో నాలుగు సంవత్సరాల్లో 13,992 మంది ఓటర్లు తగ్గారు. అదే ఏడు నెలల్లో 16,413 మంది పెరిగారు.

కొన్ని నియోజకవర్గాల్లో భారీగా ఓటర్లను చేర్చారు. బురాలీ శాసనసభ స్థానంలో ఏడు నెలల కాలంలో అత్యధికంగా 24,759 మందిని ఓటర్లుగా చేర్చారు. గత శాసనసభ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు మధ్య కొత్తగా చేరిన ఓటర్ల సంఖ్య 39,798. అంటే మొత్తంగా 64,557 మందిని ఓటర్లుగా చేర్చారన్న మాట. ఓటర్లను అధిక సంఖ్యలో చేర్చిన మరో నియోజకవర్గం బవానా. గత శాసనసభ ఎన్నికలతో పోలిస్తే ఇక్కడ ఓటర్ల సంఖ్య 65,290 పెరిగింది. ఇక్కడ బిజెపి అభ్యర్థికి వచ్చిన మెజారిటీ 31,475. వికాస్‌పురి స్థానంలో కూడా ఓటర్ల సంఖ్య 2020-2025 మధ్య 61,745 పెరిగింది. ఇక్కడ బిజెపి అభ్యర్థి 12,876 ఓట్ల మెజారిటీతో ఎన్నికయ్యారు. కిరారి, బాదర్‌పూర్, ముండ్కా, కరవాల్ నగర్ నియోజకవర్గాల్లో కూడా ఓటర్లను గణనీయంగా చేర్చారు. దీనిపై ఆప్ ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదు.

శ్రీలంక నేవీ అదుపులో 14 మంది తమిళనాడు మత్స్యకారులు

చెన్నై : తమిళనాడుకు చెందిన 14 మంది మత్స్యకారులను శ్రీలంక నేవీ అదుపులోకి తీసుకుంది. రెండు బోట్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సీనియర్ అధికారులు తెలిపారు. రామనాథపురం తీరప్రాంత జిల్లాకు చెందిన 14 మందిని అదుపులోకి తీసుకున్నట్లు శ్రీలంక నేవీ తెలిపింది. పాక్‌బే జలసంధిలో వేటాడుతున్నందున వారిని అరెస్ట్ చేశామని, చట్టపరమైన చర్యల కోసం వారిని నేవీ పోర్ట్‌కు తరలించినట్లు పేర్కొంది. 15 రోజుల్లోపే, 50 మందికి పైగా మత్స్యకారులను అరెస్ట్ చేశారని, సోమవారం సమావేశమై తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని మత్స్యకార సీనియర్ నేత ఒకరు తెలిపారు. శ్రీలంక ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాల్సి వుందని, ఇదే సమస్యకు శాశ్వత పరిష్కారమని అన్నారు. శ్రీలంక ప్రభుత్వం మత్స్యకారులను అరెస్ట్ చేయడంతో వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని అన్నారు. మత్స్యకారుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఇటీవల రామేశ్వరం బస్టాండులో భారీ ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే.

అమాయకులు చనిపోవడం ఆగాలని పుతిన్ కోరుకుంటున్నారు : ట్రంప్

వాషింగ్టన్ : యుద్ధం కారణంగా అమాయక ప్రజలు చనిపోవడం ఆగాలని పుతిన్ కోరుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇటీవల రష్యా అధ్యక్షుడితో సంభాషించిన ఫోన్‌కాల్ వివరాలను ట్రంప్ తాజాగా వెల్లడించారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో న్యూయార్క్ పోస్టు పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ వివరాలు వెల్లడించారు. "ప్రజలు చనిపోవడం ఆపాలని ఆయన అనుకొంటున్నారు. మరణించిన వారంతా యువత, మంచివాళ్లు. వారు మీ పిల్లల్లాంటి వారే. అకారణంగా లక్షల మంది చనిపోయారు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. 2022 సమయంలోనే అధ్యక్షుడిగా తాను ఉండి ఉంటే.. ఈ యుద్ధం ఎప్పటికీ జరిగేది కాదన్నారు. "నాకు పుతిన్‌తో సత్సంబంధాలున్నాయి. దేశానికే బైడెన్ ఓ అవమానం" అని వ్యాఖ్యానించారు. ఇరాన్ విషయాన్ని ట్రంప్ ప్రస్తావిస్తూ.. తాను సైనిక చర్యల కంటే చర్చలకే అధిక ప్రాధాన్యం ఇస్తానని వెల్లడించారు. ఇరాన్‌తో నాన్ న్యూక్లియర్ ఒప్పందం చేసుకోవాలని అనుకొంటున్నట్లు వెల్లడించారు. బాంబు దాడుల కంటే దీనిని తాను ఇష్టపడతానని చెప్పారు.

ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ తెలిపారు. ఉక్రెయిన్‌తో 500 మిలియన్ డాలర్ల డీల్‌ను ట్రంప్ ప్రతిపాదించారు. కీవ్ ఆధీనంలో అరుదైన ఖనిజాలను దీని కింద అమెరికాకు ఇవ్వాల్సి ఉంటుంది. వీటితోపాటు గ్యాస్‌ను కూడా సరఫరా చేయాల్సి వస్తుంది. ఈవారం మ్యూనిచ్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఉక్రెయిన్ అధినేత జెలెన్స్కీతో భేటీ కానున్నారు. ఈ భేటీలో ట్రంప్ ప్రతిపాదనపై స్పష్టత రానుంది.

బంగ్లాదేశ్‌లో 'ఆపరేషన్ డెవిల్స్ హంట్'

- హసీనా మద్దతు ధరలపై దాడులకే!

ఢాకా : బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ సర్కారు 'ఆపరేషన్ డెవిల్స్ హంట్' కార్యక్రమం ప్రారంభించింది. మాజీ ప్రధాని షేక్ హసీనా మద్దతుదారులపై దాడులు చేసేందుకే దీన్ని మొదలుపెట్టిందని పలువురు విమర్శిస్తున్నారు. గత నిరంకుశ పాలకులకు చెందిన గ్యాంగ్‌లు కొన్ని విద్యార్థి బృందాలపై దాడులు చేస్తున్నాయని, అందుకే దీన్ని ప్రారంభించినట్లు తెలిపింది.

ఇంటీరియర్ మినిస్ట్రీ అధిపతి జహంగీర్ ఆలమ్ చౌద్రీ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో విద్యార్థి ఉద్యమం తర్వాత చేపట్టిన ఈ దాడులను ఆపరేషన్ డెవిల్స్ హంట్‌గా వ్యవహరిస్తున్నారు. దుష్టశక్తులను అంతం చేసేవరకు ఇది కొనసాగుతుందన్నారు. ఈ ఆపరేషన్ డెవిల్స్ హంట్‌ను ఘాజీపుర్‌లో మొదలు పెట్టి దేశం మొత్తం అమలు చేస్తామని హోం మంత్రిత్వశాఖ పేర్కొంది. ప్రజల భద్రతలో భాగంగానే దీనిని అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. దీనికి సంబంధించిన అదనపు వివరాలను లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు వెల్లడిస్తాయని తెలిపింది.

'టైపింగ్ తప్పిదమే'

- బీఫ్ బిర్యానీ నోటీసుపై ఎఎంయు

అలీఘర్ : భోజనంలో బీఫ్ బిర్యానీ వడ్డించారనే వివాదంపై అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం (ఎఎంయు) స్పందించింది. అది ఒక టైపింగ్ తప్పిందంగా వివరణ ఇచ్చింది. ఇందుకు బాధ్యులైన వారికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఎఎంయు పరిపాలన విభాగం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అలీఘర్‌లోని ఎఎంయులో ఆదివారం మధ్యాహ్న భోజన సమయంలో సర్ షా సులైమాన్ హాల్‌లో బీఫ్ బిర్యానీ వడ్డించారంటూ ఓ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఫోటో ప్రకారం ఒక నోటీసులో 'ఆదివారం భోజన మెనూ మార్చబడింది.

డిమాండ్ ప్రకారం చికెన్ బిర్యానీకి బదులుగా బీఫ్ బిర్యానీ వడ్డించబడుతుంది' అని ఉంది. 'ఈ విషయం మా దృష్టికి వచ్చింది. టైపింగ్ తప్పిదం కారణంగా ఇలాంటి నోటీసు ఏర్పాటయింది. ఈ నోటీసుపై ఎలాంటి అధికారిక సంతకాలు లేవు. ఈ నోటీసు తయారు చేసిన ఇద్దరు సీనియర్ విద్యార్థులకు షోకాజ్ నోటీసు జారీ చేశాం. విశ్వ విద్యాలయ నిబంధనలు కచ్చితంగా పాటించేలా మేం ఈ సమస్యను తీవ్రంగా పరిగణిస్తున్నాం' అని యూనివర్సిటీ పరిపాలనా విభాగం అధికారులు తెలిపారు.

కౌన్‌బనేగా ఢిల్లీ సిఎం

- కుర్చీ కోసం పెరుగుతున్న పోటీ
- టెన్షన్‌లో ఆశావహులు
- మోడీ అమెరికా టూర్ తర్వాతే అంటూ అధిష్ఠానం సంకేతాలు

న్యూఢిల్లీ : ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన బిజెపి ప్రభుత్వ ఏర్పాటుపై కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ పడుతున్న నేతల సంఖ్య పెరిగిపోతోంది. కొందరు సిట్టింగ్ ఎంపీలు కూడా సిఎం పదవిపై కన్నేశారు. ఎన్నికైన శాసనసభ్యుల్లో ఎవరో ఒకరిని ముఖ్యమంత్రి చేయడానికే ఆ పార్టీ కేంద్ర నాయకత్వం సుముఖంగా ఉన్నదని తెలుస్తోంది. ఎంపీల్లో ఒకరిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేస్తే... ఎంపీ పదవికి రాజీనామా చేస్తే ఖాళీ అయ్యే స్థానానికి ఒక ఎన్నిక, ఆరు నెలల్లోగా ఎమ్మెల్యేగా ఎన్నిక కావడానికి మరో ఎన్నిక అవసరమవుతాయి.

న్యూఢిల్లీలో ఆప్ అగ్రనేత కేజ్రీవాల్‌ను ఓడించి జెయింట్ కిల్లర్‌గా పేరు తెచ్చుకున్న పర్వేష్ వర్మకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడైన పర్వేష్ వర్మ వెస్ట్ ఢిల్లీ లోక్‌సభ స్థానం నుండి రెండుసార్లు విజయం సాధించారు. జాట్ కులానికి చెందిన వాడు. ఆ సమాజంలో ఆయనకు గట్టి పట్టుంది. శాసనసభ ఎన్నికల్లో జాట్లు బిజెపికే కొమ్ము కాశారు. ఆప్ ప్రభుత్వ హయాంలో బిజెపి శాసనసభాపక్ష నేతగా వ్యవహరించిన విజేందర్ గుప్తా కూడా సిఎం పదవికి పోటీ పడుతున్నారు. ఆయన రోహిణి స్థానంలో హ్యాట్రిక్ విజయం సాధించి శాసనసభలో ప్రవేశిస్తున్నారు.

'ముఖ్యమంత్రి పదవిపై ఇప్పుడే ఏమీ చెప్పలేము. పార్టీ నాయకత్వం తొందరపాటు నిర్ణయం తీసుకోదు. ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాతే ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది' అని బిజెపి వర్గాలు తెలిపాయి. మరోవైపు అందరినీ ఆశ్చర్యపరుస్తూ కొత్త వ్యక్తిని తెర పైకి తెచ్చే అవకాశాలూ ఉన్నాయని అంటున్నారు.

మెక్సికోలో ఘోర రోడ్డు ప్రమాదం..

- 41 మంది మృతి

టబాస్కో : దక్షిణ మెక్సికోలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న బస్సును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. టబాస్కో రాష్ట్రంలో శనివారం తెల్లవారుజామున ఈఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో బస్సులోని 38 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు అక్కడికక్కడే మరణించినట్లు తెలిపారు. ట్రక్కు డ్రైవర్ కూడా మరణించినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 38 మృతదేహాలను వెలికితీసినట్లు తెలిపారు. మరణించిన వారి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు భౌతికకాయాలను అప్పగించనున్నట్లు వెల్లడించారు. ప్రమాద సమయంలో బస్సులో 48 మంది ఉన్నారని, ప్రమాదానికి గల కారణాలపై ఆరాతీస్తున్నామని అధికారులు చెప్పారు.

హామీలను నెరవేరుస్తారా?

- వాగ్దానాల అమలుపై బిజెపి మల్లగుల్లాలు
- ఇప్పటికే రూ.18,000 కోట్ల రుణ భారంలో ఢిల్లీ

న్యూఢిల్లీ : రాజధాని ఢిల్లీలో శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఎన్నికల ప్రచారంలో ఆప్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఒక దానిని మించి మరొకటి హామీల వరద పారించాయి. ప్రజానీకం బిజెపిని గెలిపించారు. ఎన్నికల మ్యానిఫెస్టోల్లో ఇచ్చిన హామీల అమలు కోసం కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ఆపసోపాలు పడుతున్నాయి. తాజాగా ఆ జాబితాలో ఢిల్లీ కూడా చేరబోతోంది.

హామీలు ఇలా...

ఆప్ నుండి ఎలాగైనా అధికారాన్ని హస్తగతం చేసుకోవాలన్న లక్ష్యంతో బిజెపి ఎడాపెడా హామీలు ఇచ్చింది. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వృద్ధులకు అంతే మొత్తంలో పెన్షన్ అందజేస్తామని (70 సంవత్సరాలు దాటిన వృద్ధులకు రూ.3,000) చెప్పింది. ప్రతి గర్భిణికి రూ.21,000తో పాటు ఆరు పౌష్టికాహార కిట్లు, విద్యార్థులకు ఉచితంగా కేజీ టూ పీజీ విద్య, రూ.10 లక్షల వరకూ ఉచిత వైద్య చికిత్సతో ఆయుష్మాన్ భారత్‌తో పాటు ఆటో, ట్యాక్సీ, ఈ-రిక్షా డ్రైవర్లు, గిగ్ వర్కర్లు, ఇంటి పనివారికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా... ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి ఇచ్చిన హామీలు ఎన్నో.

ప్రస్తుత కేటాయింపులు

ఢిల్లీ ప్రభుత్వానికి 2024-25లో పన్నుల ద్వారా రూ.58,750 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా. గత ఆర్థిక సంవత్సరంలో పన్ను రాబడి రూ.53,680 కోట్లు. ప్రస్తుత సంవత్సరపు బడ్జెట్ రూ.76,000 కోట్లు. ఇందులో అత్యధికంగా 22 శాతాన్ని (రూ.16,396 కోట్లు) విద్యకు కేటాయించారు. ఆ తర్వాత గృహనిర్మాణం, పట్టణాభివృద్ధికి రూ.9,800 కోట్లు (13 శాతం), ఆరోగ్య రక్షణ, ప్రజారోగ్యానికి రూ.8,685 కోట్లు (11 శాతం), రవాణా మౌలిక సదుపాయాలకు రూ.7,470 కోట్లు (10 శాతం), నీటి సరఫరా, పారిశుధ్యానికి రూ.7,195 కోట్లు (9 శాతం), సామాజిక భద్రత, సంక్షేమం కోసం రూ.6,694 కోట్లు (9 శాతం) కేటాయించారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో మూడింట రెండు వంతులు జీతాలు, నిర్వహణ ఖర్చులకే పోతుంది. ఆదాయ వ్యయాల్లో వ్యత్యాసం కారణంగా లోటు ఏర్పడే అవకాశం ఉన్నదని ఆర్థిక శాఖ గత సంవత్సరం మొదటిసారిగా ఆందోళన వ్యక్తం చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పన్నులు, పన్నేతర వనరులు, కేంద్రం నుండి వచ్చే వసూళ్ల ద్వారా సమకూరే ఆదాయం రూ.64,142 కోట్ల నుండి రూ.62,415 కోట్లకు తగ్గవచ్చునని అంచనా.

అంచనా వ్యయం

అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయాన్ని అందిస్తామని బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. గతంలో ఆప్ ప్రభుత్వం ఇలాంటి గ్యారంటీ ఆదాయ పథకాన్నే ప్రతిపాదించింది. అందుకోసం 38 లక్షల మంది అర్హులైన మహిళలను గుర్తించింది. పథకం అమలుకు ఏటా రూ.11,000 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసింది. ఇప్పుడు కొత్తగా ఏర్పడబోయే బిజెపి ప్రభుత్వం దీనిపై కొత్తగా అంచనాలు రూపొందించాల్సి ఉంది. ఇక వృద్ధుల కోసం ఉద్దేశించిన పెన్షన్ పథకం విషయానికి వస్తే....ఢిల్లీలో 60 సంవత్సరాలు దాటిన వారు 24,44,476 మంది ఉన్నారని ఎన్నికల కమిషన్ వద్ద ఉన్న సమాచారం చెబుతోంది. వీరిలో 13,78,797 మంది (60-69 సంవత్సరాల మధ్య వయస్కులు) నెలకు రూ.2,500 పెన్షన్ పొందేందుకు అర్హులు. ఒక్క వీరికి పెన్షన్ ఇవ్వాలంటేనే ఏడాదికి రూ.4,100 కోట్లు అవసరమవుతాయి.

వీటికీ నిధులు అవసరమే

బిజెపి ఇచ్చిన మిగిలిన హామీల విషయానికి వస్తే యమునా నది ప్రక్షాళనకు భారీగానే నిధులు కావాల్సి ఉంటుంది. లోతట్టు ప్రాంతాల అభివృద్ధి కోసం ఇచ్చిన హామీ నెరవేర్చడానికి కూడా పెద్ద మొత్తంలోనే కేటాయింపులు జరపాల్సి ఉంటుంది. యమునా నదిపై ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా రూ.8,000 కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుతం అమలు జరుగుతున్న, కొత్తగా చేపట్టే సంక్షేమ పథకాల కోసం ఢిల్లీ ప్రభుత్వానికి ఏడాదికి రూ.25,000 కోట్లు అవసరమవుతాయని అంచనా. ఉచిత నీరు, విద్యుత్ పథకాల కోసం ఆప్ ప్రభుత్వం ఖర్చు చేస్తున్న రూ.11,000 కోట్లు కూడా ఈ వ్యయంలో కలిసి ఉంది. కేంద్రం నుండి రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ వచ్చే అవకాశం ఏమన్నా ఉన్నదా అని అడిగిన ప్రశ్నకు సీనియర్ అధికారి ఒకరు సమాధానమిస్తూ 'ఆప్ ప్రభుత్వం రూ.18,000 కోట్ల అప్పు చేసింది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ఆదాయ పంపిణీ విషయంలో కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కొత్త సంక్షేమ పథకాల అమలు కోసం మూలధనపు వ్యయం, ఇతర రంగాల నుండి నిధులను మళ్లించాలి. కేంద్ర సాయం కోరడం రెండో మార్గం మాత్రమే' అని వివరించారు. కొత్త ప్రభుత్వం ఆరోగ్య రంగంపై కూడా తక్షణమే దృష్టి సారించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఏడు కొత్త ఆస్పత్రుల నిర్మాణం, మరో 17 ఆస్పత్రుల ఆధునీకరణ కోసం రూ.10,200 కోట్లు మంజూరయ్యాయి. వీటి నిర్వహణకు బడ్జెట్‌లో రూ.8,000 కోట్లు కేటాయించారు. మూడో దశను పూర్తి చేయడానికి, నాలుగో దశ విస్తరణకు ఢిల్లీ మెట్రో ప్రాజెక్టుకు రూ.2,700 కోట్లు అవసరమవుతాయి. ఢిల్లీని పట్టిపీడిస్తున్న కాలుష్య భూతాన్ని తరిమేసేందుకు, రోడ్ల మరమ్మతులకు నిధులు వెచ్చించాల్సి ఉంది. రోడ్లకు సంబంధించిన మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టకపోవడం కూడా ఆప్ ఓటమికి కారణమైంది. 2023-24లో ఈ పద్దుపై రూ.3,126 కోట్లు ఖర్చు చేసిన ఆప్ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,768 కోట్లే కేటాయించింది. కొత్తగా అండర్‌పాస్‌లు కానీ, ఫ్లైఓవర్లు కానీ ప్రతిపాదించలేదు.

'ప్రెసిడెంట్ మస్క్'!

- టైమ్ మ్యాగజైన్ కవర్ పేజీ

వాషింగ్టన్ : ప్రపంచ బిలియనర్ ఎలాన్ మస్క్‌ను అమెరికా అధ్యక్షుడిగా పేర్కొంటూ టైమ్ మ్యాగజైన్ ఓ కవర్ పేజీని ప్రచురించడం సంచలనంగా మారింది. ఓవల్ ఆఫీస్‌లోని అమెరికా అధ్యక్షుడి స్థానంలో మస్క్ కాఫీ కప్‌తో కూర్చొని ఉన్నట్లుంది. "ఇన్‌సైడ్ ఎలాన్ మస్క్ వార్ ఆన్ వాషింగ్టన్" అనే పేరుతో కవర్ పేజీ కథనం రాసింది. ట్రంప్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పటి నుంచి ఇప్పటి వరకు ట్రంప్ కోసం మస్క్ చేసిన కృషిని, ప్రస్తుత ట్రంప్ ప్రభుత్వానికి అందిస్తున్న సహకారాన్ని వివరించింది. దేశంలో ఉన్న మిలియన్ల మంది ప్రభుత్వ ఉద్యోగుల భవిష్యత్తు మస్క్ దయపై ఆధారపడి ఉందని టైమ్ తన కథనంలో తెలిపింది. మస్క్ ట్రంప్‌నకు తప్ప మరెవరికీ జవాబుదారీగా వ్యవహరించరని పేర్కొంది. తన అజెండాకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు ఉండేలా మస్క్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని, ఈ నేపథ్యంలోనే యుఎస్‌ఎయిడ్‌ను మూసివేయించారని పత్రిక విమర్శించింది.

'టైమ్... ఇంకా నడుస్తోందా? : ట్రంప్ వ్యంగ్యం

ఈ కథనంపై ట్రంప్ వ్యంగ్యంగా స్పందించారు. 'టైమ్ మ్యాగజైన్ ఇంకా నడుస్తోందా..? ఇప్పటి వరకు అది ఉన్న విషయమే నాకు తెలియదు' అని వ్యాఖ్యానించారు. మస్క్ అమెరికాలో జన్మించలేదు కాబట్టి ఆయన ఎప్పటికీ దేశాధ్యక్షుడు కాలేరని ట్రంప్ స్పష్టం చేశారు. తన ఆదేశాలకు అనుగుణంగానే ఎలాన్ పని చేస్తున్నారని చెప్పారు.

మస్క్‌పై కవర్‌పేజీ రెండోసారి

టైమ్ మ్యాగజైన్ మస్క్‌ను కవర్‌పేజీపై ప్రచురించడం ఇది రెండోసారి. గతేడాది జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు కీలకపాత్ర పోషించారని చెబుతూ మస్క్‌ను 'కింగ్ మేకర్'గా పేర్కొంది. సిటిజన్ మస్క్: ఆయన చేయవలసిన జాబితాలో తరువాత ఏంటి?' అనే టైటిల్‌తో కవర్ పేజీని ప్రచురించింది.

అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో అధికారులే క్రియాశీలకం

- ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి- కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)

అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ అనుసంధానానికి స్థానిక అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించి గిరిజనుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు అన్నారు. (పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం బియ్యాలవలస పంచాయతీ మంత్రజోలలోగల వన్‌ధన్ వికాస కేంద్రాన్ని (విడివికె) ఆదివారం ఆయన సందర్శించారు. అక్కడ వెలుగు ద్వారా గిరిజన మహిళలు చిరుధాన్యాలతో బిస్కెట్లు తయారీ చేస్తున్న మిల్లును పరిశీలించారు. వారు తయారు చేస్తున్న విధానం, కావాల్సిన ముడి సరుకులు, వారికి వచ్చే ఆదాయం గూర్చి నేరుగా మహిళలతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు.

అనంతరం శంకరరావు మాట్లాడుతూ వన్‌దన్ వికాస్ కేంద్రం అనేది మంచి కార్యక్రమని, దీనికి కేంద్ర ప్రభుత్వం ఆసరా ఇస్తుందని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో పండే పంటలతో గిరిజన మహిళలు ఉత్పత్తులను తయారు చేసి ఆర్థిక స్వాలంబన పొందడమే దీని ముఖ్యోద్దేశమన్నారు. ఇక్కడ బిస్కెట్లు తయారు బాగానే చేస్తున్నారని, అయితే వీటికి సరైన మార్కెటింగ్ చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. బిస్కెట్లను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు కొనుగోలు చేసి విద్యార్థులకు అందించేలా చర్యలు చేపడతానని, దీనివల్ల విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందుతుందని అన్నారు. చిరుధాన్యాలు ఆడుతున్న మిల్లులకు రేకుల షెడ్డు పాడైపోయిందని చైర్మన్ దృష్టికి మహిళ తీసుకెళ్లారు. రేకులు ప్రభుత్వం అందిస్తే స్వచ్ఛందంగా శ్రమదానంతో నిర్మించుకుంటామని వారు తెలిపారు. ఆ సమస్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో పండే జీడి, కొండచీపుర్లు, తేనె, కరక్కాయలు తదితర పంటలను ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

గిరిజనుల భాగస్వామ్యంతోనే టూరిజం అభివృద్ధి చేపట్టాలి

గుమ్మలక్ష్మీపురం : షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనుల భాగస్వామ్యంతోనే పర్యాటక అభివృద్ధి చేపట్టాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజన్ శంకర్రావు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1/70 చట్టం గిరిజనులకు ఎంతగానో మేలు చేస్తోందని, ఈ చట్టాన్ని పూర్తిగా అమలు చేస్తూ టూరిజాన్ని అభివృద్ధి చేపట్టాలన్నారు. షెడ్యూల్డ్ గిరిజన ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురం కేంద్రంగా జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, గిరిజన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు యువతకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. గిరిజన యువత భవిష్యత్తులో ఉపాధి, ఉద్యోగాలకు ఉపయోగపడే కోర్సులు చదువుకోవాలన్నారు. రైల్వే రిక్రూట్‌మెంట్, బ్యాంకింగ్ సర్వీస్, స్టాఫ్ సెలక్షన్ కమిటీ, ఎపిపిఎస్‌సి తదితర ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకొని కష్టపడి చదివినప్పుడే రిజర్వేషన్ ఉపయోగపడుతూ మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రైవేట్ సెక్టార్‌లో కూడా పలు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గిరిజన యువత క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదవాలని సూచించారు.

నిర్వీర్యమవుతున్న జిసిసి

శిథిలావస్థలో డిఆర్ డిపోలు
ఏళ్ల తరబడి భర్తీకాని పోస్టులు

ప్రజాశక్తి- సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

గిరిజన సహకార సంస్థ (జిసిసి) రోజు రోజుకు నిర్వీర్యమవుతోంది. జిసిసికి ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం చేసిన ప్రతి కార్యక్రమాల్లో జిసిసిని భాగస్వామ్యం చేసేవారు. ప్రస్తుతం అంతంత మాత్రంగా వ్యవహరిస్తున్నారు. ఏళ్ల తరబడి ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉన్న సిబ్బందితోనే జిసిసి కార్యకలాపాలు నెట్టుకొస్తున్నారు. గిరిజనులకు నిత్యావసర సరుకులు, తక్కువ ధరకు నాణ్యమైన వస్తువులు గిరిజన గ్రామాల్లోనే గిరిజనులు చెంతకు చేరువ చేయాలని ఉద్దేశంతో 1956లో జిసిసిని నెలకొల్పారు. డిఆర్ డిపోలను నిర్మించి క్రియవిక్రయాలకు సేల్స్‌మెన్లను నియమించారు. ప్రస్తుతం సేల్స్‌మెన్లు, అధికారులు, నాలుగో తరగతి సిబ్బంది, రిటైర్మెంట్ అయిన ఆ పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీ అయినా భర్తీ చేయడం లేదు. రిటైర్మెంట్ అయిన పోస్ట్‌ను ఇంకొకరికి అదనపు బాధ్యతలు అప్పగించడం తప్ప, కొత్తగా వేరే వారిని నియమించడం లేదు. సీతంపేట డివిజనల్ పరిధిలోని సీతంపేట, పాతపట్నం జిసిసి బ్రాంచులు ఉన్నాయి. సీతంపేట బ్రాంచ్ పరిధిలో 36 డిఆర్ డిపోలు ఉన్నాయి. వీటిలో 14 కొత్త భవనాలు కావాలని ప్రతిపాదన పంపించారు. ఐదు డిఆర్ డిపోలు, ఐదు గోదాములు మరమ్మతులకు గుర్యాయి. ఈ బ్రాంచ్ పరిధిలో 22,856 రేషన్ కార్డుల లబ్ధిదారులకు 4,850 క్వింటాలు బియ్యం, 145 క్వింటాళ్ల పంచదార,

కందిపప్పు డిపోల ద్వారా సరఫరా చేస్తారు. డిపోలు శిథిలావస్థలో ఉండడంతో ఎక్కడ సరుకులు నిల్వలు ఉంచాలో తెలియని పరిస్థితి ఉంది. పాతపట్నం బ్రాంచ్ పరిధిలో 21 డిఆర్ డిపోలకు 21 మరమ్మతులకు గురయ్యాయి. ఆరు డిపోలు పూర్తిగా శిథిలావస్థలోనే ఉన్నాయి. జిసిసి కార్యాలయం కూడా శిథిలావస్థలో ఉండడంతో పెచ్చులు ఊడిపోతున్నాయి. దీంతో, ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో నీరు కారడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పాతపట్నం బ్రాంచ్ పరిధిలో 8,630 రేషన్ కార్డులకు 43,150 క్వింటాళ్ల బియ్యం డిఆర్ డిపోల్లో నిల్వ ఉంచి లబ్ధిదారులకు అందజేస్తారు. దీంతో, ఈ సరుకు వర్షాకాలంలో పాడైపోతుందని ఆందోళన చెందుతున్నారు. అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి నిల్వ చేసే గోధుమలు లేక బయట ఉంచాల్సిన పరిస్థితి దాపురించింది. ఏళ్ల తరబడి జిసిసిల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా మేనేజర్లు, అకౌంటెంట్లు, డిఎంలు, జనరల్ మేనేజర్లు అన్ని కలిపి 1088 పోస్టులు ఖాళీలు ఉంటే కేవలం 210 మందితోనే నెట్టుకు వస్తున్నారు. ఇప్పటికే సీతంపేట డిఎం, మేనేజర్లు, అకౌంటెంట్, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్, సేల్స్‌మెన్లు, నాలుగో తరగతి సిబ్బంది ఇలా అన్ని పోస్టులు ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

జిసిసిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఇప్పటికే ప్రతిపాదనలు పంపిం చాం. డిఆర్ డిపోలు మేనేజర్ డిఎం కార్యాలయాలు కూడా ప్రతిపాదనలో ఉన్నాయి. డిపోలో మేజర్ గదులు ముందుగా మరమ్మతులు చేయిస్తాం. కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపించాం.

-జి సంధ్యారాణి, జిసిసి జనరల్ మేనేజర్, విశాఖపట్నం.

అణు చట్టాల సవరణ

- మోడీ విదేశీ పర్యటన నేపథ్యంలో కేంద్రం ప్రకటన
- అమెరికా, ఫ్రాన్స్ కంపెనీలకు మోదం
- నేటి నుంచి ప్రధాని పర్యటన

న్యూఢిల్లీ : అణు బాధ్యతా చట్టాన్ని, అణు ఇంధన చట్టాన్ని సవరిస్తానని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం అమెరికా, ఫ్రాన్స్ పర్యటనకు బయలుదేరుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ ప్రకటన చేయడం గమనార్హం. అణు ఇంధన రంగంలో ప్రమాదాలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన నెలకొన్నప్పటికీ... కేంద్రం తాజాగా తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రం నిర్ణయం అమెరికా, ఫ్రాన్స్ దేశాల అణు ఇంధన కంపెనీలకు ఉత్సాహాన్ని ఇస్తుంది. ఎందుకంటే వాటి ప్రాజెక్టుల విషయంలో గత పదిహేను సంవత్సరాలుగా ప్రతిష్టంభన కొనసాగుతోంది. చట్టపరమైన చిక్కులే దీనికి కారణం. కొందరు నిపుణులు ప్రతిపాదిత సవరణలపై మరింత స్పష్టత కోరుతున్నారు.

2015లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరికి ఈ నెల 1న బడ్జెట్ సమర్పణ సమయంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన పూర్తి భిన్నంగా ఉంది. మహారాష్ట్రలోని జైతాపూర్ వద్ద ఆరు ఇపిఆర్ 1650 అణు విద్యుత్ రియాక్టర్ల నిర్మాణానికి సంబంధించి 2009లో ఎలక్ట్రిసైట్ డి ఫ్రాన్స్ (ఇడిఎఫ్)తో అవగాహనా ఒప్పందం కుదిరింది. ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరులో ఆరు ఎపి 1000 అణు విద్యుత్ రియాక్టర్ల నిర్మాణానికి సంబంధించి అమెరికాకు చెందిన వెస్టింగ్‌హౌస్ ఎలక్ట్రిక్ కంపెనీ (డబ్ల్యుఇసి)తో కూడా 2012లో ఎంఓయూ కుదిరింది. చట్టపరమైన అవరోధాల కారణంగా రియాక్టర్ల నిర్మాణం



ముందుకు సాగలేదు. ఇప్పుడు కేంద్రప్రభుత్వ నిర్ణయంతో అడుగు ముందుకు పడుతుందని చెబుతున్నారు.

లక్ష్య సాధన కోసం ప్రైవేట్ భాగస్వామ్యం తప్పనిసరి అని, అందుకే అణు ఇంధన చట్టాన్ని, అణు నష్టానికి సంబంధించిన పౌర బాధ్యతా చట్టాన్ని సవరించాలని నిర్ణయించామని ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. అణు విపత్తు సంభవించినప్పుడు జరిగే నష్టానికి బాధితులకు పరిహారం అందేలా చేయడం ఈ చట్టం ఉద్దేశం. ఆ నష్టానికి ఎవరు బాధ్యత వహించాలో కూడా చట్టం నిర్దేశిస్తుంది. చట్టంలోని ఈ నిబంధనల కారణంగా విదేశీ కంపెనీలు మన దేశంతో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి వెనుకాడుతుండటంతో వీటిని సవరించాలని నిర్ణయించామని చెబుతోంది. 2047 నాటికి కనీసం 100 గిగావాట్ల అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. 2033 నాటికి ఐదు స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల (ఎస్ఎంఆర్)తో ఉత్పత్తి ప్రారంభించడానికి రూ.20,000 కోట్లు కేటాయించింది. మన దేశం వద్ద ప్రస్తుతం 22 రియాక్టర్లు ఉన్నాయి. వాటి ద్వారా 6,780 మెగావాట్ల అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ప్రస్తుతం రష్యాకు చెందిన రొసాటమ్ కంపెనీ మాత్రమే మన దేశంలో అణు కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

ప్రస్తుత చట్టంలోని నిబంధనలు ఆమోదయోగ్యం కావని పశ్చిమ దేశాలకు చెందిన అంతర్జాతీయ అణు విద్యుత్ కంపెనీలు తెగేసి చెబుతున్నాయి. అణు విద్యుదుత్పత్తికి సంబంధించిన విడిభాగాలను సరఫరా చేసే వారిపై ఈ చట్టం అధిక బాధ్యత మోపుతోందన్నది వాటి వాదన. 2012లో పార్లమెంటులో వాడి వేడి చర్చ జరిగిన అనంతరం ఈ నిబంధనలను చట్టంలో చేర్చగా, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ఎన్‌డిఎ సభ్యులు వ్యతిరేకించారు. బాధ్యత నుండి పశ్చిమ దేశాలను తప్పించేందుకే ఈ నిబంధనను తెచ్చారని ఆరోపించారు. ఆ సందర్భంగా యూనియన్ కార్బైడ్ - భోపాల్ గ్యాస్ లీకేజీ కేసు, జపాన్ తీరంలో సంభవించిన సునామీ కారణంగా జరిగిన ఫుకుషిమా అణు లీకేజీ ఘటన చర్చకు వచ్చాయి. అంతర్జాతీయ సరఫరాదారులు సమస్యలు ఎదుర్కొంటారని తెలిసి కూడా ప్రతిపక్షాలను సంతృప్తి పరచడానికి 2010లో చట్టాన్ని సవరించారని మాజీ విదేశాంగ కార్యదర్శి శ్యామ్ శరణ్ తెలిపారు. 'ఇప్పుడు ప్రభుత్వం ఎలాంటి సవరణలు చేస్తుందో చూడాలి. అంతర్జాతీయ భాగస్వాములను సంప్రదించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీనివల్ల ప్రాజెక్టులు ముందుకు సాగుతాయి' అని ఆయన చెప్పారు.

ప్రధాని పర్యటన నేపథ్యంలోనే వైఖరిలో మార్పు

చట్టాన్ని కానీ, నిబంధనలను కానీ సవరించే ప్రతిపాదన ఏదీ లేదని దశాబ్దం క్రితం కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇప్పుడు ప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చింది. ఇంధన ఎగుమతులను, అణు విద్యుత్‌ను ప్రోత్సహించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు ఎస్ఎంఆర్ ప్రాజెక్టులపై భారత్, ఫ్రాన్స్ మధ్య చర్చలు జరుగుతున్నాయి. సోమ, మంగళ వారాల్లో మోడీ ఫ్రాన్స్‌లో పర్యటిస్తారు. ఆ సందర్భంగా దీనిపై చర్చ జరిగే అవకాశం ఉంది. మోడీ బుధ, గురు వారాల్లో అమెరికాలో పర్యటిస్తారు.

దల్లేవాల్‌కు వైద్య చికిత్స అందడం లేదు

- రైతు సంఘాలు

చండీగఢ్ : నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకులు జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌కు ఆరు రోజుల నుంచి వైద్య చికిత్స అందడం లేదని ఆదివారం రెండు రైతు సంఘాలు తెలిపాయి. చికిత్సలో భాగంగా ఇంట్రావీనస్‌ను ఇవ్వడానికి దల్లేవాల్ శరీరంలో సిరలను వైద్యులు గుర్తించలేకపోవడమే ఇందుకు కారణమని వెల్లడించాయి. 'దల్లేవాల్‌కు సిరలు మూసుకుపోయాయి. ఇంజెక్షన్ కోసం మెడికల్ డ్రిప్‌ను అమర్చడం కోసం సిరలను వైద్యులు గుర్తించలేకపోయారు. దీంతో ఆరు రోజుల నుంచి దల్లేవాల్‌కు వైద్య సహాయం నిలిచిపోయింది' అని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీతో పాటు, ఇతర డిమాండ్ల కోసం గత ఏడాది నవంబర్ 26 నుంచి దల్లేవాల్ నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాలతో కేంద్ర సంయుక్త కార్యదర్శి (వ్యవసాయం) ప్రియా రంజన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఎస్‌కెఎం, కెఎంఎంలను చర్చలకు ఆహ్వానించడంతో వైద్య సహాయానికి దల్లేవాల్ అంగీకరించారు. దీంతో నిరసన స్థలం ఖనౌరీలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. దల్లేవాల్ నిరాహార దీక్షను విరమించలేదు. ద్రవాలను ఎక్కిస్తున్నారు. రైతుల డిమాండ్లను కేంద్రం ఆమోదించే వరకూ నిరాహార దీక్ష విరమించేది లేదని దల్లేవాల్ గతంలోనే స్పష్టం చేశారు. తాజాగా, ద్రవాలను ఎక్కించే పరిస్థితి లేకపోవడంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది.

కరేబియన్ సముద్రంలో భారీ భూకంపం

- రిక్టర్‌స్కేల్‌పై తీవ్రత 7.6గా నమోదు

హోండురాస్ : కరేబియన్ సముద్రంలో భారీ భూకంపం సంభవించింది. హోండురస్‌కు ఉత్తరాన రిక్టర్‌స్కేల్‌పై తీవ్రత 7.6గా నమోదైంది. కొలంబియా, కోస్టారికా, నికరగువా, క్యూబా దేశాలపై దీని ప్రభావం కనిపించింది. అమెరికాకు చెందిన జియోలాజికల్ సర్వే సంస్థ సునామీ హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ప్రధాన భూభాగంపై దీని ప్రభావం ఉండదని పేర్కొన్నది. క్యూబా తీరంలోని కొన్ని ప్రాంతాల్లో 1-3 మీటర్ల ఎత్తు వరకు అలలు ఎగిసిపడే అవకాశం ఉందని అమెరికా నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్మియరిక్ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది.

నమీబియా జాతిపిత సామ్ నుజోమా మృతి

విండ్‌హోక్ : నమీబియా జాతిపిత సామ్ నుజోమా (95) తుదిశ్వాస విడిచారు. విండ్‌హోక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం రాత్రి మరణించినట్లు ప్రస్తుత నమీబియా అధ్యక్షుడు నాంగోలో మ్బుంబా ఆదివారం ప్రకటించారు. జర్మనీ సుదీర్ఘ వలసపాలన, దక్షిణాఫ్రికా నుండి స్వాతంత్ర్యం కోసం యుద్ధం తర్వాత దేశాన్ని ప్రజాస్వామ్యం, స్థిరత్వం వైపు నడిపించేందుకు తీవ్రంగా కృషి చేశారు. 15 ఏళ్ల పాటు నమీబియా మొదటి అధ్యక్షుడిగా పనిచేశారు. దక్షిణాఫ్రికాకు చెందిన నెల్సన్ మండేలా, జింబాబ్వేకు చెందిన రాబర్ట్ ముగాబే, జాంబియాకు చెందిన కెన్నెత్ కౌండా, మొజాంబిక్‌కు చెందిన సమోరా మాచెల్‌ల మాదిరిగానే వలసవాద, తెల్లజాతీయుల పాలన నుండి తమ దేశాలకు స్వాతంత్ర్యం సాధించిన ఆఫ్రికన్ నేతల్లో సామ్‌నుజోమా చివరివారు.

ప్రభుత్వ వ్యతిరేకత వల్లే...

- ఆప్ ఓటమిపై సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ

న్యూఢిల్లీ : ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమికి ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తే కారణమని సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత ఎన్నికలతో పోలిస్తే ఆప్ ఓటింగ్ 10 శాతం తగ్గిపోవడం, పలువురు ముఖ్య నాయకులు ఓడిపోవడం ప్రజల వ్యతిరేకతను తెలుపుతోందని పేర్కొంది. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలం కావడం, అవినీతిలో కూరుకుపోయిందంటూ బిజెపి విస్తృతంగా చేసిన ప్రచారాన్ని ఎదుర్కోలేకపోవడం ఓటమికి కారణాలని తెలిపింది. లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా ఆప్ ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను కేంద్రప్రభుత్వం అడ్డుకుందని విమర్శించింది. పార్లమెంట్‌లో తనకున్న మెజారిటీని ఉపయోగించి చట్టాన్ని సవరించడం ద్వారా ఢిల్లీలో పరిపాలనను కేంద్రం గత మూడేళ్లుగా మరింతగా నియంత్రించిందని పేర్కొంది. ఆప్, కాంగ్రెస్ మధ్య అవగాహన లేకపోవడం వల్ల డజనుకుపైగా సీట్లను చాలా తక్కువ తేడాతో బిజెపి గెలుచుకుందని తెలిపింది. కాంగ్రెస్ ప్రచారం బిజెపికంటే ఎక్కువగా ఆప్‌కు వ్యతిరేకంగా సాగిందని, అది కమలం పార్టీకి సహాయపడిందని వివరించింది. సంఘ్‌పరివార్‌లోని వివిధ సంస్థలు అట్టడుగుస్థాయిలో మతం ఆధారంగా ప్రజల మధ్య విభజన తీసుకొచ్చేందుకు విస్తృతంగా ప్రచారం చేశాయని పేర్కొంది. భారీ మొత్తంలో డబ్బు బిజెపి బహిరంగంగానే పంపిణీ చేసిందని, సమాచారం ఇచ్చినా నియంత్రించేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకోలేదని విమర్శించింది. ఈ ఫలితం ఢిల్లీలో లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఎదుర్కొంటున్న సవాళ్లను స్పష్టం చేసిందని సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ పేర్కొంది.

పన్నుల ప్రకారం రాష్ట్రాలు నిధులు అడగడం తగదు

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ముంబయి : పన్నులు చెల్లించిన దామాషా ప్రకారం కేంద్ర నిధులు కావాలని కొన్ని రాష్ట్రాలు, కొందరు నేతలు డిమాండ్ చేయడం అల్పమైన ఆలోచన, దురదృష్టకరమని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్ అన్నారు. ముంబయిలో ఎబివిపి ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశం వృద్ధి చెందాలంటే ఈశాన్య రాష్ట్రాలతో పాటు బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్ కూడా కచ్చితంగా అభివృద్ధి చెందాలనేది ప్రధాని మోడీ ఆలోచన అని చెప్పారు. "తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రలో గతంలో అధికారంలో ఉన్నవారు కేంద్రానికి చెల్లించిన పన్నుల సొమ్ము మొత్తం కేంద్ర నిధుల కింద తిరిగి రాష్ట్రాలకు రావాలని అడుగుతుంటారు. ఇంతకంటే అల్పమైన ఆలోచన మరొకటి ఉండదు. ఇంతకంటే దురదృష్టకరం ఇంకోటి ఉండదు" అని ఆయన వ్యాఖ్యానించారు.

నాక్ కుంభకోణం..
యుజిసి ఛైర్మన్ రాజీనామాకు ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి) గ్రేడ్ కోసం లంచం కుంభకోణాన్ని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ ప్రకటన విడుదల చేశారు. అనుకూల గ్రేడ్‌ల కోసం లంచం ఇవ్వడం, తీసుకోవడం దారుణమైనదని పేర్కొన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ పాలనలో పెంచి పోషించిన అవినీతి వ్యవస్థ ప్రత్యక్ష ఫలితమే ఈ ఉదంతమని పేర్కొన్నారు. అర్హత లేని పార్టీ విధేయులు ఉన్నత విద్యా సంస్థల్లో కీలకమైన స్థానాల్లో చొరబడ్డారని, సంస్థలను మోసం, పక్షపాత కేంద్రాలుగా మారుస్తున్నారని విమర్శించారు.

'ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా లంచం కేసులో పట్టుబడిన ప్రొఫెసర్ మాత్రమే కాదు. ఆయన ఆర్ఎస్ఎస్, ఎబివిపి వ్యక్తి. ప్రస్తుత యుజిసి ఛైర్మన్, మాజీ జెఎన్‌యు వైస్ ఛాన్సలర్ మామిడాల జగదీష్ కుమార్ ఆయనను నియమించారు. సిజారియా తొలుత కిర్లోస్కర్ జనరేటర్లకు సేల్స్‌మ్యాన్‌గా పనిచేశారు. ఆ తరువాత ప్రైవేట్ బిజినెస్ స్కూల్స్‌లో చేరారు. 2020లో మామిడాల జగదీష్ కుమార్ ఆయనను జెఎన్‌యులో ఫ్యాకల్టీ సభ్యుడిగా నియమించారు. 2023 నాటికి ప్రస్తుత విసి శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ ఆధ్వర్యంలో డీన్ పదవికి ఎదిగారు. విద్యాపరమైన ప్రతిభ ఆధారంగా కాకుండా రాజకీయ ప్రోత్సాహం ఆధారంగా ఎదిగారు. 2016లో ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఎబివిపి అధ్యక్షులుగా కూడా ఆయన ఉన్నారు. మామిడాల జగదీష్ కుమార్ సిజారియాకు జెఎన్‌యులో పదోన్నతి కల్పించడమే కాకుండా బిహెచ్‌యు కోర్టు, ఎఐసిటిఇ సలహా కమిటీ, నీట్, ఐఐఇఎస్‌టి శిబ్‌పూర్, ముఖ్యంగా నాక్‌లో కూడా పదవులు ఇచ్చారు. ఇప్పుడు అవినీతికి పాల్పడుతూ సిజారియా పట్టుబడ్డాడు. ఆర్ఎస్ఎస్, ఎబివిపి విద్యా సంస్థల్లో చొరబడటంతోపాటు అక్రమాలకు పాల్పడడాన్ని ఈ కేసు రుజువు చేస్తుంది. వాటిని మెరుగుపరచడానికి కాకుండా వాటిని అవినీతి, సైద్ధాంతిక నియంత్రణ కేంద్రాలుగా మార్చడానికి ఆర్ఎస్ఎస్, ఎబివిపి ప్రయత్నించాయని విమర్శించారు.

నాక్, యుజిసి అధిపతిగా ఉన్న మామిడాల జగదీష్ కుమార్ ఈ కుంభకోణానికి పూర్తి బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ పాలనలో అదుపు లేకుండా పనిచేస్తున్న ఈ లంచం నెట్‌వర్క్‌లో పాల్గొన్న ఇతరులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాక్ అక్రిడిటేషన్ ప్రక్రియపై వెంటనే దర్యాప్తు చేయాలని, అవినీతి అధికారులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం ఒక అవినీతి ప్రొఫెసర్ కేసు కాదని, ఇది భారతదేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసిన ఒక క్రమబద్ధమైన స్కామ్ అని పేర్కొన్నారు. 'సంస్థలు అనుకూలమైన అక్రిడిటేషన్ రేటింగ్‌లను కొనుగోలు చేయగలిగితే, విద్యార్థులు మోసపోతున్నారని, విద్యా ప్రమాణాలను తారుమారు చేస్తున్నారని, ప్రజల నమ్మకాన్ని నాశనం చేస్తున్నారని అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం విద్యార్థి సమాజం, ప్రగతిశీల శక్తులు ఐక్యంగా ఉండి విద్యారంగంలో ఈ కాషాయీకరణ అవినీతిని ప్రతిఘటించాలని విపి సాను, మయూక్ బిశ్వాస్ పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ మద్దతు గల శక్తులు మన విశ్వవిద్యాలయాలను రాజకీయ పక్షపాతం, లంచం, మోసానికి కేంద్రాలుగా దిగజార్చడానికి మనం అనుమతించలేమని పేర్కొన్నారు. పారదర్శక, న్యాయమైన, మెరిట్ ఆధారిత విద్యా వ్యవస్థ కోసం పోరాటం భారతీయ విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటమని తెలిపారు.

కుంభకోణం వివరాలివి...

దేశంలో ఉన్నత విద్యా సంస్థలకు ఇచ్చే నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి) అనుకూల గ్రేడ్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేయడం వెలుగులోకి వచ్చింది. రిపబ్లిక్ డే రోజున జెఎన్‌యు ప్రొఫెసర్ రాజీవ్ సిజారియా ఒక ప్రైవేట్ యూనివర్సిటీకి నాక్ తనిఖీ నివేదికను తారుమారు చేయడానికి క్యాంపస్‌లోని తన నివాసంలో లంచం కోసం చర్చలు జరిపారు. రాష్ట్రంలోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కెఎల్ఇఎఫ్) నుండి రూ.1.8 కోట్లు డిమాండ్ చేశారు. రూ.28 లక్షలకు ఒప్పందం ముగిసింది. ప్రొఫెసర్ రాజీవ్ సిజారియాకు ప్రధాన వాటా లభించింది. సిబిఐ సోదాలు నిర్వహించి, ప్రొఫెసర్ సిజారియాతో సహా పది మందిని అరెస్టు చేసింది.

కెఎల్ యూనివర్సిటీ అక్రిడిటేషన్ ఐదేళ్లపాటు నిషేధం

గుంటూరులోని కెఎల్ యూనివర్సిటీని ఐదేళ్ల పాటు అక్రిడిటేషన్ నుండి నిషేధించారు. అనిల్ సహస్రబుద్ధే నేతృత్వంలోని నాక్ కార్యనిర్వాహక కమిటీ రెండు రోజుల క్రితం అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. నాక్ కమిటీలోని ఏడుగురు సభ్యులపైనా జీవితకాలం పాటు నాక్, ఇతర కార్యకలాపాలలో నిషేధం విధించారు. 2018లో ఈ యూనివర్సిటీ నాక్ ఎ-గ్రేడ్‌లో అత్యధిక స్కోరును సాధించింది.

న్యాయం చేయండి

- ఆర్‌జి కర్ మెడికో జయంతి సందర్భంగా కొల్‌కతా, ఉత్తర 24 పరగణా జిల్లాల్లో ర్యాలీలు

కొల్‌కతా : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్‌జి కర్ ఆసుపత్రిలో అత్యాచారానికి, హత్యకు గురైన జూనియర్ డాక్టర్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కొల్‌కతాలో భారీ మౌన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. బాధితురాలి తొలి జయంతి సందర్భంగా 'అభయ్ మంచ్' బ్యానర్ కింద నిర్వహించిన ఈ ర్యాలీలో వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు సాధారణ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొల్‌కతా యూనివర్శిటీ క్యాంపస్‌కు సమీపంలోని కాలేజ్ స్క్వేర్ వద్ద నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఉత్తర కొల్‌కతాలోని ప్రభుత్వ ఆసుపత్రి వరకూ జరిగింది. అక్కడ భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో ర్యాలీ ముగిసింది. నోటికి నల్లటి గుడ్డలు కట్టుకుని, బాధితురాలికి న్యాయం చేయాలని ఉన్న ప్లకార్డులు చేతితో పట్టుకుని నిరసన తెలిపారు.

బాధితురాలి జయంతి సందర్భంగా నార్త్ 24 పరగణాస్ జిల్లాలో ఆదివారం మరొక ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బాధితురాలి తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. ఈ కేసులో సిబిఐ దర్యాప్తుతో తాము సంతృప్తి చెందడం లేదని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఇదే జిల్లాలో బాధితురాలి జ్ఞాపకార్థం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

అణుశక్తిని బలోపేతం చేయండి

- ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ ఆదేశాలు

ప్యాంగ్‌యాంగ్ : అణ్వాయుధాల తయారీని బలోపేతం చేయాలని ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన అధికారులను ఆదేశించినట్టు తెలుస్తోంది. కిమ్ ఇలాంటి ఆదేశాలను గతంలో అనేకసార్లు చేశారు. జపాన్ ప్రధాని ఇషిబా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల మధ్య తాజాగా ద్వైపాక్షిక భేటీ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. శనివారం కొరియన్ పీపుల్స్ ఆర్మీ 77వ వ్యవస్థాపక దినోత్సవంలో కిమ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ "న్యూక్లియర్ ఫోర్స్ సహా ప్రత్యర్థులను భయపెట్టే అన్ని రకాల ప్లాన్లను బలోపేతం చేయాలి. అత్యాధునిక అణ్వాయుధాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నాం" అని కిమ్ తెలిపారు. ఈ సందర్భంగా రష్యాకు తన మద్దతును పునరుద్ఘాటించారు. మాస్కో ప్రజలు, దళాలు వారి దేశ సార్వభౌమాధికారం, భద్రత, ప్రాదేశికతను కాపాడుకునేందుకు కృషి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో కిమ్ విషయంలో కొన్ని సందర్భాల్లో కఠినంగా ఉన్నా.. మరికొన్నిసార్లు చూసీచూడనట్టు వ్యవహరించారు. 2019లో వియత్నాంలో జరిగిన భేటీలో అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉత్తర కొరియా వెనక్కి తగ్గలేదు. దీంతో నాటి చర్చలు విఫలమయ్యాయి. బైడెన్ అధికారంలోకి వచ్చాక ఇరు దేశాల మధ్య దూరం మరింత పెరిగింది. ఇటీవల దక్షిణ కొరియా, జపాన్‌లతో ప్యాంగ్‌యాంగ్ సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గతేడాది ఉత్తర కొరియా వరుసగా క్షిపణి పరీక్షలు నిర్వహించింది. దక్షిణ కొరియా, అమెరికా నుంచి తమకు ముప్పు పొంచి ఉందని ప్యాంగ్‌యాంగ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. తమపై దాడికి పాల్పడితే ఎదుర్కోవడానికి అణ్వాయుధాలు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించింది.

ఢిల్లీ సిఎం పదవికి అతిషి రాజీనామా

- ఎల్‌జికి రాజీనామా లేఖ అందజేత

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం ఉదయం లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) వికె సక్సేనా నివాసానికి చేరుకున్న ఆమె.. తన రాజీనామా లేఖను సమర్పించారు. అతిషి కల్కాజీలో బిజెపి అభ్యర్థి రమేశ్ బిధూరిని 3,521ఓట్ల తేడాతో ఓడించి తన స్థానాన్ని నిలబెట్టుకున్నప్పటికీ.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే.

గెజిట్ నోటిఫికేషన్ విడుదల

ఫిబ్రవరి 7నాటి గెజిట్ నోటిఫికేషన్‌లో ఢిల్లీ ఏడో శాసనసభను లెఫ్టినెంట్ గవర్నర్ రద్దు చేశారు. "నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ యాక్ట్, 1991 ప్రభుత్వ చట్టం సెక్షన్6లోని సబ్ సెక్షన్ (2)(బి)ద్వారా నా అధికారాలను ఉపయోగించి, లెఫ్టినెంట్ గవర్నర్‌నైన నేను.. 2020 ఫిబ్రవరి 20నుంచి అమల్లోకి వచ్చిన ఢిల్లీ ఏడో శాసనసభను రద్దు చేస్తున్నాను" అని నోటిఫికేషన్ పేర్కొన్నది.

ప్రజాసేవ కోసం పనిచేయాలి : ఎమ్మెల్యేలకు కేజ్రీవాల్ సూచన

కొత్తగా ఎన్నికైన ఆప్ ఎమ్మెల్యేలు ప్రజాసేవకోసం పనిచేయాలని ఆ పార్టీ చీఫ్, ఢిల్లీ మాజీ సిఎం కేజ్రీవాల్ కోరారు. ఆదివారం న్యూఢిల్లీలోని ఫిరోజ్‌షా రోడ్‌లోని తన నివాసంలో కొత్తగా ఎన్నికైన 22 మంది ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశం తర్వాత తాజా మాజీ సిఎం అతిషి విలేకరులతో మాట్లాడుతూ.. ఆప్ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని చెప్పారు. బిజెపి ఇచ్చిన వాగ్దానాలు అమలయ్యేలా చూస్తామన్నారు. పదేళ్ల ఆప్ ప్రభుత్వం అందించిన ఉచిత సేవలు, ఇతర సౌకర్యాలను బిజెపి నిలిపివేయకుండా తమ ఎమ్మెల్యేలు బాధ్యతాయుతంగా పనిచేస్తారని వివరించారు. ఆప్ శాసనసభా పార్టీ సమావేశంలో ప్రతిపక్ష నాయకుడిని నామినేట్ చేస్తామని అతిషి చెప్పారు.

అతిషి డ్యాన్స్ సిగ్గుచేటన్న స్వాతీ మాలీవాల్

కల్కాజీ స్థానం నుంచి విజయం సాధించిన అనంతరం ఢిల్లీ తాజా మాజీ సిఎం అతిషి పార్టీ కార్యకర్తలతో కలిసి నృత్యం చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలీవాల్ దీనిపై స్పందిస్తూ.. ఆప్ ఘోర పరాజయం పొంది.. సీనియర్ నాయకులంతా ఓడిపోతే అతిషి తనకేమీ పట్టనట్టు సంబరాలు చేసుకోవడం సిగ్గు పడాల్సిన విషయమని అన్నారు.

పల్నాడులో తీవ్ర విషాదం

(మొదటిపేజీ తరువాయి)

భూమి కూడా లేని, రెక్కల కష్టం మీదే ఆధారపడి జీవిస్తున్న వారే. సంఘటనా స్థలిని పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు, సత్తెనపల్లి డిఎస్‌పి హనుమంతరావు, రూరల్ సిఐ సుబ్బారావు, ముప్పాళ్ల తహశీల్దార్ భవానీ శంకర్ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంపై స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : ముఖ్యమంత్రి

ముప్పాళ్లలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. ఈ దుర్ఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మహిళా వ్యవసాయ కూలీల మృతి బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికీ రెండెకరాల సాగు భూమి ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తే పనుల కోసం కూలీలు ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి రాదని పేర్కొన్నారు. డొంకరోడ్ల గుంటలను పూడ్చి ఇటువంటి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

చిలుకూరు ప్రధాన అర్చకునిపై సంఘ్ పరివార్ దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ బాధ్యతలు తమకు అప్పగించి రామరాజ్యంలో చేరాలని డిమాండ్ చేశారు. దాంతో అర్చకునికి, వారికి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో అర్చకునిపై దాడి చేశారు. ఈ ఘటనపై రంగరాజన్ మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. సిసి కెమెరాల ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రామరాజ్యం సంస్థ వ్యవస్థాపకులు వీరరాఘవరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని సిఐ తెలిపారు. ఈ ఘటనపై స్పందించడానికి అర్చకులు సిఎస్ రంగరాజన్ నిరాకరించారు. కాగా, రంగరాజన్ తండ్రి డా.ఎంవి సౌందర రాజన్ స్పందిస్తూ, దాడి చేసిన వారితో పాటు వారిని ప్రోత్సహించిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. అయితే అర్చకునిపై దాడి చేసినప్పుడు తీసిన వీడియోలు సోషల్ మీడియాలో రామరాజ్యం పేరుతో వైరల్ అవుతున్నాయి.

మణిపూర్ సిఎం బీరెన్ సింగ్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

బీరెన్ సింగ్ పట్ల బిజెపి ఎమ్మెల్యేల్లో ఆగ్రహం ఉంది. గతేడాది అక్టోబర్‌లో మణిపూర్‌లోని 19 మంది బిజెపి ఎమ్మెల్యేలు బీరెన్‌సింగ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రధాని మోడీకి లేఖ పంపారు. ఈ లేఖపై సంతకం చేసిన వారిలో అసెంబ్లీ స్పీకర్ తోక్‌చోమ్ సత్యబ్రత సింగ్, మంత్రులు తొంగం విశ్వజిత్ సింగ్, యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ ఉన్నారు. మణిపూర్‌లో ఇంకా శాంతి ఎందుకు పునరుద్ధరించబడలేదని ఆ రాష్ట్ర ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. త్వరగా పరిష్కారం దొరకకపోతే, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలనే డిమాండ్ వస్తుందని వివరించారు. మణిపూర్ హింసను చల్లార్చటానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని మోడీని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినా.. ఇంతవరకూ ఆయన అక్కడికి వెళ్లలేదు. పైగా, స్థానికులను అణగదొక్కటానికి భద్రతాబలగాలను మరింతగా పెంచి అక్కడి ప్రజల్లో అగ్గిరాజేశారు. దీనికితోడు సిఎం అల్లుడు, మంత్రుల ఇళ్లపై దాడులు పెరిగిపోవటంతో.. బీరెన్ రాజీనామా చేయక తప్పలేదు.

రెండేళ్లుగా కొనసాగుతున్న హింస

మణిపూర్‌లో జాతిహింస చాలా కాలంగా తీవ్రమైన సమస్యగా మారింది. రాష్ట్రంలో మెయితీ, కుకీ గ్రూపుల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు అనేక హింసాత్మక ఘర్షణలకు దారితీశాయి, వందలాది ఎంది ప్రాణాలు కోల్పోయారనీ, వేలాది మంది తమ ఇళ్లను వదిలి పారిపోవాల్సి వచ్చింది. మెయితీ, కుకీ గ్రూపుల మధ్య భూమి, రిజర్వేషన్, రాజకీయ ప్రాతినిధ్యంపై చాలాకాలంగా వివాదం ఉంది. ఇంతలో, రాష్ట్రంలో ప్రభుత్వం పక్షపాత వైఖరిని అవలంబిస్తోందని ప్రజల్లో వ్యతిరేకత తీవ్రమైంది. గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఘర్షణలు జరిగాయి. వీటిలో చాలామంది మరణించారు. అక్కడి పరిస్థితిని నియంత్రించడానికి కేంద్రం అదనపు భద్రతా దళాలను మోహరించింది.

మోస్ట్ వాంటెండ్ థార్ గ్యాంగ్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ఎస్‌పి పి.జగదీష్ నాలుగు పోలీసు బృందాలను రంగంలోకి దించి మధ్యప్రదేశ్ మారుమూల గ్రామాల్లో సైతం జల్లెడ పట్టించారు. చోరీకి పాల్పడిన వారిలో ముగ్గురు తాము దోచుకున్న సొమ్మును స్థానిక రాయల్ నగర్‌లో ఆదివారం అమ్మకానికి బేరం చేసుకుంటుండగా జిల్లా ఎస్‌పికి సమాచారం అందింది. అనంతపురం అర్బన్ డిఎస్‌పి వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిఐలు కనుమూరి సాయినాథ్, హేమంత్ కుమార్, జయపాల్ రెడ్డి, ఎస్ఐలు రాంప్రసాద్, రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బృందంగా ఏర్పడి మధ్యప్రదేశ్ రాష్ట్రం థార్ జిల్లా చడ్‌వాడు గ్రామానికి చెందిన నారుపచావర్, సావన్ అలియాస్ శాంతియదుద్యే, పిపాల్డిల్యా గ్రామానికి చెందిన సునీల్‌లను ఉన్నారు. గ్యాంగ్‌లోని మహబత్, మోట్ల పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి బంగారు, వజ్రాభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు.

నాలుగు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్

ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో థార్ గ్యాంగ్ మోస్ట్ వాంటెడ్‌గా ఉంది. ప్రస్తుతం పట్టుబడిన ముగ్గురు, పరారీలో ఉన్న ఇద్దరితో పాటు సుమారు 60 మంది ఈ గ్యాంగ్‌లో ఉన్నారు. అయితే, ఐదారుగురు కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి చోరీలు చేస్తారు. వీరంతా మధ్యప్రదేశ్ రాష్ట్రం థార్ జిల్లా టాండ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు చెందిన వారు. వీరు చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారని, డబ్బు సులువుగా సంపాదించడానికి దొంగతనాలకు పాల్పడుతున్నారని పోలీసుల విచారణలో వెల్లడైంది. థార్ గ్యాంగ్‌ను అరెస్టు చేసిన ప్రత్యేక బృందాన్ని ఎస్‌పి అభినందించారు.

మీకోసం

ఇంట్లో చేసుకునే నెయ్యి కమ్మగా ఉండాలంటే, మరిగిన తర్వాత అందులో ఒక తమలపాకును వేయాలి.

జీవన సౌరభం

మన గమ్యాన్ని నిర్ణయించేది మన చేతలు, మన నిర్ణయాలు మాత్రమే. అరచేతుల్లో గీతలు కాదు.

హితబోధ

హంసలా ఉన్నతంగా జీవించండి
హాస్యరసం అనుభూతించండి
హాయిగా నవ్వుకోండి
హింసకు పాల్పడకండి
హీంకారపు అరుపులు అరవకండి
హుకుం జారీ చేయకండి
హుందాగా ప్రవర్తించండి
హృదయాన్ని గాయపర్చేలా భాషించకండి
హెల్మెట్‌ను ధరించి ప్రయాణించండి
హేమంత ఋతువును ఆస్వాదించండి
హైలెస్సా అంటూ ఓడలో షికారు చేయండి
హోరు వానలో గొడుగుతో వెళ్ళండి
హౌరా బ్రిడ్జి మీద నడవండి
హస్త భూషణంగా పుస్తకాన్ని ధరించండి
హిస్టరీని చదివి ప్రపంచ జ్ఞానాన్ని పొందండి
హార్దిక శుభాకాంక్షలు మిత్రులకు తెల్పండి
హిమాలయాలను దర్శించండి
హిమాలయాలంత ఎత్తుకు ఎదగండి!

– ఆళ్ళ నాగేశ్వరరావు,
ఐర్లాండ్,
74166 38823.

నీడ కనిపెట్టండి

పిల్లలూ! ఇక్కడ కనిపిస్తున్న బొమ్మల నీడలు కింద వరుసలో ఉన్నాయి. సరైన నీడని జత చేయండి.

నేను గీసిన బొమ్మ

జి.శృతి,
8వ తరగతి,
డి.ఏ.వి పబ్లిక్ స్కూలు,
ఉక్కునగరం,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

ఏటేటా జాతీయ నులి పురుగుల నిర్మూలనా దినోత్సవం (ఎన్‌డిడి)ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖల నేతృత్వంలో జరుగుతున్న కార్యక్రమం. అంగన్వాడీ కేంద్రాలు, విద్యాసంస్థల్లో (ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు) చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఆల్బెండజోల్ 400 మి.గ్రాముల నమలగల మాత్రను ఏడాదికి రెండుసార్లు ఇస్తారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇవ్వటం ద్వారా 1 నుంచి 19 సంవత్సరాల పిల్లల్లో మట్టిద్వారా వ్యాపించే నులి పురుగుల (ఎస్‌టిహెచ్) సంక్రమణను నివారించవచ్చు. రాష్ట్రంలో నులిపురుగుల వ్యాప్తి ప్రస్తుతం 34 శాతం ఉంటూ ప్రజారోగ్య సమస్యగా మారుతున్నందున వాటి నివారణే లక్ష్యంగా కృషి జరుగుతోంది.

నులిపురుగుల నిర్మూలన వల్ల ...

- రోగ నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది
- పోషకాహార వినియోగాన్ని పెంచుతుంది
- రక్తహీనతను నియంత్రిస్తుంది
- నులిపురుగుల సంక్రమణను తగ్గిస్తుంది

పిల్లల్లో ఏకాగ్రత, హాజరును పెంచుతుంది. తద్వారా పని సామర్థ్యం, జీవనోపాధి అవకాశాల్లో మెరుగుదల కన్పిస్తుంది.

నులి పురుగుల నిర్మూలనా చికిత్స సురక్షితమైన చికిత్సగా ప్రపంచవ్యాప్తంగా గుర్తించారు. రాష్ట్రంలో జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని 2016 నుంచి ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఎన్‌డిడి 19వ విడత కార్యక్రమాన్ని ఈనెల 10న అమలు చేస్తున్నాం. ఆ తర్వాత 17న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మాప్ అప్ డే (ఎంయుడి) నిర్వహిస్తాం.

ఎన్‌డిడి కోసం లక్ష్యంగా పెట్టుకున్న పిల్లల వివరాలు ఇవీ...

- అంగన్వాడీ కేంద్రాల్లో 1 నుంచి 5 సంవత్సరాల పిల్లలు : 21,92,088 మంది
- అంగన్వాడీల్లో నమోదు కాని పిల్లలు : 52,2024 మంది
- విద్యాసంస్థల్లో ఉన్న 6 నుంచి 19 సంవత్సరాల పిల్లలు (ప్రభుత్వ, ప్రయివేటు): 86,06,771 మంది
- బడిబయట ఉన్న పిల్లలు 4,34,141 మంది

మొత్తంగా రాష్ట్రంలో 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలు కలిపి 1,12,95,092 మందికి ఈ మాత్రలు పంపిణీచేయటమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

మాత్రలు పంపిణీ ఇలా...

ఆల్బెండజోల్ మాత్రలను అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పంపిణీ చేస్తారు.

1–2 సంవత్సరాల పిల్లలకు సగం టాబ్లెట్

2–3 సంవత్సరాల వయస్సు గలవారికి రెండు చెంచాల మధ్య పూర్తి టాబ్లెట్‌ను చూర్ణం చేసి నీటితో కలిపి ఇస్తారు.

3–19 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి పూర్తిటాబ్లెట్‌ను ఇస్తారు. పిల్లలు మాత్రమే సరిగ్గా నమిలి మింగేలా చూడాలి.

ముందస్తుగా అవగాహనా కార్యక్రమాలు

రాష్ట్రప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినానికి ఏర్పాట్లు జరిగాయి. రాష్ట్ర కేంద్రం నుంచి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయాలు, అక్కడి నుంచి మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారి (ఎంపిడిఒ)లు, అక్కడి నుంచి ఎఎన్‌ఎంలకు మాత్రలను అందించే ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి వారు మందుల పంపిణీని సులభంగా చేసే యంత్రాంగాన్ని ఏర్పాటుచేశాం. ఇప్పటికే గ్రామాలు, పట్టణాలు, నగరాల వారీగానూ, వివిధ వయస్సుల వారీగానూ ఆయా ప్రాంతాల్లో పిల్లల గణాంకాలను సేకరించాం. ఆ సంఖ్యకు అనుగుణంగా మందుల పంపిణీకి పగడ్బందీగా చర్యలు తీసుకున్నాం. మందులు, వాటికి అవసరమైన సామగ్రి, రిజిష్టర్లు, మందులు తీసుకున్న పిల్లల వివరాలు ఇలా అన్నీ పక్కాగా నమోదు చేస్తాం. పిల్లలకు అవసరమైన సురక్షితమైన తాగునీరు, శుభ్రమైన చెంచాలు (స్పూన్లు) సైతం అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేశాం.

అవగాహనా కార్యక్రమాలు

ప్రభుత్వ పరంగా నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం రోజున ప్రత్యేక కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. ఆరోజున ముఖ్యమైన ప్రాంతాల్లో అవగాహన కోసం ప్రత్యేక వీడియోలు కూడా ప్రదర్శించే ఏర్పాట్లు జరిగాయి. ఇంకా మీడియా, వాట్సాఫ్, ఫేస్‌బుక్, ఎక్స్‌ఖాతా, ఇన్‌స్టా తదితర ప్రచార మాధ్యమాల ద్వారా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే 30, 60 సెకన్ల రేడియో సందేశాలు వినిపించే ఏర్పాట్లు చేశాం.

తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

ఈనెల 10న అంగన్వాడీ కేంద్రాలు, విద్యాసంస్థల్లోని పిల్లలందరికీ వారి వయస్సు ప్రకారం సూచించిన మోతాదు ప్రకారం మాత్రలు అందుతాయి. తల్లిదండ్రులు తమ పిల్లలు 400 మి.గ్రా మాత్రలు తీసుకునేలా చూడాలి. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు సైతం ప్రభుత్వ సూచనలు పాటించాలి. ఆరోగ్య సిబ్బంది మాత్రలు ఇవ్వటానికి వచ్చినప్పుడు అనుమతించాలి. ప్రయాణంలో ఉన్న పిల్లల కోసం ప్రజా రవాణా సౌకర్యాల వద్ద ప్రత్యేక బూత్‌లు, కౌంటర్లు ఏర్పాటుచేశాం. ఆరోజున అనారోగ్యం, ఇతరత్రా కారణాలతో మాత్రలు వేసుకోలేని వారికి మరో అవకాశంగా ఈనెల 17న వేసుకునే వెసులు బాటు కూడా కల్పించాం. మాత్రల పంపిణీని పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో ప్రత్యేక ఏర్పాట్లు సైతం చేశాం.

ఏదైనా సమస్యలొస్తే...

ప్రతి అంగన్వాడీ కేంద్రం, పాఠశాల సమీపంలోని పిహెచ్‌సి కేంద్రాల్లో ఎఎన్‌ఎంలు అందుబాటులో ఉంటారు. తేలికపాటి దుష్ప్రభావాలైన వికారం, వాంతులు, విరేచనాలు లేదా బలహీనత వంటివి ఉండొచ్చు. ఇవి పెద్ద సమస్యలేమీ కావు. త్వరగానే తగ్గిపోతాయి. పరిస్థితి విషమంగా ఉంటే 104, 108 సేవలను వినియోగించుకోవాలి. మాత్ర గొంతులో ఇరుక్కోవటం దుష్ప్రభావం కాదు. అలాంటి పరిస్థితి వస్తే పిల్లలను ఒడిలో బోర్లా పడుకోబెట్టుకుని తల కిందికి దించి వీపుపై తట్టడం చేయాలి.



– జి.వీరపాండ్యన్,
కమిషనర్,
రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, డైరెక్టర్, జాతీయ మిషన్, మంగళగిరి.

సంభాషణ : యడవల్లి శ్రీనివాసరావు

చేయాల్సినవి

- మాత్రలను అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు మాత్రమే ఇవ్వాలి
- శుభ్రమైన చెంచాలు, చేతులను మాత్రమే ఉపయోగించాలి
- 3–19 సంవత్సరాల పిల్లలు టాబ్లెట్‌ను సరిగ్గా నమలాలి

చేయకూడనివి

- అనారోగ్యంతో బాధపడుతున్న లేదా ఏదైనా మందులు వాడుతున్న పిల్లలకు నులిపురుగుల నిర్మూలనా మాత్రలు ఇవ్వకూడదు
- ఇంటికి తీసుకెళ్లడానికి పిల్లలకు, తల్లిదండ్రులకు ఇవ్వొద్దు
- ఆశా కార్యకర్తలు నేరుగా మందు ఇవ్వకూడదు

"పిల్లలందరికీ నులిపురుగుల నివారణ జరిగేలా చూసుకోవడానికి, ఆరోగ్యమైన సమాజానికి, రాబోయే తరానికి ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడేలా కలిసి పనిచేద్దాం"

– డాక్టర్ ఈవూరు ప్రశాంత్, ప్రోగ్రాం ఆఫీసర్, రాష్ట్రీయ బాలస్వస్థ్ కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె), నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం).

రోహిత్ ధనాధన్.. రెండో వన్డేలో భారత్ ఘన విజయం

- 2-0తో వన్డే సిరీస్ టీమ్ ఇండియా వశం
- రాణించిన శుభ్‌మన్, శ్రేయస్, అక్షర్ పటేల్

కటక్ : ఇంగ్లాడ్‌తో ఆదివారం జరిగిన రెండో వన్డేలో రోహిత్ శర్మ (119, 90 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్స్‌లు) దంచికొట్టాడు. 30 బంతుల్లోనే అర్థ సెంచరీ, 76 బంతుల్లోనే హిట్‌మ్యాన్ శతకం సాధించాడు. శుభ్‌మన్ గిల్ (60, 52 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (44, 47 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (41 నాటౌట్, 43 బంతుల్లో 4 ఫోర్లు) రాణించటంతో 305 పరుగుల లక్ష్యాన్ని భారత్ 44.3 ఓవర్లలోనే ముగించింది. మరో 33 బంతులు ఉండగానే 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు మ్యాచుల వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2–0తో దక్కించుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 49.5 ఓవర్లలో 304 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (69, 72 బంతుల్లో 6 ఫోర్లు), బెన్ డకెట్ (65, 56 బంతుల్లో 10 ఫోర్లు) అర్థ సెంచరీలతో మెరువగా.. జోశ్ బట్లర్ (34), లియాం లివింగ్‌స్టోన్ (41), హ్యారీ బ్రూక్ (31) రాణించారు. భారత బౌలర్లలో స్పిన్నర్ రవీంద్ర జడేజా (3/35) మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో సూపర్ సెంచరీ బాదిన రోహిత్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

హిట్‌మ్యాన్ షో : రోహిత్ శర్మ (119), శుభ్‌మన్ గిల్ (60) దంచికొట్టగా ఛేదనలో తొలి నుంచీ భారత్ దూకుడు చూపించింది. రోహిత్ శర్మ రెండో ఓవర్లోనే భారీ సిక్సర్‌తో దండయాత్ర మొదలుపెట్టాడు. రోహిత్ మెరుపులతో పవర్‌ప్లేలో భారత్ 77 పరుగులు చేసింది. నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 30 బంతుల్లోనే ఫిఫ్టీ కొట్టిన రోహిత్ శర్మ.. సెంచరీని సైతం 76 బంతుల్లోనే బాదాడు. శుభ్‌మన్ గిల్ ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 45 బంతుల్లో అర్థ సెంచరీ సాధించాడు. ఓపెనర్లు మెరువగా తొలి వికెట్‌కు భారత్ 136 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (5) విఫలమైనా.. శ్రేయస్ అయ్యర్ (44), అక్షర్ పటేల్ (41 నాటౌట్) రాణించారు. శ్రేయస్ అయ్యర్ రనౌట్ తర్వాత కెఎల్ రాహుల్ (10), హార్దిక్ పాండ్య (10) నిష్క్రమించినా.. రవీంద్ర జడేజా (11 నాటౌట్) తోడుగా అక్షర్ లాంఛనం ముగించాడు.

రాణించిన రూట్ : టాస్ నెగ్గిన ఇంగ్లాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు సాల్ట్ (26), డకెట్ (65) తొలి వికెట్‌కు 81 పరుగులు జోడించి శుభారంభం అందించారు. జో రూట్ (69), జోశ్ బట్లర్ (34), హ్యారీ బ్రూక్ (31) మెరవటంతో ఇంగ్లాండ్ 330–340 పరుగులు చేసేలా కనిపించింది. బట్లర్ నిష్క్రమణతో ఆఖర్లో లివింగ్‌స్టోన్ (41) సైతం వేగంగా ఆడలేకపోయాడు. 49.5 ఓవర్లలో ఇంగ్లాండ్ 304 పరుగులకు కుప్పకూలింది. జడేజా మూడు వికెట్లతో మాయ చేశాడు.

సిక్సర్ల వీరుడు

హిట్‌మ్యాన్ రోహిత్ వర్మ.. బారాబతి స్టేడియంలో బాణాసంచా పేల్చాడు. మెరుపు సెంచరీతో కదం తొక్కిన రోహిత్ శర్మ సిక్సర్ల పరంగా సరికొత్త రికార్డు నమోదు చేశాడు. వన్డే క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన జాబితాలో హిట్‌మ్యాన్ రెండో స్థానానికి ఎగబాకాడు. ఇంగ్లాండ్‌పై ఆదివారం ఏడు సిక్సర్లు సంధించిన రోహిత్ శర్మ.. విండీస్ వీరుడు క్రిస్ గేల్ (331)ను దాటేశాడు. 336 సిక్సర్లతో.. షాహిద్ అఫ్రిది (351) తర్వాత స్థానంలో కొనసాగుతున్నాడు. రోహిత్ శర్మకు కటక్ సెంచరీ రెండో వేగవంతమైనది. 2023 అఫ్గాన్‌పై 63 బంతుల్లోనే సెంచరీ బాదిన రోహిత్.. ఇంగ్లాండ్‌పై 76 బంతుల్లో శతకం పూరించాడు.

స్కోరు వివరాలు :

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ : ఫిల్ సాల్ట్ (సి) జడేజా (బి) వరుణ్ 26, బెన్ డకెట్ (సి) హార్దిక్ (బి) జడేజా 65, జో రూట్ (సి) కోహ్లి (బి) జడేజా 69, హ్యారీ బ్రూక్ (సి) గిల్ (బి) రానా 31, జోశ్ బట్లర్ (సి) గిల (బి) హార్దిక్ 34, లియాం లివింగ్‌స్టోన్ (రనౌట్) 41, జెమీ ఓవర్టన్ (సి) గిల్ (బి) జడేజా 6, గస్ అటిక్సన్ (సి) కోహ్లి (బి) షమి 3, ఆదిల్ రషీద్ (రనౌట్) 14, మార్క్‌వుడ్ (రనౌట్) 0, సకిబ్ మహమూద్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 15, మొత్తం : (49.5 ఓవర్లలో ఆలౌట్) 304.

వికెట్ల పతనం : 1–81, 2–102, 3–168, 4–219, 5–248, 6–258, 7–272, 8–297, 9–304, 10–304.

బౌలింగ్ : మహ్మద్ షమి 7.5–0–66–1, హర్షిత్ రానా 9–0–62–1, హార్దిక్ పాండ్య 7–0–53–1, వరుణ్ చక్రవర్తి 10–0–54–1, రవీంద్ర జడేజా 10–1–35–3, అక్షర్ పటేల్ 6–0–32–0.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) రషీద్ (బి) లివింగ్‌స్టోన్ 119, శుభ్‌మన్ గిల్ (బి) ఓవర్టన్ 60, విరాట్ కోహ్లి (సి) సాల్ట్ (బి) రషీద్ 5, శ్రేయస్ అయ్యర్ (రనౌట్) 44, అక్షర్ పటేల్ నాటౌట్ 41, కెఎల్ రాహుల్ (సి) సాల్ట్ (బి) ఓవర్టన్ 10, హార్దిక్ పాండ్య (సి) ఓవర్టన్ (బి) అటిక్సన్ 10, రవీంద్ర జడేజా నాటౌట్ 11, ఎక్స్‌ట్రాలు : 8, మొత్తం : (44.3 ఓవర్లలో 6 వికెట్లకు) 308.

వికెట్ల పతనం : 1–136, 2–150, 3–220, 4–258, 5–275, 6–286.

బౌలింగ్ : సకిబ్ మహమూద్ 6–0–36–0, గస్ అటిక్సన్ 7–0–65–1, మార్క్‌వుడ్ 8–0–57–0, ఆదిల్ రషీద్ 10–0–78–1, జెమీ ఓవర్టన్ 5–0–27–2, లియాం లివింగ్‌స్టోన్ 7–0–29–1, జో రూట్ 1.3–0–15–0.

గాయంతో సింధు ఔట్

- ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్స్



గువహటి : భారత స్టార్ షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి సింధు 2025 ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్స్ పోటీల నుంచి తప్పుకుంది. గతంలో మెడల్ సాధించిన భారత జట్టులో పి.వి సింధు కీలక పాత్ర పోషించింది. గాయంతో బాధపడుతున్న పి.వి సింధు చైనా వేదికగా జరుగనున్న ప్రతిష్టాత్మక పోటీలకు దూరమైంది. ఫిబ్రవరి 11–16న ఈ టోర్నమెంట్ జరుగనుండగా.. భారత జట్టు గువహటిలో శిక్షణ శిబిరంలో సాధన చేస్తోంది. సింధుతో పాటు లక్ష్యసేన్, హెచ్.ఎస్ ప్రణయ్, సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలు సైతం శిక్షణ శిబిరంలోనే ఉన్నారు. ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత్ కఠినమైన గ్రూప్–డిలో చోటుచేసుకుంది. గత సీజన్ రన్నరప్ దక్షిణ కొరియా, మకావులు ఈ గ్రూప్‌లో ఉన్నాయి. ఫిబ్రవరి 12న మకావు, 13న దక్షిణ కొరియాతో భారత్ తలపడనుంది. '2025 బ్యాడ్మింటన్ ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో ఆడటం లేదు. శిక్షణ శిబిరంలో సాధన చేస్తుండగా గాయమైంది. ఎంఆర్‌ఐ స్కానింగ్‌లో గాయం నుంచి కోలుకునేందుకు సమయం పడుతుందని తేలింది. భారత జట్టుకు నా శుభాకాంక్షలు' అని సింధు సోషల్ మీడియాలో వెల్లడించింది.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68